


ESTD: 1999
www.voodayam.com

# వుదయం

వరంగల్ 16-08-2026 ఆదివారం | సంపుటి : 11 | సంచిక : 248 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur
Follow us on




## గోల్కొండ కోటపై 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**హైదరాబాద్, ఆగస్టు 15 (వుదయం)** గడిచిన 32 నెలల ప్రజా పాలనలో తెలంగాణ పునర్నిర్మాణానికి బలమైన పునాదులు వేశామని, భవిష్యత్తు తెలంగాణను మరింత వేగంగా అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చారిత్రక గోల్కొండ కోటలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఈ 32 నెలల్లో ప్రజా ప్రభుత్వం సాధించిన ప్రతి విజయంలో ప్రజలు, ఉద్యోగుల భాగస్వామ్యం ఉందని కొనియాడారు.

**పెరుగుతున్న తలసరి ఆదాయం - ఆర్థిక బలం**

ఆర్బీఐ గణాంకాల ప్రకారం 202526 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931కి చేరిందని, ఇది జాతీయ తలసరి ఆదాయం కంటే 91 శాతం అధికమని సీఎం తెలిపారు. ఈ విజయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలాన్ని చాటుతోందన్నారు. ఇప్పటివరకు సాధించిన అభివృద్ధి పునాదులపై రాష్ట్ర భవిష్యత్తు ఆర్థిక పురోగతి కోసం 'తెలంగాణ రైజింగ్ 2047' బృహత్తర సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు ప్రకటించారు. వ్యవసాయంలో అగ్రస్థానం సాగునీటికి ప్రాధాన్యం

రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని, వరి సాగు విస్తీర్ణం మరియు దిగుబడిలో తెలంగాణ రాష్ట్రం పంజాబ్‌ను అధిగమించి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని సీఎం పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటాను దక్కించుకుంటామని, తుమ్మిడిహెట్టి నుంచి పాలమూరు వరకు పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యక్రమంలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాలు సామాజిక భద్రత రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. 93 లక్షలకు పైగా కుటుంబాల్లోని 3.38 కోట్ల మందికి ప్రజా పంపిణీ వ్యవస్థ పరిధిలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు పారదర్శకత కోసం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించినట్లు వెల్లడించారు.

## యువత, సంక్షేమానికి ప్రాధాన్యం

**న్యూఢిల్లీ, ఆగస్టు 15 (ఎఎంఎస్) :** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోట పైనుంచి ప్రధాని నరేంద్ర మోదీ దేశ యువతను ఉద్దేశించి పలు విప్లవాత్మక కార్యక్రమాలను ప్రకటించారు. దేశంలో కోటి మంది యువకులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వడంతో పాటు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ నిర్ణయం యొక్క ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. జనగణనలో యువత చురుగ్గా పాల్గొనాలి ప్రస్తుతం దేశంలో చేపడుతున్న జనాభా గణన ప్రక్రియను ప్రస్తావిస్తూ.. యువత ఇందులో భాగస్వామ్యం కావాలని ప్రధాని పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ రోజుకు



గంట లేదా రెండు గంటల సమయాన్ని ఈ కార్యక్రమానికి కేటాయించాలని కోరారు. జనాభా గణన అనేది కేవలం అంకెల సేకరణ మాత్రమే కాదని, ప్రజలు ఇచ్చే కచ్చితమైన వివరాల ఆధారంగానే భవిష్యత్తు జాతీయ విధానాలు, సంక్షేమ పథకాలు రూపుదిద్దుకుంటాయని పేర్కొన్నారు. కాబట్టి పౌరులందరూ స్పష్టమైన సమాచారాన్ని అందించి దేశ ప్రగతికి సహకరించాలని సూచించారు.

## రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫొటో ఎందుకు లేదు?

**హైదరాబాద్, ఆగస్టు 15 (వుదయం)** పాతబస్తీలోని ప్రసిద్ధ భాగ్యలక్ష్మి ఆలయం వేదికగా లక్షలాది మందితో సామూహిక వందేమాతర గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రకటించారు. ధైర్యముంటే ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని ఎంఐఎం నాయకులకు ఆయన నేరుగా సవాల్ విసిరారు. వందేమాతరం గీతాన్ని అవమానించే వారిపై చట్టప్రకారం మూడేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశముందని స్పష్టం చేశారు. రాజ్యాంగం మరియు చట్ట పరిధిలోనే వ్యవహరిస్తున్న తమను మతతత్వవాదులుగా చిత్రీకరించడం తగదని మండిపడ్డారు.



**స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటో ఏది?**

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు మాత్రమే ముద్రించడాన్ని బండి సంజయ్ తీవ్రంగా తప్పుపట్టారు. తెలంగాణలో దాదాపు రెండు కోట్ల మందికి కేంద్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం అందిస్తుండగా, ఆ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను ఎందుకు కేటాయించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చే ఉచిత బియ్యం రాష్ట్రానికి అవసరం లేదా అని ప్రశ్నించారు.

## సిటీ సివిల్ కోర్టులో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**హైదరాబాద్, ఆగస్టు 15 (వుదయం) :** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సిటీ సివిల్ కోర్టులో జాతీయ జెండాను జాతీయ కార్యదర్శి శ్రీ ఎస్. వి. సుబ్బయ్య గారు ఆవిష్కరించారు. ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో సూర్యనారాయణ గారు, వజ్రం గారు, సాయి కుమార్ గారు, ప్రసాద్ గారు, సురేందర్ గారు, ఉదయ్ కుమార్ గారు, వర్మ గారు, కృష్ణ యాదవ్ గారు, నరేష్ యాదవ్ గారు, రాకేష్ గారు, మనీష్ గారు, చైతన్య గారు, సంధ్యారాణి గారు, స్వప్న గారు, సుధ గారు, జయలక్ష్మి గారు మరియు సిబ్బంది సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ సమగ్రత, ఐక్యత మరియు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

## ఇరిఫామ్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**రైల్వే రంగాభివృద్ధికి సమర్థవంతమైన శిక్షణే ప్రాధాన్యం**
**ఇరిఫామ్ వేడుకల్లో ఏడీజీ సత్యనారాయణ**



**హైదరాబాద్, ఆగస్టు 15 (వుదయం) :** సికింద్రాబాద్ మౌలాలిలోని ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ (IRIFM) క్యాంపస్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత దేశభక్తి, ఉత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. IRIFM అదనపు డైరెక్టర్ జనరల్ (ADG) డాక్టర్ కే.వి.వి. సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మువ్వన్నెల జెండాకు వందనం సమర్పించారు. అనంతరం సంస్థకు చెందిన శిక్షణ అధికారులు, అధ్యాపకులు మరియు సిబ్బందిని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

**దేశాభివృద్ధిలో రైల్వేలు, శిక్షణా సంస్థల పాత్ర**

తన స్వాతంత్ర్య దినోత్సవ సందేశంలో ADG డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ, భారతీయ రైల్వేలు సాధిస్తున్న పురోగతిని, వ్యవస్థలో జరుగుతున్న గుణాత్మక మార్పులను వివరించారు. రైల్వే వ్యవస్థను మరింత బలపరచడంలో మరియు దేశ వృద్ధికి తోడ్పడటంలో ఉద్యోగుల శ్రమతో పాటు శిక్షణా సంస్థల పాత్ర ఎంతో కీలకమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా ఇరిఫామ్‌లో శిక్షణ పొందుతున్న ఇండియన్ రైల్వే మెడికల్ సర్వీసెస్ (IRHS) ప్రొబేషనరీ వైద్యులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భారతీయ రైల్వే రంగానికి అత్యుత్తమ శిక్షణను, నిర్వహణ సామర్థ్యాన్ని అందించడమే ధ్యేయంగా ఈ వేడుకలు ముగిసాయి.

## హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో ఘనంగా స్వాతంత్ర వేడుకలు



**హైదరాబాద్, ఆగస్టు 15 (వుదయం)** స్వాతంత్ర దినోత్సవ వేడుకలను సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆవరణలో శనివారం నాడు ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్. విజయకుమార్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ. రాజేష్ ,జాయింట్ సెక్రెటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్ధెల్లి బాబురావు, కోశాధికారి రమేష్ వైట్ల, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎన్. శ్రీనివాస్ రెడ్డి, ముత్యాల సత్తిబాబు, వనం నాగరాజు, శిగ శంకర్ గౌడ్, ఎన్. ఉమాదేవి , రచన ముడింబి, అమిత్ బట్టు,సీనియర్ జర్నలిస్టులు, చిన్నపత్రికల సంఘం నేతలు యూసుఫ్ బాబు, అగస్టీన్, గొల్ల రమేష్ ,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. స్వతంత్ర సాధన కోసం పోరాటం చేసిన త్యాగధనుల సేవలను ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ పాలకమండలి గుర్తు చేసింది. జాతీయ నేతల స్ఫూర్తిని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయకుమార్ రెడ్డి, రమేష్ వరికుప్పల అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్ ఇండియా తొలిసారిగా హైదరాబాదులో మీడియా స్వేచ్ఛ జర్నలిస్టుల రక్షణపై ఈనెల 22, 23వ తేదీల్లో భారీ కాన్‌క్లేవ్ నిర్వహించనున్నట్టు విజయకుమార్ రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు. దేశంలోని ప్రెస్ క్లబ్ ల నేతలు ప్రముఖ సీనియర్ జర్నలిస్టులు ఈ రెండు రోజుల జాతీయ సదస్సులో పాల్గొంటారని విజయకుమార్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ రెండు రోజుల జాతీయ సదస్సును విజయవంతం చేయడానికి సన్నాహాలు ప్రారంభించినట్లు వివరించారు.

## దేశభక్తికి నిలువెత్తు రూపమైన త్రివర్ణ పతాకానికి అవమానం!

- కోటపల్లిలో జాతీయ జెండాను తలక్రిందులుగా ఎగురవేసిన హెచ్ఎం
- గ్రామస్తుల తీవ్ర ఆగ్రహం



**కోటపల్లి ఆగస్టు 15 (వుదయం) :** మంచిర్యాల జిల్లా కోటపల్లిలో "దేశమంటే మట్టి కాదు... దేశమంటే మనుషులోయ్" అన్న మహాకవి మాటలను స్మరిస్తూ, ఎందరో మహానుభావుల త్యాగఫలమైన స్వాతంత్ర్య దినోత్సవాన్ని దేశమంతా పవిత్రంగా జరుపుకుంటుంది. స్వేచ్ఛా వాయువులను పీల్చుకునేలా చేసిన ఆ త్రివర్ణ పతాకం మన జాతి ఆత్మగౌరవానికి ప్రతీక. అలాంటి జాతీయ జెండాను గుండెల్లో పెట్టుకుని గౌరవించాల్సిన భాధ్యతాయుత స్థానంలో ఉన్న ఒక ఉపాధ్యాయుడే, కనీస స్పృహ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం యావత్ సమాజాన్ని తలదించుకునేలా చేసింది. కోటపల్లి మండల వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీలు, అంగన్వాడీ కేంద్రాల్లో త్రివర్ణ పతాకాలు సగర్వంగా ఎగురుతుంటే... దేవాల్వాడ జెడ్పీ హైస్కూల్‌లో మాత్రం దీనికి విరుద్ధంగా గర్హనీయమైన ఘటన చోటుచేసుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు జాతీయ జెండాను తలక్రిందులుగా ఎగురవేశారు. దేశ స్వాతంత్ర్య కోసం ప్రాణాలర్పించిన అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన వేళ, దేశ పతాకానికి జరిగిన ఈ అవమానం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. స్థానికుల అప్రమత్తత... బాధ్యతారహిత వైఖరి జెండా తలక్రిందులుగా ఎగురుతున్న విషయాన్ని అక్కడున్న స్థానికులు గమనించి వెంటనే హెచ్ఎం దృష్టికి తీసుకువెళ్లారు. అయితే, జాతీయ గీతాలాపన పూర్తయిన తర్వాతే హడావుడిగా జెండాను సరిచేశారు. ఆ తర్వాత ఎలాంటి పశ్చాత్తాపం లేకుండా విద్యార్థులకు, గ్రామస్తులకు స్వీట్లు పంపిణీ చేయడం పట్ల ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్ భావి భారత పౌరులను తీర్చిదిద్దాల్సిన గురువే దేశ పతాకంపై కనీస అవగాహన లేకుండా ప్రవర్తించడం క్షమించరాని నేరమని గ్రామస్తులు, ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతి గౌరవాన్ని కించపరిచేలా ప్రవర్తించి, ప్రజల మనోభావాలను దెబ్బతీసిన ఈ ఘటనపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, బాధ్యులైన ప్రధానోపాధ్యాయుడిపై అత్యంత కఠినమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. కానీ, ఈ పొరపాటు మాత్రం అందరిలోనూ దేశభక్తి పట్ల కలుగుతున్న నిర్లక్ష్యంపై తీవ్ర ఆవేదనను మిగిల్చింది.

## ఇంతే కదా...!




## 'హర్మూజ్ రవాణా మా నిర్ణయమే'

**తెహ్రాన్:** హర్మూజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ అమెరికాదేనంటూ డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రస్థాయిలో ఖండించింది. ఈ కీలక సముద్ర మార్గం ఎప్పటికీ తమ అదుపులోనే ఉంటుందని, దీనిని ఏ విదేశీ శక్తి ఆక్రమించుకోలేదని స్పష్టం చేసింది. జలసంధి ద్వారా నౌకల రాకపోకలను తెరవాలా లేదా మూసివేయాలో తీర్మానించే హక్కు పూర్తిగా తమ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని తేల్చిచెప్పింది.

**యుద్ధ నౌకలతో జలసంధిని స్వాధీనం చేసుకోలేరు**

హర్మూజ్ జలసంధికి సంబంధించి అమెరికా తన అవాస్తవ భ్రమలను విడిచిపెట్టాలని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ హితవు పలికారు. కేవలం యుద్ధ నౌకలను మోహరించినంత మాత్రాన ఈ సముద్ర మార్గాన్ని స్వాధీనం చేసుకోవడం అసాధ్యమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. అమెరికా తన ఓటమిని అంగీకరించే వరకు హర్మూజ్‌పై ఇరాన్ దిగ్బంధనం కొనసాగుతుందని, ఎలాంటి బెదిరింపులకు లేదా సైనిక ప్రదర్శనలకు తాము లొంగేది లేదని స్పష్టం చేశారు.



**ఇరాన్ అనుమతి లేనిదే నౌకల రాకపోకలు అసాధ్యం**

హర్మూజ్ ద్వారా నౌకలు స్వేచ్ఛగా ప్రయాణిస్తున్నాయంటూ అమెరికా చెబుతున్న మాటలు పూర్తిగా అసత్యాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే జలసంధిపై పూర్తి ఆధిపత్యం తమదేనని, ఇరాన్ సాయుధ దళాల అనుమతి లేనిదే ఏ వాణిజ్య నౌక కూడా ఈ మార్గంలో ప్రయాణించలేదని స్పష్టం చేశారు.

## అత్యాధునిక సాంకేతికతలపై రైల్వే సిబ్బందికి శిక్షణ

**జాతీయ జెండాను ఆవిష్కరించిన డిజి పియూష్ కుమార్ గుప్తా**

**ఇరిసెట్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనం**

**సికింద్రాబాద్, ఆగస్టు 15 (వుదయం):** సికింద్రాబాద్‌లోని ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీరింగ్ అండ్ టెలికమ్యూనికేషన్స్ (IRISET) క్యాంపస్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిసెట్ డైరెక్టర్ జనరల్ శ్రీ పియూష్ కుమార్ గుప్తా జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణకు ముందు 'వందేమాతరం' జాతీయ గేయాన్ని ఆలపించారు. అనంతరం అధ్యాపకులు, సిబ్బంది మరియు ట్రైనీలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. వేడుకల్లో భాగంగా ట్రైనీలు, సిబ్బంది ఆలపించిన దేశభక్తి గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి డైరెక్టర్ జనరల్ బహుమతులు అందజేశారు. ఉద్యోగులందరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేస్తూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలని సంస్థ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఇన్స్టిట్యూట్ ఆవరణలో హర్ ఘర్ తిరంగా థీమ్‌తో ప్రత్యేక సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇరిసెట్ అధ్యాపక బృందం క్యాంపస్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించింది.



# ఘనంగా 80వ స్వాతంత్ర వేడుకలు

మరికల్ ఆగస్టు 15
(వుదయం ప్రతినిధి)



మరికల్ ధన్వాడమండల కేంద్రంలో మరియు వివిధ గ్రామాలలో శనివారం ఘనంగా 80వ స్వతంత్ర వేడుకలు జరుపుకున్నారు తెల్లవారుజామున లేచి విద్యార్థులు ఉపాధ్యాయులు నాయకులు విద్యార్థులతో వీధి వీధి గుండా తిరుగుతూ స్వాతంత్ర ఉద్యమాలు పోరాడి తీసుకొచ్చిన నాయకుల పేరు జపిస్తూ బ్రిటిష్ వారు తో పోరాడి తీసుకొచ్చిన స్వతంత్రమని గుర్తు చేశారు మరియు మాత్మ గాంధీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలగంగాధర్ పండిత్ జవహర్లాల్ నెహ్రు బా తో పాటు లాస్ బహదూర్ శాస్త్రి భగత్ సింగ్ అల్లూరి సీతారామరాజు ఇంటి గొప్ప నాయకులు బ్రిటిష్ వారితో పోరాడి తీసుకొచ్చిన స్వాతంత్రాన్ని ఘనంగా జరుపుకున్నారు ప్రభుత్వ కార్యాలయం లో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో వివిధ గ్రామా పంచాయతీలో మూడు రంగుల జెండా ఎగురవేశారు తర్వాత విద్యార్థుల కు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు అఖిలపక్ష నాయకులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ షేక్ సాబేర్‌కు ఘన సన్మానం

కోహీర్ ఆగస్టు 15 (వుదయం ప్రతినిధి )



ఆటోరిక్షా డ్రైవర్‌గా పనిచేస్తున్న షేక్ సాబేర్ గత 23 ఏళ్లుగా నిరాటంకంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నారు. ప్రమాదాలు లేదా హత్యలు జరిగిన అత్యంత క్లిష్టమైన ప్రదేశాల నుండి మృతదేహాలను ఎంతో శ్రద్ధతో, బాధ్యతగా ఆసుపత్రులకు తరలించడంలో ఆయన విశేష సేవలు అందించారు. చాలామంది చూడటానికి కూడా సంకోచించే సంఘటనా స్థలాల్లో ఆయన చూపిన ధైర్యం, మానవత్వం ఎందరికో ఆదర్శంగా నిలిచాయి.

ఈ నేపథ్యంలో, 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కోహీర్ జంక్షన్ వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాన్ని ఎంతో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోహీర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు మహమ్మద్ ముజఫర్ హుస్సేన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం, సమాజానికి షేక్ సాబేర్ అందించిన నిష్కామ సేవలను కొనియాడుతూ ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా షాబేర్ కు నగదు బహుమతిని అందజేసి తమ అభినందనలను తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆటో యూనియన్ కార్మికులు , కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు పాల్గొని సన్మాన గ్రహీతను అభినందించారు. ఈ కార్యక్రమంలో కోహీర్ మున్సిపల్ ఛైర్మన్ ఎం.ఛైర్మన్. కోహీర్ మండలం అధ్యక్షులు టీ సువర్ణ మల్లన్న పటేల్. కౌన్సిలర్ ఉషా రాణి. లాయక్. మహమ్మద్ హమీద్. షాకీర్ అల్లి. శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు

# మాజీ ఎమ్మెల్యే చిట్టెంనర్సిరెడ్డికి ఘనంగా నివాళులు

మరికల్ ఆగస్టు 15 ( వుదయం ప్రతినిధి)



ధన్వాడ మండల కేంద్రంలోని శనివారం ఘనంగా క్రీస్తు శేషులు మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు మరియు కుమారుడు చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి కి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు ఆగస్టు 15న నారాయణపేట గడ్డపై జెండా వందనం కార్యక్రమానికి వెళుతుండగా నక్సలైట్ల చేతుల్లో బలి అయిన తండ్రి కొడుకు జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు మహబూబ్నగర్ బిజెపి ఎంపీ డీకే అరుణ మ్మ మరియు టిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మరియు వెంకటేశ్వర్ రెడ్డి కుమారుడు అభినయ రెడ్డి డి సి జి మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి సమాధులకు పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు ఈ కార్యక్రమానికి వివిధ రాజకీయ నాయకులు మరియు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఘనంగా 80 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు

- పాల్గొన్న అధికారులు...

తాండూర్ ఆగస్టు 15
వుదయము ప్రతినిధి:-



తాండూర్ మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఉత్సాహంగా, ఘనంగా ముగిశాయి. మండల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు మరియు 33 గ్రామ పంచాయతీలలో త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడింది.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, మండల స్థాయి అధికారులు మరియు ప్రజాప్రతినిధులు జాతీయ జెండాను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రధాన కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణలు:**

తాసిల్దార్ కార్యాలయం: తాసిల్దార్ తారా సింగ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఎంపీడీవో కార్యాలయం: మండల అభివృద్ధి అధికారి విశ్వప్రసాద్ జెండాను ఎగరవేశారు.పంచాయతీ రాజ్ ఇఈ కార్యాలయం: శ్రీనివాస్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.పంచాయతీ రాజ్ డిఈ కార్యాలయం: నాగభూషణం జెండాను ఎగురవేశారు.ఏటిఓ (ATO) కార్యాలయం: వెంకటరమణ జెండా ఆవిష్కరణ చేశారు.

వ్యవసాయ శాఖ కార్యాలయం: ఏవో కొమరయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఉపాధి హామీ కార్యాలయం: ఏపీఓ నరోత్తం రెడ్డి జెండాను ఎగరవేశారు.ఐకేపీ (IKP) కార్యాలయం: బాలయ్య జెండా ఆవిష్కరణలో పాల్గొన్నారు.అంగన్‌వాడీ (ICDS) కార్యాలయం: సూపర్వైజర్ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. పశుసంవర్ధక శాఖ కార్యాలయం: సంబంధిత శాఖాధికారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జెండా ఆవిష్కరణ అనంతరం అధికారులు, సిబ్బంది దేశానికి స్వతంత్ర సమర యోధులు చేసిన నిరుపమాన సేవలను, త్యాగాలను స్మరించుకున్నారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లోనూ సర్పంచ్‌లు, కార్యదర్శుల ఆధ్వర్యంలో వేడుకలు కన్నులపండువగా సాగాయి. చివరగా ఒకరికొకరు స్వీట్లు పంచుకుని స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు ఈ కార్యక్రమంలో వివిధ శాఖల సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి పదవిపై కోమటిరెడ్డి సీరియస్!

- రాజగోపాల్‌రెడ్డి తిరుగుబాటు స్వరం.. కాంగ్రెస్‌లో మళ్లీ ప్రకంపనలు
- మంత్రి పదవి హామీ అమలుకాలేదన్న అసంతృప్తే కారణమా?
- సొంత ప్రభుత్వంపైనే వరుస విమర్శలు.. హైకమాండ్‌కు పీసీసీ ఫిర్యాదు
- "తెలంగాణ కోసం పోరాడిన వారికి, నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు గుర్తింపు దక్కాలి"

వికారాబాద్ ఆగస్టు 15
(వుదయం బ్యూరో)



కాంగ్రెస్ ప్రభుత్వంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యవహారం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. పార్టీపై, ప్రభుత్వంపై ఆయన చేస్తున్న వరుస బహిరంగ విమర్శలు కాంగ్రెస్‌లో చర్చకు దారితీస్తున్నాయి. ఎన్నికల సమయంలో మంత్రి పదవి ఇస్తామని హైకమాండ్ హామీ ఇచ్చిందన్న ప్రచారం నేపథ్యంలో.. ఆ హామీ అమలు కాకపోవడమే ఆయన అసంతృప్తికి ప్రధాన కారణమా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో కొంతకాలం మౌనం పాటించిన రాజగోపాల్‌రెడ్డి.. ఆ తర్వాత ప్రభుత్వ విధానాలపై తన స్వరం పెంచుతూ వచ్చారు. మునుగోడు నియోజకవర్గానికి తగినంత అభివృద్ధి జరగడం లేదని, నిధుల కేటాయింపులో అసమానతలు ఉన్నాయని విమర్శించారు. అవసరమైతే నియోజకవర్గం కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమని గతంలో ప్రకటించారు. నిరుద్యోగ సమస్యపైనా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**ఎవరిని ఉద్దేశించి?**

తాజాగా తెలంగాణ ఉద్యమంతో, కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని కొందరు పెద్ద పదవులు అనుభవిస్తున్నారని, రాజకీయాలను దోపిడీ కోసం ఉపయోగిస్తున్నారని రాజగోపాల్‌రెడ్డి చేసిన ఘాటు వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేపాయి. ప్రజాపాలన అంటే పేదల కోసం పనిచేయాలని, పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లు, ప్రభావశీలుల ప్రయోజనాల కోసం కాదని ఆయన వ్యాఖ్యానించారు.

**కాంగ్రెస్ ముందున్న మూడు మార్గాలు**

ప్రస్తుతం కాంగ్రెస్ నాయకత్వం ముందు ప్రధానంగా మూడు మార్గాలు కనిపిస్తున్నాయి.

ఒకటి: మంత్రి పదవిపై స్పష్టత ఇచ్చి రాజగోపాల్‌రెడ్డిని బుజ్జగించడం.

రెండు: బహిరంగ విమర్శలకు క్రమశిక్షణ చర్యలతో చెక్ పెట్టడం.

మూడు: మంత్రి పదవి అంశాన్ని పక్కనపెట్టి రాజకీయ రాజీ ఫార్ములాతో వివాదాన్ని చల్లార్చడం.

**మంత్రి పదవితో అసంతృప్తికి తెరదించుతారా?**

**క్రమశిక్షణ చర్యలతో రాజగోపాల్‌రెడ్డి స్వరాన్ని కట్టడి చేస్తారా?**

**లేక మధ్యేమార్గంలో రాజకీయ రాజీకి తెరతీస్తారా?**

కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకోబోయే తదుపరి నిర్ణయమే తెలంగాణ రాజకీయాల్లో ఈ వ్యవహారానికి దిశానిర్దేశం చేయనుంది.

# తాండూరు మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం

- రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి......
- ఏడాదిలోగా నూతన మార్కెట్ యార్డు ప్రారంభం..
- కాగ్నా నదిపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణం....
- తాండూరు పట్టణ ప్రజలకు రెండు టైములో మంచినీళ్లు అందించడమే ధ్యేయంగా... పనులు చేపడతాం...
- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

తాండూరు ఆగస్టు 14
వుదయం ప్రతినిధి :



తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం పట్టణంలోని క్లాసిక్ గార్డెన్స్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాండూరు శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా వడ్డే శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా షేక్ కాశీంలతో పాటు పాలకవర్గ సభ్యులు పదవీ ప్రమాణస్వీకారం చేశారు.రైతు సంక్షేమమే మన బాధ్యతకార్యక్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ... నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్, వైస్ చైర్మన్ మరియు సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రైతుల అభ్యున్నతే లక్ష్యంగా మార్కెట్ కమిటీని సమర్థవంతంగా నిర్వహించాలని, తాండూరు ధాన్యానికి మంచి గ్రేడింగ్ మరియు మార్కెట్ గుర్తింపు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. "నేను కూడా ఒక రైతునే కాబట్టి, రైతుల కష్టాలు, సమస్యలు నాకు స్వయంగా తెలుసు. రైతు సోదరుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తాను అన్నరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనూతన మార్కెట్ యార్డు: ఏడాది వ్యవధిలోనే తాండూరులో నూతన మార్కెట్ యార్డును అందుబాటులోకి తీసుకు వస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు: కోట్ పల్లి, జుంటుపల్లి, శ్రీరాముల వారి ప్రాజెక్టులను పునరుద్ధరించి, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామన్నారు. కాగ్నా నదిపై వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదిక (సిద్ధం చేయించి, అవసరమైన ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తామని తెలిపారు.శాశ్వత తాగునీటి పరిష్కారం: కాగ్నా నది ద్వారా తాండూరు పట్టణ ప్రజలకు శాశ్వత తాగునీటి వెసులుబాటు కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇదే క్రమంలో సార్ ప్రక్రియను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించి, ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్యపరిచిన బి ఎల్ ఏ లు, ప్రజాప్రతినిధులు మరియు నాయకులకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ అధికారులు, స్థానిక నాయకులు, రైతులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఊర్కొండలో గొంతు కోసుకున్న గుర్తుతెలియని వ్యక్తి

ఊర్కొండ న్యూస్ 15
వుదయం ప్రతినిధి



నాగర్‌కర్నూల్ ఊర్కొండ మండల కేంద్రంలో ఓ వ్యక్తి గొంతు కోసుకొని ఆత్మహత్యకు యత్నించిన ఘటన కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి తీవ్ర రక్తస్రావంతో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని చికిత్స నిమిత్తం కల్వకుర్తి గవర్నమెంట్ హాస్పిటల్ తరలించడం ఘటనకు గల కారణాలు, వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఈ ఘటనపై వివరాలు సేకరిస్తున్నారు.

# ఊర్కొండ లో ప్రజావాణి కార్యాక్రమము ప్రారంభం

- ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి ఆధ్వర్యంలో

ఊర్కొండ న్యూస్ 1
5వుదయం ప్రతినిధి



నాగర్ కర్నూల్ జిల్లా ఉరుకొండ మండలం మండల ప్రజా పరిషత్ కార్యాలయము ఊర్కొండ నందు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యాక్రమము కలదు. ప్రతి సోమవారం ఉదయం 1000 గంటల నుండు మధ్యాహ్నం 0100 వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయము ఊర్కొండ నందు నిర్వహించబడును. ఊర్కొండ మండలములోని అన్ని గ్రామాల నుండి వచ్చే ప్రజల ఫిర్యాదులు, వినతులను స్వీకరించి, సమస్యలను పరిష్కారించేందుకు గాను ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల ప్రకారము చేపడుతున్నాము. అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావలి ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు అందరూ సమయానికి హాజరు కావాలని ఆదేశించారు. కె.సత్యపాల్ రెడ్డి, ఎంపీడీఓ,ఎంపీపీ.ఊర్కొండ .

# రెండువాహనలు డీ యువకుడు మృతి

నాగల్‌గిద్ద, ఆగస్టు 15(వుదయం)



నారాయణఖేడ్ నియోజక వర్గ పరిధిలోని నాగల్‌గిద్ద మండలం గూడూరు గ్రామానికి చెందిన సాగర్ ఆంజనేయులు (తండ్రి: మాణిక్, వయసు: 21 సంవత్సరాలు) శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాల ప్రకారం.. ఉదయం సుమారు 7 గంటల సమయంలో సాగర్ ఆంజనేయులు ఓ ఉపాధ్యాయురాలిని బైక్‌పై గూడూరు నుంచి నాగల్‌గిద్దకు తీసుకువచ్చి అక్కడ దింపాడు. అనంతరం తిరిగి బైక్‌పై గూడూరుకు బయలుదేరాడు. ఈ క్రమంలో గూడూరు బ్రిడ్జి వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న పాల ఆటో, బైక్ ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సాగర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన విషయం ఉదయం 7:30 గంటలకు నాగల్‌గిద్ద పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందింది. సమాచారం అందుకున్న ఏఎస్ఐ రవీందర్ వెంటనే సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పాల ఆటోను గూడూరు గ్రామానికి చెందిన మాలేగావ్ విజయ్ నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. విజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్ఐ రవీందర్ తెలిపారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణఖేడ్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. యువకుడి మృతితో గూడూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# సాంకేతిక విప్లవానికి యువత నడుం బిగించాలి!

- దేశానికి 'తిరిగి ఇచ్చే' తపన పెరగాలి
- ఎంఏఎల్డీ ప్రభుత్వ కళాశాలలో ఘనంగా 80వ స్వాతంత్ర్య వేడుకలు

గద్వాల ఆగస్టు 15
(వుదయం బ్యూరో)



స్వాతంత్ర్య సమరయోధుల అసమాన ప్రాణత్యాగాలను కేవలం స్మరణలకే పరిమితం చేయకుండా, వారి పవిత్రాశయాలను ఆచరణలో పెట్టి శ్రేష్ఠ భారత నిర్మాణంలో యువత సమరశంఖం పూరించాలని మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాచార్యులు (ప్రిన్సిపాల్) ఆచార్య షేక్ కలందర్ భాష ఉద్ఘాటించారు. త్యాగధనులు ప్రసాదించిన స్వేచ్ఛాయుత సమాజ లక్ష్యాలు నెరవేరిన పుడే ఈ ఉత్సవాలకు పరిపూర్ణ సార్థకత చేకూరుతుందని ఆవేశపూరితంగా స్పష్టం చేశారు. ఆచార్య షేక్ కలందర్ భాష అధ్యక్షతన జరిగిన ఈ సభలో స్వాతంత్ర్య పోరాట యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

ఉద్యోగ కాంక్షే కాదు..

**దేశ శ్రేయస్సే ధ్యేయం కావాలి!**

యువతను ఉద్దేశించి ప్రాచార్యులు మాట్లాడుతు.. "విద్యార్థుల ఆలోచనా ధోరణి కేవలం ఒక ఉద్యోగాన్ని సాధించడంతోనే ముగిసిపోకూడదు. దేశం నుంచి అవకాశాలు పొందడమే కాదు.. మన ప్రతిభతో ఈ మాతృభూమికి ఏమి తిరిగి ఇస్తున్నామనే తపన ప్రతి ఒక్కరి రక్తంలో రగలాలి" అని పిలుపునిచ్చారు. శాస్త్ర, సాంకేతిక, ఆర్థిక రంగాల్లో భారత్ వినువీధిలో దూసుకెళ్తున్న వేళ, నైతిక విలువలు కలిగిన యువత మాత్రమే దేశాన్ని జగజ్జేతగా నిలపగలదని నొక్కి చెప్పారు. మార్మోగిన దేశభక్తి నాదం.. విజేతలకు పురస్కారాలు అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి గేయాలు, సాంస్కృతిక రూపకాలు అలరించాయి. వేడుకల సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీలతో పాటు కబడ్డీ, కోకో వంటి మైదాన క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉప ప్రాచార్యులు డాక్టర్ కే. చంద్రమోహన్, నాణ్యతా ప్రమాణాల సమన్వయకర్త ఏ. రాధిక, అధ్యాపకులు వి. సురేందర్ రెడ్డి, డాక్టర్ సత్యన్న, డాక్టర్ సత్తెమ్మ, డాక్టర్ వెంకటేశ్వరమ్మ, కే. భాస్కర్, ఎం.హెచ్. నాగభూషణం, కళాశాల కార్యాలయ సూపరింటెండెంట్ జి. రమేష్, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

అయిజ, ఆగస్టు 15
(వుదయం ప్రతినిధి)



భూంపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా గత విద్యాసంవత్సరంలో పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.గ్రామ పెద్ద నరసింహారెడ్డి తన తండ్రి స్వర్గీయ గోపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా పాఠశాలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు.పదవ తరగతిలో 564 మార్కులతో మొదటి స్థానంలో నిలిచిన బి. సురేంద్రకు రూ.5,000, 544 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన ఈ. ఇందుకు రూ.3,000, 517 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిన మహేష్‌కు రూ.2,000 నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం ఇదే విధంగా విద్యార్థులను ప్రోత్సహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి మరింత మంచి మార్కులు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎం. భీమేశ్వర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ సరోజమ్మ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సరోజమ్మ, ఉపసర్పంచ్ వెంకన్న, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు రవి ప్రకాష్‌రెడ్డి, రఫీ, ఉమాదేవి, శ్రీవాణి, ఐసీటీ ఇన్‌స్ట్రక్టర్ నాగవేణి, గ్రామ పెద్దలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- "పదో తరగతిలో ఉత్తీర్ణత పొందిన పూర్వ విద్యార్థుల కు బహుమతులు ప్రదానం "
- "మొదటి బహుమతి గీతాంజలి రెండవ బహుమతి అంకితకు లకు నగదు అందజేత "

కోహీర్ ఆగస్టు 15
(వుదయం ప్రతినిధి )



కోహీర్ మండలం గుర్జివాడ గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయులు ఆకుల ప్రభు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు గ్రామ ప్రజలను , విద్యార్థులను అలరించాయి.ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులకు స్ఫూర్తిదాయక సందేశాలు ఇచ్చారు.అదేవిధంగా సోషల్ ఉపాధ్యాయుడు సీతా జైపాల్ ప్రథమ బహుమతిగా గీతాంజలికి, అంకిత కు ద్వితీయ ప్రోత్సాహక నగదు బహుమతులును, మెమోంటాను ఇచ్చి సన్మానించారు. ఉప సర్పంచ్ సాయి కుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి జీవితంలో స్థిరపడాలని సందేశం ఇచ్చారు. సీతా జైపాల్ మాట్లాడుతూ బాగా చదివే విద్యార్థులకు నిరంతరం ప్రోత్సహిస్తానని, మళ్ళీ వచ్చే సంవత్సరం కూడా విద్యార్థులను బహుమతులు ప్రధానం చేస్తానని ప్రకటించారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ ప్రియాంక రాజేందర్ ఉపాధ్యాయులు విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# వెనుకబాటుతనంపై 'గద్వాల' సమరభేరి

- రాష్ట్రానికే సవాల్ విసిరిన కలెక్టర్!
- అభివృద్ధిలో అగ్రస్థానమే లక్ష్యం.. వచ్చే ఆగస్టు పదిహేను నాటికి మార్పు చూపిస్తాం: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల ఆగస్టు 15
(వుదయం బ్యూరో)



జోగులాంబ గద్వాల జిల్లాపై పడిన "వెనుకబడిన ప్రాంతం" అనే ముద్రను శాశ్వతంగా పాతిపెట్టేందుకు అధికారులు పునరంకితం కావాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఉద్ఘాటించారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపి, రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా యంత్రాంగం సమష్టి బాధ్యతతో పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి పేదవాని గడప తొక్కాల్సిందేనని, ఇందులో ఎలాంటి అలసత్వానికి తావు లేదని స్పష్టం చేశారు. సమూహ సమన్వయ కేంద్రంలో అంబరాన్నంటిన స్వాతంత్ర్య సంబరాలుఅనంతరం మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ—— గాంధీజీ, నెహ్రూజీ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి మహానాయకుల అకుంటిత త్యాగాల ఫలితమే మన స్వేచ్ఛా భారతావని అని కొనియాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పాలన సాగుతోందని, మహిళా సాధికారత దిశగా దేశం విప్లవాత్మక అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ఒక్కటై కదులుదాం.. అగ్రస్థానాన నిలుపుదాం! జిల్లా సమగ్ర వికాసంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రజలకు ఎదురయ్యే సమస్యలను సామరస్యపూర్వకంగా, పరస్పర సహకారంతో పరిష్కరించుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. వచ్చే ఏడాది ఆగస్టు పదిహేను నాటికి జోగులాంబ గద్వాల జిల్లాను అనేక కీలక రంగాల్లో రాష్ట్రానికే దిక్సూచిగా నిలపాలని, ఆ దిశగా అధికారులు శ్రమించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, శిక్షణ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ కుమార్ రెడ్డి, రాజ్ కుమార్, కలెక్టరేట్ పరిపాలనా అధికారి మంజులలతో పాటు పలు శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## ఆర్టీసీ క్రాస్రోడ్స్‌లో అక్రమ బోర్ ఆరోపణలు!

**సప్తగిరి థియేటర్ పక్క గల్లీలో హాస్టల్, కమర్షియల్ భవనంలో బోర్లు**
**అనుమతులు ఉన్నాయా? నిబంధనలు పాటిస్తున్నారా? అధికారుల తనిఖీలు ఎక్కడ?**



**ముషీరాబాద్,ఆగస్టు15 (వుదయం):** హైదరాబాద్‌లో భూగర్భ జలాల పరిరక్షణపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సప్తగిరి థియేటర్ పక్క గల్లీలో ఉన్న హాస్టల్, కమర్షియల్ భవనంలో అక్రమంగా బోర్లు ఏర్పాటు చేశారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.

ఒకవైపు నగరంలో నీటి సమస్యలు, భూగర్భ జలాల తగ్గుదలపై ఆందోళనలు వ్యక్తమవుతుంటే.. మరోవైపు వాణిజ్య భవనాలు, హాస్టళ్లలో బోర్లు ఏర్పాటు చేసి నీటిని వినియోగిస్తున్నారనే ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది.

**బోర్లకు అనుమతులు ఉన్నాయా?**


సప్తగిరి థియేటర్ పక్క గల్లీలోని సంబంధిత హాస్టల్, కమర్షియల్ భవనంలో ఉన్న బోర్లకు అధికారిక అనుమతులు ఉన్నాయా? అనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. బోర్ల ఏర్పాటుకు సంబంధించి అవసరమైన అనుమతులు తీసుకున్నారా? నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేశారా? భూగర్భ జలాలను ఎంత మేరకు వినియోగిస్తున్నారు? అనే అంశాలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

**అధికారుల నిఘా ఎక్కడ?**

రద్దీగా ఉండే ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతంలోనే ఇలాంటి ఆరోపణలు వస్తున్నా సంబంధిత శాఖల అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అనుమతి లేకుండా బోర్లు ఏర్పాటు చేసి ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలి. అనుమతులు ఉంటే వాటి వివరాలను అధికారులు స్పష్టం చేయాలి. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. సామాన్యులకు ఒక న్యాయం.. కమర్షియల్ భవనాలకు మరో న్యాయమా? భూగర్భ జలాలను విచ్చలవిడిగా వినియోగిస్తే భవిష్యత్‌లో నీటి సమస్య మరింత తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉంది. అందుకే అక్రమ బోర్లపై ఫిర్యాదులు వచ్చిన ప్రతిసారి అధికారులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి వాస్తవాలను బయటపెట్టాలి.

**బోరు అక్రమమైతే మూసివేయాలి.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి..**

ఎవరు ఉన్నా చట్టం ముందు సమానమేనని అధికారులు నిరూపించాలి! ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సప్తగిరి థియేటర్ పక్క గల్లీలో ఉన్న హాస్టల్, కమర్షియల్ భవనంలోని బోర్లపై సమగ్ర విచారణ జరిపి, అనుమతులు, నీటి వినియోగం, నిబంధనల అమలుపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




**భూగర్భ జలాలు ఎవరి వ్యక్తిగత సొత్తు కాదు..**
**ప్రజలందరికీ చెందిన సహజ వనరు.**
**అక్రమ బోర్లకు అడ్డుకట్ట వేయాల్సిందే!**

## సాంకేతికతతో ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత

**తన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**




**ఇబ్రహీంపట్నం, ఆగస్టు15 (వుదయం):** ప్రజలకు నిత్యావసర సరుకులను పారదర్శకంగా, సులభంగా అందించడంతో పాటు ప్రజా పంపిణీ వ్యవస్థను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత పటిష్ఠం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని ప్రమిద కన్వెన్షన్‌లో నిర్వహించిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు.

**సాంకేతికతతో మరింత పారదర్శక సేవలు**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. కార్డులో క్యూఆర్ కోడ్‌తో పాటు ఆధార్ ఆధారిత వివరాలు, కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను డిజిటల్ విధానంలో పొందుపరుస్తున్నట్లు చెప్పారు. రేషన్ సరుకులను లబ్ధిదారులు ఎప్పుడు, ఎంత పరిమాణంలో తీసుకున్నారనే వివరాలు కూడా డిజిటల్‌గా నమోదు కావడంతో పంపిణీ ప్రక్రియలో పారదర్శకత మరింత పెరుగుతుందని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలు, అవకతవకలకు తావులేకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. కొత్తగా రేషన్ కార్డులు పొందిన కుటుంబాలతో పాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో అర్హులైన కుటుంబ సభ్యుల పేర్లను చేర్చుకునే అవకాశం కల్పిస్తూ ప్రతి అర్హుడికి ఆహార భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**పేదలకు ఉచిత సన్నబియ్యం**

రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఉచితంగా సన్నరకం బియ్యాన్ని అందిస్తోందని మంత్రి తెలిపారు. ఒక్కో వ్యక్తికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, దీనివల్ల పేద కుటుంబాలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతోందని చెప్పారు. నాణ్యమైన బియ్యాన్ని పేదలకు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో సుమారు 6.72 లక్షల రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ కింద లబ్ధిదారులకు ప్రయోజనాలు అందుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. జిల్లాలో కొత్తగా సుమారు 1.12 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను చేర్చడం ద్వారా మరింత మందికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుతున్నాయని వివరించారు. ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

**రేషన్ డీలర్లు నాణ్యమైన సేవలు అందించాలి**

ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ డీలర్ల పాత్ర ఎంతో కీలకమని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులను లబ్ధిదారులకు నిర్ణీత పరిమాణంలో, ఎలాంటి కోతలు లేకుండా పారదర్శకంగా అందించాలని సూచించారు. తూకంలో ఎలాంటి తేడాలు లేకుండా చూడాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టిలోకి తీసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, ప్రజా ప్రతినిధులు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు వనజాత, హరీష్, సంబంధిత శాఖల అధికారులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు



చేవెళ్ల,ఆగస్ట్ 15 (వుదయం) : చేవెళ్ల మున్సిపాల్టీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం ఎంతోమంది మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమని, వారి త్యాగాలను ఎప్పటికీ మరువరాదన్నారు.యువత దేశానికి వెన్నెముక అని, విద్యతో పాటు క్రమశిక్షణ,దేశభక్తి, సేవాభావాన్ని అలవర్చుకుని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.చేవెళ్ల పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా బలమైన,అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మాజీ సర్పంచులు, ఉపసర్పంచులు,వార్డు సభ్యులు, మున్సిపల్ సిబ్బంది,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## అమీన్‌పూర్, బీరంగూడలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**జాతీయ జెండాను ఆవిష్కరించిన కాటా సుధా శ్రీనివాస్ గౌడ్**



**అమీనాపూర్ ఆగష్టు 15, వుదయం :** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని పలు కాలనీల్లో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమాల్లో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధాశ్రీనివాస్ గౌడ్ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులర్పించారు.

## సీఎం పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు



**గుమ్మడిదల, ఆగస్టు 15 (వుదయం):** సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో గుమ్మడిదలలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి (సీజీఆర్), మున్సిపల్ చైర్మన్ కుమార్‌గౌడ్, పలువురు కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడమేనని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా సీజీఆర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ప్రశ్నించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని అన్నారు. ప్రశ్నించే గొంతులను అరెస్టులతో అణచివేయలేరని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగేష్ ముదిరాజ్

- **ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ**
- **మహనీయుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాలి: నాగేష్ ముదిరాజ్**



**ముషీరాబాద్,ఆగస్టు15 (వుదయం)** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగేష్ ముదిరాజ్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, దేశభక్తి, పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ భారతదేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రమేష్, రాజు, రఘు, రవి, శ్రీనివాస్, నాగ సాయి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ సమైక్యత సమగ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

**తెలంగాణ రాష్ట్ర సగర సంఘం అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర**



**శేర్లింగంపల్లి , ఆగస్టు 15 (వుదయం):** ఎందరో మహానుభావులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సాధించుకున్న స్వాతంత్ర ఫలాలను అందరూ అందుకోవాలని రాష్ట్ర సగర సంగం అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర తెలియజేశారు. శే లింగంపల్లి నియోజకవర్గంలోని గుల్మోహన్ పార్క్ లో గల నేతాజీ నగర్ కమ్యూనిటీ హాల్ మరియు గచ్చిబౌలి లోని అంజయ్య నగర్ సగరసంగ ఆవరణలో జరిగిన జెండా వందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ స్వాతంత్ర ఫలాలను అందుకోవాలని ఇది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కుగా ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఆయన కోరారు. ఈ దేశం భిన్నత్వంలో ఏకత్వంగా అందరికీ సమాన హక్కులు కల్పించడం జరిగిందని దాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని ఆయన తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల కు భంగ గలగకుండా ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సగర సంగం సభ్యులు ,నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం కాపాడినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం

- **స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాల సాధనే నిజమైన స్వాతంత్ర్యానికి మార్గం**



**ముషీరాబాద్,ఆగస్టు15 (వుదయం) :** 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ హేమ సుదర్శన్ జిల్లోజు దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం అంటే కేవలం తెల్లదొరల పాలన నుంచి విముక్తి పొందడం మాత్రమే కాదని, ప్రతి పౌరుడి హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం పరిరక్షించబడినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం సాకారమవుతుందని అన్నారు.

మహాత్మా గాంధీ, డా. బి.ఆర్. అంబేద్కర్, భగత్‌సింగ్, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, కొమురం భీమ్ వంటి మహనీయులు దేశ స్వేచ్ఛతో పాటు సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజల హక్కుల కోసం పోరాడారని ఆమె గుర్తుచేశారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం లభించినప్పటికీ.. పేదరికం, నిరుద్యోగం, అసమానతలు, వివక్ష కొనసాగుతూ.. విద్య, వైద్యం వంటి మౌలిక హక్కులు సామాన్యులకు పూర్తిస్థాయిలో అందకపోతే అది సంపూర్ణ స్వాతంత్ర్యం కాదని హేమ సుదర్శన్ జిల్లోజు పేర్కొన్నారు.తెల్లదొరల పాలన నుంచి విముక్తి పొందిన దేశంలో నల్లదొరల దోపిడీకి కూడా ప్రజలు తలవంచకూడదని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు రాజ్యాంగాన్ని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు.

"దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్" అనే మహాకవి గురజాడ స్ఫూర్తితో ప్రజల సంక్షేమం, హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. మన ఇల్లు మనం ఎలా కాపాడుకుంటామో.. అదే విధంగా మన దేశాన్ని, మన రాష్ట్రాన్ని, మన ప్రజాస్వామ్యాన్ని, మన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపైనా ఉందని హేమ సుదర్శన్ జిల్లోజు పేర్కొన్నారు. ప్రజల హక్కులే దేశ బలం.. రాజ్యాంగమే ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం.. సమానత్వమే నిజమైన స్వాతంత్ర్యానికి పునాది అని ఆమె అన్నారు.

## బాగా చదువుకోండి.. మీ వెంట నేనుంటా: సీజీఆర్



గుమ్మడిదల,ఆగస్టు 15 (వుదయం): విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి సూచించారు. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. "బాగా చదువుకోండి.. మీ వెంట నేనుంటా. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కష్టపడాలి. చదువులో ముందుండే విద్యార్థులకు నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తాను" అని గోవర్ధన్ రెడ్డి అన్నారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరచాలని ఆయన సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వపడేలా ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సీజీఆర్ ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, వారి లక్ష్య సాధనకు అండగా నిలవడమే తన ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కవాడిగూడ చిత్రాల్‌నగర్ బస్తీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**ముషీరాబాద్,ఆగస్టు15 (వుదయం):** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగేష్ ముదిరాజ్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, దేశభక్తి, పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ భారతదేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రమేష్, రాజు, రఘు, రవి, శ్రీనివాస్, నాగ సాయి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.




**దేశ భవిష్యత్తుకు విద్యార్థులే రూపశిల్పులు**

"దేశ భవితకు విద్యార్థులే రూపశిల్పులు. జాతీయ భద్రత విషయంలో ప్రభుత్వం, సమాజం ఏకమైనట్లే... విద్యార్థుల వర్తమానాన్ని, భవిష్యత్తును సంరక్షించడానికి ప్రతి ఒక్కరూ సమష్టి కృషితో సహకరించాలి. నేటి యువత ఉద్యోగాలను వెదకడం కంటే వాటిని సృష్టించే సంస్కృతిని ఎక్కువగా అవలంబిస్తోంది. ప్రధాన అంతర్జాతీయ సంస్థలు భారతీయ యువత ప్రతిభ, అంకితభావానికి ఆకర్షితులై వారికి నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తుండటం ప్రపంచ వేదికపై మన శక్తి సామర్థ్యాలను చాటుతోంది."

**-ద్రౌపదీ ముర్ము, భారత రాష్ట్రపతి**

## వే'మన' పద్యం

నేర నన్నవాఁడు నెరజాణ మహిలోన
నేర్తునన్నవాఁడు నింద జెందు
ఊరుకున్నవాఁడె యుత్తమయోగిరా
విశ్వదాభిరామ! వినురవేమ!



# సంపాదకీయం

# ధరలు బాబోయ్ ధరలు...

జులైలో దేశ రిటైల్ ద్రవ్యోల్బణం పెరగడం ముందుగా ఊహించిందే. జూన్‌లో నమోదైన 4.38 శాతం నుంచి జులైలో 4.45 శాతానికి చేరడం గమనార్హం. 2024 డిసెంబర్ తర్వాత, అంటే గత 19 నెలల్లో నమోదైన అత్యధిక స్థాయి ఇది. వరుసగా రెండో నెలలోనూ రిటైల్ ద్రవ్యోల్బణం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నిర్దేశించిన 4 శాతం లక్ష్యాన్ని దాటి నమోదైంది. అయినప్పటికీ, ఆర్‌బిఐ నిర్దేశించిన 2 నుంచి 6 శాతం పరిధిలోనే ఇది కొనసాగుతోంది. ఎప్పటిలాగే ఈసారి కూడా ఆహారం, ఇంధనం, రవాణా రంగాలే ద్రవ్యోల్బణం పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచాయి. అరుదైన లోహాలను మినహాయించిన కోర్ ద్రవ్యోల్బణం మాత్రం 3 శాతం లోపే స్థిరంగా ఉండటం గమనార్హం. గ్రామీణ ప్రాంతాల్లో ఆహార ద్రవ్యోల్బణం జూన్‌లో 5.45 శాతం నుంచి జూలైలో 5.79 శాతానికి పెరగడం ఆందోళనకరం. ఉల్లిపాయలు (22.54 శాతం), వెల్లుల్లి (35.36 శాతం), అల్లం (83.62 శాతం) వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఈ పెరుగుదలకు ఆజ్యం పోశాయి. బంగాళదుంప (16.56 శాతం) ధరలు కూడా పెరగగా, టమాటా (4.59 శాతం) ధర మాత్రం తగ్గుముఖం పట్టింది.


రవాణా రంగం ప్రభావం మరింత విస్తృతంగా కనిపిస్తోంది, ఇది ఉత్పత్తి వ్యయాల ఒత్తిడిని సూచిస్తోంది. రవాణా ద్రవ్యోల్బణం జూన్‌లో 4.31 శాతం నుంచి జులైలో 4.43 శాతానికి పెరిగింది. అలాగే, వస్తు రవాణా సేవల ఉప విభాగంలో ద్రవ్యోల్బణం 7.70 శాతం నుంచి 7.77 శాతానికి ఎగబాకింది. జులై 1న వాణిజ్య ఎల్‌పిజి ధరలను సుమారు ₹83 మేర తగ్గించినప్పటికీ, ఆహార, పానీయ సేవల ద్రవ్యోల్బణం 7.79 శాతానికి పెరిగింది. మార్చి నుంచి మే వరకు నడిచిన అధిక నిర్వహణ వ్యయాల భారం నుంచి రెస్టారెంట్లు ఇంకా కోలుకోలేదని ఇది సూచిస్తోంది. ఆగస్టు 1న వాణిజ్య ఎల్‌పిజి ధరలను ₹202 మేర తగ్గించినప్పటికీ, దీని ప్రభావం తక్షణమే మెనూ ధరలపై కనిపించే అవకాశం లేదు. రుతుపవనాల పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. దేశంలోని పశ్చిమ, మధ్య, దక్షిణాది ప్రాంతాల్లో పలుచోట్ల వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. బంగారం (32.98 శాతం), వెండి (109.84 శాతం) ధరల్లో ద్రవ్యోల్బణం కొంత మోస్తరుగా తగ్గినప్పటికీ, అసాధారణంగా అధిక స్థాయిలోనే కొనసాగుతోంది. జులై సిపిఐ లెక్కింపు కాలంలో ముడి చమురు ధరలు సాపేక్షంగా స్థిరంగా ఉన్నప్పటికీ, ఆగస్టులో మళ్లీ పెరుగుతున్నాయి. ఇంకా ఆందోళనకరమైన విషయం ఏమిటంటే? రష్యాకు చెందిన నొవొరొస్సియిస్క్‌తో సహా నల్ల సముద్ర ఎగుమతి మౌలిక సదుపాయాలపై ఉక్రెయిన్‌కు సంబంధించిన అంతరాయాలు, రష్యా ముడి చమురుపై సరకు రవాణా, రిస్క్ ప్రీమియంలను పెంచే అవకాశం ఉంది. జూన్‌లో భారత్ దిగుమతి చేసుకున్న ముడి చమురులో దాదాపు సగం రష్యా నుంచే వచ్చింది కావడంతో, ఇలాంటి అంతరాయాలు దేశ ఇంధన వ్యయాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. జూన్ 15 నుంచి జూలై 15 సిపిఐ లెక్కింపు కాలంలో రూపాయి విలువ దాదాపు 1.6 శాతం క్షీణించడం, దిగుమతి ఆధారిత ద్రవ్యోల్బణాన్ని మరింత తీవ్రతరం చేసింది. ఈ నేపథ్యంలో, ఆర్థిక వృద్ధి వేగం మందగిస్తున్న సంకేతాలు కూడా కనిపిస్తున్నాయి. హెచ్‌ఎస్‌బిసి కాంపోజిట్ పిఎంఐ జూన్‌లో 57.1 శాతంగా ఉండగా, జులైలో 54.3 శాతంకు గణనీయంగా పడిపోయింది. ఇది 2022 మార్చి తర్వాత నమోదైన అత్యంత బలహీన విస్తరణ. పిఎంఐ అనేది అధికఫ్రీక్వెన్సీ సూచీ కావడంతో, దీన్ని దీర్ఘకాలిక ధోరణిగా భావించనవసరం లేకపోయినా, గమనించదగ్గ అంశం మాత్రమే.

ఈ పరిస్థితుల నేపథ్యంలోనే, వరుసగా నాలుగో సమావేశంలోనూ రెపో రేటును ఆర్‌బిఐ ద్రవ్య పరపతి కమిటీ (ఎంపిసి) 5.25 శాతం వద్దే స్థిరంగా ఉంచింది. ఎల్ నినో ఫలితంగా అనావృష్టి పరిస్థితులు, అంతర్జాతీయంగా కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితుల ప్రభావం రానున్న రోజుల్లో తీవ్రంగా వుంటుంది. ఏది ఎలావున్నా సామాన్యులపై ధరాభారం మెడపై కత్తిలా వేలాడుతోంది.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad – 500020



# ఘనంగా పార్సీ నూతన సంవత్సర 'నవరోజ్' వేడుకలు

షహెన్‌షాహీ లేదా జొరాస్ట్రియన్ క్యాలెండర్‌ను అనుసరించే పార్సీ మతస్థులు 16 ఆగష్టు 2026 రోజు నవరోజ్ (నౌరోజ్) లేదా నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవడం అనాదిగా వస్తున్న ఒక సత్సంప్రదాయంగా వస్తున్నది. పార్సీ నూతన సంవత్సర వేడుకలు ప్రతి ఏటా ఆగష్టు మాసంలో వస్తుంది. 2026లో నవరోజ్ వేడుకలు 15/16 ఆగష్టున జరుపుకోవడం చూస్తున్నాం. పార్సీ మతస్థుల మతపరమైన కుటుంబ వేడుకగా నవరోజ్‌ను సాంప్రదాయ దుస్తులు ధరించి, బంధుమిత్రులతో కలిసి శుభాకాంక్షలు తెలుపుకుంటూ ప్రత్యేక వంటకాలతో ఘనంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ పండుగ రోజు ఇంటిని శుభ్రపరుచుకొని, ప్రత్యేకంగా తయారు చేసిన ఆహార పదార్థాలను ఒక బల్లపై అమర్చి అందరు కలిసి సంతోషాల నడుమ భోజనం చేస్తారు.

**అతి పురాతన వేడుక - నవరోజ్ :**

అతి పురాతన మతాల్లో ఒకటైన పార్సీ మతం సుమారు 3,500 ఏండ్ల క్రితం ప్రాచీన ఇరాన్‌లో ప్రవక్త జరతుస్త్ర స్థాపించాడు. భూమి మీద సజీవంగా ఉన్న అతి పురాతన విశ్వాసాలలో ఒకటైన నవరోజ్ పండుగను పార్సీలు లేదా జొరాస్ట్రియన్లు సహజ సిద్ధంగా నిర్వహించుకుంటారు. సహజాత ప్రవృత్తిగా "కలవండి, వంట చేయండి, వేడుక చేసుకొండి, గుర్తుంచుకొండి" అనే నినాదాన్ని సర్వదా పాటించడం పార్సీ మతస్థులకు ప్రగాఢ సంప్రదాయంగా మారింది. ఒక సంవత్సరం ఆశలు, ఒక సంవత్సరం కృతజ్ఞత, ఒక సంవత్సరం జీవనం కలిసిన క్షణాలు నవరోజ్‌గా వ్యక్తం చేయబడతాయి. భారత స్వాతంత్ర్య వేడుకల తర్వాత రోజు 16 ఆగష్టు 2026న సూర్యోదయా వేళ ఈ ఉత్సవం మొదలు అవుతుంది. నవరోజ్ అనగా కొత్త రోజు ప్రారంభం అని అర్థం చేసుకోవాలి. స్పష్టమైన, ఆత్మీయమైన, అర్థవంతమైన నవరోజ్ పేరులో విషువత్తు, ప్రవాసం, సముద్రం, రాకల వేడుకగా ఈ ఉత్సవం నిలుస్తున్నది. "సాల్ ముబారక్" అంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలను పరస్పరం చెప్పుకుంటూ వేడుకలను ప్రారంభించి, అగ్ని దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి తమ బంధుమిత్రులకు హృదయపూర్వకంగా ఆతిథ్యం ఇస్తారు. మోక్షం పొందడమే మానవ జీవిత లక్ష్యం కావాలి :

7వ శతాబ్దంలో ఇస్లామిక్ దండయాత్ర కారణంగా భారతదేశంలోని గుజరాత్‌కు వలస వచ్చిన పర్షియా(ప్రస్తుత ఇరాన్) మతస్థులు జొరాస్ట్రియన్లు ఈ వేడుకలను జరుపుకుంటున్నారు. మానవ జీవిత ప్రధాన ఉద్దేశం మోక్షం పొందడమే. ఒక గురువు యొక్క శరణు పొందిన రోజున మన జీవితం సార్థకం అవుతుందని నమ్ముతారు. మానవ జీవితంలో శాంతి, అదృష్టం, విజయం, ఆనందం అనే వివిధ రంగులు ఇంద్రధనుస్సుగా మారి అద్భుతంగా కనిపించాలి. ఆనందంగా ఉండడంతో పాటు ఆనందాలను పంచడం కూడా నిరంతరం కొనసాగాలి. పార్సీ మత బోధనల ప్రకారం కబీర్ సాహెబ్ జీ శరణు కోరితే ఎలాంటి ఆపదలు ఉండవని విశ్వసిస్తారు.

ప్రేమ, ధైర్యం, జ్ఞానం, సంతృప్తి, ఆరోగ్యం, సహనం, పవిత్రతలను తోడుగా ఉంచుకోవడానికి నవరోజ్ ఉత్ప్రేరకంగా పని చేస్తున్నది. మన ఇరుగు పొరుగు పార్సీ మతస్థులు ఉన్నట్లైతే వారితి నౌరోజ్ శుభాకాంక్షలు తెలియజేద్దాం, వారి రుచికరమైన వంటకాలను ఆస్వాదిద్దాం.



మధుసూదన్ రెడ్డి
9949700037

## ఆకు చెప్పిన ఆడపిల్ల కథ ?

చెట్టు ప్రసవ వేదన పడి
ఆకుకు జన్మనిచ్చింది...
చిగురాకును తొడిగిన ఆ క్షణం
చెట్టుకు కొత్త ఉత్సాహం కలిగింది,
సంబరంతో ఊగిపోయింది.
లేత పచ్చని నవ్వులతో కేరింతలు
కొడుతూ,
కొమ్మల ఒడిలో ఆ ఆకు ఎదిగింది.
గాలిలో ఊగుతూ,
వానలో గెంతులు వేస్తూ,
ఎండను భరిస్తూ
రోజురోజుకీ పరిపక్వతను
సంతరించుకుంది.
పువ్వుల పుట్టుకకు తోడై,
కాయల ఎదుగుదలకు నీడై,
పండ్ల పరిపక్వతకు కారణమై,
తన వంతు బాధ్యతను నెరవేర్చింది.
కాలం గడిచింది...
పచ్చదనం కాస్త మసకబారింది.
ఎన్నో ఋతువుల భారాన్ని మోసిన ఆ
ఆకు
నెమ్మదిగా తన శక్తిని కోల్పోయింది.
ఒక రోజు...
గాలి తాకిడికి వణికింది.
ఇన్నాళ్లు అండగా నిలిచిన కొమ్మే
దాన్ని నిర్దాక్షిణ్యంగా వదిలేసింది.
ఆసరా కోల్పోయిన ఆ పండుటాకు
బాధను గుండెలో దాచుకుని నేలను
చేరింది.
ఆ ఆకు కథ
ప్రతి ఆడపిల్ల కథను తలపిస్తుంది...
పుట్టిన క్షణం నుంచి
ఇంటిల్లిపాదిని ఆనందంతో నింపి,
బాధ్యతల భారాన్ని మోస్తూ,
తన కలలను కన్నీటి చినుకుల్లో
దాచుకుని,
తన కోరికలను మట్టిలో కలిపేసుకుని,
ఇతరుల సంతోషంలోనే
తన జీవిత సార్థకతను వెతుక్కునే,
ఆ పండుటాకు.
ఒక ఆడపిల్లే కదా!
చెట్టుకు ఆకు ఎంత అవసరమో,
కుటుంబానికి ఆడపిల్ల అంత అవసరం.
ఆకు రాలితే చెట్టు వెలితిగా మారినట్లు,
ఆడపిల్ల లేని ఇల్లు ఆనందాన్ని
కోల్పోతుంది..


రామిశెట్టి కావ్య

# అజాత శత్రువు అటల్ జీ"

హాస్యం పండిచండంలోనూ ఆయనకు ఆయనే సాటి. ప్రసంగాల్లో... చట్ట సభల్లో మధ్యమధ్యలో కవిత్వాన్ని కలగలిపి అందరితో శెభాష్ అనిపించుకున్నారు. ఆయన వాగ్ధాటి ఎలాంటిదంటే.. భారత ప్రధానిగా ఉన్న నెహ్రూనే ఓ సందర్భంలో.. అటల్ జీ దేశానికి ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు.

రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్న గొప్ప నాయకుడు వాజ్ పెయి. ప్రజా సేవ కోసం బ్రహ్మచారిగా ఉండిపోయి... తన జీవితం మొత్తం దేశం కోసం అంకితం చేశారు. రెండు సీట్ల పార్టీని దేశ రాజకీయ చరిత్రలోనే అధికార పార్టీగా మలచిన అపర చాణుక్యుడు.

పార్లమెంట్ సాక్షిగా నెహ్రూలాంటి నేతల్ని సైతం గడగడలాడించారు. హీటెక్కించే ప్రసంగాలు చేయడంలోనే కాదు.. హాస్యం పండిచండంలోనూ ఆయనకు ఆయనే సాటి. ప్రసంగాల్లో... చట్ట సభల్లో మధ్యమధ్యలో కవిత్వాన్ని కలగలిపి అందరితో శెభాష్ అనిపించుకున్నారు. ఆయన వాగ్ధాటి ఎలాంటిదంటే.. భారత ప్రధానిగా ఉన్న నెహ్రూనే ఓ సందర్భంలో.. అటల్ జీ దేశానికి ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు.కాంగ్రెస్ పార్టీని, దాని మిత్రపార్టీలను ధీటుగా ఎదుర్కొని.. మిత్రపక్షాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి అధికారం హస్తగతం చేసుకున్న నేత వాజ్‌పేయి. ప్రధానిగా పూర్తి పదవీకాలం పూర్తి చేసిన తొలి కాంగ్రెసేతర నేతగా వాజ్‌పేయి నిలిచారు. ఆర్ఎస్ఎస్, జనసంఘ్ నుంచి వచ్చినా... బీజేపీ లీడర్ గా ఎదిగినా.. అన్నివర్గాల ప్రజల మనసును గెలుచుకున్న వ్యక్తి అటల్ బీహారీ వాజ్ పేయి. కాంగ్రెస్ కు వ్యతిరేకంగా ఏర్పడ్డ ఎన్డీయే కూటమికి సెక్యూలర్ ఫేస్ ఇవ్వడానికి ఎంతగానో కృషిచేశారాయన. అటల్ బిహారీ వాజపేయి డిసెంబర్ 25 1924 న గ్వాలియర్ లోని ఒక మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఆయన తల్లిదండ్రులు కృష్ణాదేవి, కృష్ణబిహారీ వాజపేయి. ఆయన తాత పండిట్ శ్యాం లాల్ వాజపేయి వారి పూర్వీకుల నివాస ప్రాంతమైన ఉత్తరప్రదేశ్ లోని బటేశ్వర్ నుండి గ్వాలియర్ లోని మొరీనాకు వలస వెళ్ళాడు. ఆయన తండ్రి కృష్ణబిహారీ వాజపేయి గ్వాలియర్ ప్రాంతంలో ఒక ఉపాధ్యాయుడు, కవి. వాజపేయి గ్వాలియర్ లోని సరస్వతి శిశు మందిర్ లో విద్యాభ్యాసం చేశాడు. గ్వాలియర్ విక్టోరియా కళాశాల (ప్రస్తుతం లక్ష్మీబాయి కళాశాల)లో చేరి హిందీ, ఆంగ్లము, సంస్కృతంలో అత్యంత ప్రతిభావంతునిగా పట్ట భద్రుడైనాడు. కాన్పూరు లోని దయానంద ఆంగ్లో వైదిక కళాశాలనుండి రాజనీతిశాస్త్రంలో ఎం.ఎ పట్టాను పొందాడు. ఎం.ఎ డిగ్రీని ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనాడు. వాజపేయి గ్వాలియర్లో ఆర్య సమాజపు యువ విభాగమైన ఆర్య కుమార్ సభతో తన సామాజిక కార్యశీలతను ప్రారంభించి, 1944లో ఆ విభాగానికి ప్రధాన కార్యదర్శి అయ్యాడు. ఆయన




1939 లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.)లో కూడా చేరాడు. బాబా ఆమ్టే ప్రభావంతో ఆయన 194044 లలో అధికార్ల శిక్షణా కేంద్రానికి హాజరైనాడు. ఆయన 1947 లో "పూర్తి స్థాయి సేవకుడు" అనగా ఆర్.ఎస్.ఎస్. ప్రచారక్ అయ్యాడు. ఆయన దేశ విభజన తర్వాత జరిగిన అల్లర్ల వల్ల న్యాయ శాస్త్ర విద్యాభ్యాసాన్ని మధ్యలోనే ఆపేశాడు. రాష్ట్రీయ స్వయంసేయక్ సంఘ్ విస్తారక్ గా ఉత్తరప్రదేశ్ వెళ్ళిన వాజపేయి, అక్కడ దీన్ దయాళ్ ఉపాధ్యాయ నడుపుతున్న "రాష్ట్రధర్మ" (హిందీ మాసపత్రిక), "పాంచజన్య" (హిందీ వారపత్రిక) పత్రికలలోను, స్వదేశ్", "వీర్ అర్జున్" వంటి దిన పత్రికలలోనూ పనిచేయటం ప్రారంభించాడు. వాజపేయి జీవితాంతం బ్రహ్మచారిగా జీవించాడు. 1942 ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో, ఆయన తన అన్న ప్రేమ్‌తో కలిసి 23 రోజుల పాటు అరెస్టయిన సందర్భంలో వాజపేయికి తొలిసారిగా రాజకీయాలతో పరిచయ మేర్పడింది. 1951 లో క్రొత్తగా ఏర్పడిన భారతీయ జనసంఘ్ అనే హిందూ దక్షిణ పక్ష రాజకీయ పార్టీలో పనిచేయడానికి, దీన్ దయాళ్ ఉపాధ్యాయతో పాటు వాజపేయిని ఆర్.ఎస్.ఎస్ నియమించింది. ఇది ఆర్.ఎస్.ఎస్ తో కలిసి పనిచేస్తున్న రాజకీయ పార్టీ. ఆయన ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న పార్టీ ఉత్తర విభాగానికి జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించాడు. అనతి కాలంలోనే జనసంఘ్ నాయకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అనుయాయిగా, సహాయకునిగా మారాడు. 1957లో వాజపేయి బల్రామ్‌పూర్ నియోజకవర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యాడు. ఆయన వాగ్ధాటి మూలంగా, అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఏదో ఒకరోజు వాజపేయి దేశ ప్రధాని అవుతాడని ఊహించాడు.

ఆయనకు గల వాగ్ధాటి, సంస్థాగతమైన నైపుణ్యాల కారణంగా జనసంఘ్‌లో ముఖ్యనేతగా ఎదిగాడు. దీన్దయాళ్ ఉపాధ్యాయ మరణానంతరం జనసంఘ్ మొత్తం బాధ్యత, యువ వాజపేయిపై పడింది. 1968 లో జనసంఘ్ జాతీయ అధ్యక్షునిగా ఎదిగాడు. నానాజీ దేశ్‌ముఖ్, బాల్‌రాజ్ మధోక్, లాల్ కృష్ణ అద్వానీ లతో కలిసి జనసంఘ్‌ను జాతీయస్థాయి ప్రాముఖ్యతను సంతరించుకునే దిశగా నడిపించాడు. 1975, 1977 ల మధ్య, భారత జాతీయ కాంగ్రెసు పార్టీకి చెందిన ప్రధాని, ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన ఎమర్జన్సీ కాలంలో అనేకమంది విపక్ష నాయకులతో పాటు అరెస్టు అయ్యాడు. 1977 లో సంఘ సంస్కర్త జయప్రకాశ్ నారాయణ్, కాంగ్రెసు పార్టీకి వ్యతిరేకంగా సంఘటితమై పోరాడటానికి, అన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు ఇచ్చిన పిలుపు మేరకు, వాజపేయి జనసంఘ్‌ను క్రొత్తగా ఏర్పడిన సంకీర్ణ కూటమి, జనతాపార్టీలో విలీనం చేశాడు. 1977 సార్వత్రిక ఎన్నికలలో జనతా పార్టీ విజయం తరువాత ఆయన మొరార్జీ దేశాయ్ మంత్రివర్గంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా పనిచేశాడు. విదేశీ వ్యవహారాల మంత్రిగా ఆయన ఐక్యరాజ్య సమితి యొక్క సర్వప్రతినిధి సభలో హిందీలో ప్రసంగించిన మొట్టమొదటి వ్యక్తిగా నిలిచాడు. 1979లో జనతా ప్రభుత్వం కూలిపోయే నాటికి వాజపేయి, స్వతంత్రంగా గౌరవప్రథమైన రాజకీయవేత్తగా, అనుభవజ్ఞుడైన నాయకునిగా ఎదిగాడు. వాజపేయి, జనసంఘ్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ల నుండి వచ్చిన తన సహచరులను, ముఖ్యంగా దీర్ఘకాల స్నేహితులైన ఎల్.కె.అద్వానీ, భైరాన్ సింగ్ షెకావత్ లను కలుపుకొని 1980 లో భారతీయ జనతా పార్టీని ఏర్పరచి, మొట్టమొదటి అధ్యక్షునిగా పనిచేసాడు. జనతా ప్రభుత్వం తర్వాత వచ్చిన ఇందిరా కాంగ్రెసు ప్రభుత్వానికి బలమైన విమర్శకునిగా అవతరించాడు.1995 నవంబరులో ముంబాయిలో జరిగిన బి.జె.పి సమావేశంలో బి.జె.పి అధ్యక్షుడైన లాల్ కృష్ణ అద్వానీ వాజపేయిని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించాడు. 1996 మే నెలలో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో బి.జె.పి విజయం సాధించింది. వాజపేయి 1996 నుండి 2004 ల మధ్య మూడు పర్యాయాలు ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వహించాడు.వాజపేయి ప్రభుత్వం యేర్పడిన నెలరోజులలోనే ప్రోక్రాన్ అణు పరీక్షలు జగిపారు. ఢిల్లీలాహోర్ బస్సును 1999 ఫిబ్రవరిలో ప్రారంభించారు. కార్గిల్ యుద్ధం, భారత్ పాకిస్తాన్ మధ్య మే జూలై 1999 లో కాశ్మీర్ లోని కార్గిల్ జిల్లాలోను, మరికొన్ని సరిహద్దుల వద్దనూ జరిగింది. మూడవ దఫా పరిపాలనా కాలంలో అనేక దేశీయ ఆర్థిక, మౌలిక సంస్కరణలను చేపట్టాడు. వాటిలో ప్రైవేటు రంగాన్ని, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించాడు. నేషనల్ హైవే డెవలప్‌మెంటు ప్రాజెక్టు", "ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన" వాజపేయి అభిమాన ప్రాజెక్టులు చేపట్టాడు.2001 లో వాజపేయి ప్రభుత్వం, ప్రాథమిక, మాధ్యమిక విద్యాభివృద్ధి లక్ష్యంగా సర్వశిక్షా అభియాన్ అనే ప్రసిద్ధ కార్యక్రమాన్ని ప్రారంభించింది.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్



# నెహ్రూ.. ఆధునిక భారతదేశ నిర్మాత

నెహ్రూ కాలంలో జరిగిన ముఖ్యమైన సంస్కరణలు
1951లో రాజ్యాంగానికి మొదటి సవరణ ఆర్టికల్ 15(4)కు జరిగింది.
2.1953 జనవరి 29న కాకా కాలేల్కర్: మొదటి వెనకబడిన తరగతుల కమిషన్.
3.1955- పౌరహక్కుల సంరక్షణ చట్టం.ఈ మూడు స్వతంత్ర భారత చరిత్రలో చాలా కీలకమైనవి
. అంతవరకు ఉన్న ఫ్యూడల్ వ్యవస్థ చీకట్లను ఛేదించడానికి ఇవే కాగడాలయ్యాయి. స్వాతంత్ర్యం లభించే నాటికి సాగవుతున్న భూముల్లో ఎనభై శాతం అగ్రవర్ణ జమీందార్లు/ దొరలు/ భూస్వాముల ఆధీనంలో ఉండేవి. కోట్లలో ఉన్న మిగతా జనం కూలీలుగా, కట్టు బానిసలుగా ఉండేవారు. నెహ్రూ ప్రభుత్వం వచ్చిన తరువాత జమీందారీ రద్దు చట్టం (1950) అమలులోకి వచ్చింది.

పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఈ దేశ తొలి ప్రధానిగా సుమారు పదిహేడు (1947 - 1964) సంవత్సరాలు అహోరాత్రులు శ్రమించారు. తన వందల కోట్ల ఆస్తి యావత్తూ ఈ జాతికి అంకితం చేశారు. తన సర్వశక్తుల్ని ఈ దేశ నిర్మాణానికి ధారపోశారు. అలాంటి మహామనీషి ప్రపంచ చరిత్రలోనే చాలా అరుదుగా కనిపిస్తారు. ఇప్పుడు ఆయన స్థాయిని తగ్గించి మాట్లాడుతున్న వారు తమను తాము ఎంత నీచమైన స్థానానికి దిగజార్చుకున్నారో అర్థం చేసుకోవడం లేదు. ఆయన కాలంలో దేశం వైజ్ఞానికంగా, పారిశ్రామికంగా ప్రగతి పథాన నడవడమే కాదు, ప్రాజెక్టుల నిర్మాణంలోనూ, వ్యవసాయ రంగంలోనూ గొప్పగా రాణించింది. ఆనాడు దేశంలో ఉన్న ఫ్యూడల్ విధానాల్ని రూపుమాపుతూ ఆయన చేస్తూ వచ్చిన సంస్కరణలు దేశాన్ని ఒక ప్రజాస్వామ్య దేశంగా నిలబెట్టాయి. ఆయన పంచవర్ష ప్రణాళికల గూర్చి, అలీన విధానం గూర్చి తెలుసుకుని ప్రపంచం హర్షించింది. దున్నేవాడికి భూమి దక్కాలని లక్షల మందికి భూములు పంచిపెట్టి, వారికి ఆ భూమి మీద అన్ని హద్దులూ ఇచ్చారు. ఇది దేశంలో ఒక గొప్ప మార్పునకు నాంది పలికింది. ఇప్పటి ప్రభుత్వపు కుంచిత మనస్తత్వం లాగా కాకుండా నెహ్రూ రాజకీయాలకు అతీతంగా ఆలోచించి, డా.బి.ఆర్. అంబేద్కర్‌ను ఈ దేశానికి తొలి న్యాయశాఖా మంత్రిగా చేశారు. అంబేద్కర్ నేపథ్యం తెలిసినవాడు గనక, జీవితాంతం నిరాదరణకు గురవుతూ, సంఘర్షించి వచ్చినవాడే న్యాయశాఖ మంత్రి అయితే, అణగారిన వర్గాలకు, అసహాయులకు, ఆదివాసీలకూ అందరికీ సమన్యాయం లభిస్తుందన్నది నెహ్రూ భావన! తొలి దశలో తీసుకున్న ఈ సరైన నిర్ణయం దేశాన్ని సమానత్వం దిశగా నడిపించింది. మొదటి పంచవర్ష ప్రణాళికలో (195156) నెహ్రూ ప్రభుత్వం రూ.39 కోట్లు షెడ్యూలు కులాలకు (ఎస్సీ,ఎస్టీ) కేటాయించింది. దేశ అభివృద్ధికి కేటాయించిన ఆనాటి నిధులలో ఇది ఎక్కువ మొత్తం. దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రాముఖ్యమివ్వాలన్నదే ఆనాటి ప్రభుత్వ నిర్ణయం వెనక ఉన్న ప్రధాన ఉద్దేశం. ఆ తరువాత రెండో పంచవర్ష ప్రణాళిక (19561961)లో ఆ మొత్తాన్ని నాటి ప్రభుత్వం 91 కోట్లకు పెంచింది. ఇంత ఎక్కువ మొత్తం దేనికంటే చదువు, ఆరోగ్యం లేక, వసతులు లేక అల్లల్లాడుతున్న షెడ్యూలు కులాల వారిని దృష్టిలో ఉంచుకుని వారికి అనువైన చోట్ల బావులు తవ్వించడం, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు కొన్ని లక్షల మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం జరిగింది. ఆ రోజుల్లో మద్రాసు (తమిళనాడు) రాష్ట్రం నుంచి రిజర్వేషన్‌కు సంబంధించి ఒక జటిల సమస్య ఎదురైంది. దాన్ని ఎదుర్కోవడానికి నెహ్రూ మొదటి రాజ్యాంగ సవరణ (1951)లో 15 (4) చేర్చారు. దానివల్ల రాష్ట్ర ప్రభుత్వాలు షెడ్యూలు కులాల వారికి ప్రత్యేక సదుపాయాలు కలిగించగలిగాయి. అణగారిన వారు అశ్రద్ధకు గురికాకుండా ఐఐటీ, ఏయిమ్స్ లలో, ప్రభుత్వ ఉద్యోగాలలో వారికి సముచిత స్థానం లభించింది. ప్రధానికాక ముందు నుంచే నెహ్రూ దళిత వాడలకు వెళ్లేవాడు. వారి బావుల నుంచి నీళ్లు తాగేవాడు. వారితో కలిసి భోజనం కూడా చేసేవాడు. అది భరించలేని కొందరు కాంగ్రెస్ సంప్రదాయవాదులు 'ధర్మం భ్రష్టుపడుతోంది' అని విమర్శించారు. అయినా ఆయన పట్టించుకోలేదు. అందువల్ల నెహ్రూ మీద, గాంధీ మీద రాళ్లు విసిరిన వారున్నారు. నల్ల జెండాలు ప్రదర్శించిన వారున్నారు. 193334 నాటి గాంధీ 'హరిజన్ యాత్ర'లో నెహ్రూ కూడా చురుకుగా పాల్గొన్నారు. ఈ అనుభవాలు ఊరికే పోలేదు. ప్రధాని అయ్యాక 'భారతీయ ఆదిమ జాతి సేవా సంఘం''హరిజన్ సేవా సంఘం' వంటి వాటికి తన కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా నిధులు మంజూరు చేశాడు. ఇలాంటి సంఘాలు స్వాతంత్ర్యం లభించిన తర్వాత 1948లో ఏర్పడ్డాయి. వాటిని నెహ్రూ ప్రభుత్వం గుర్తించింది. చదువుకునే షెడ్యూలు కులాల విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా హరిజన హాస్టళ్లు ప్రారంభించింది. పరిపాలనా వ్యవహారాల్లో ఉన్నత వర్గానికి చెందిన ఉన్నతాధికారుల జోక్యం తగ్గించడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం 1950లలో తొలి ఎస్సీ,ఎస్టీ కమిషనర్ల నియామకం జరిగింది. మధ్యలో ఎవరో ఒకరు వీరిమీద పెత్తనం చేయకుండా వీరిని నేరుగా ప్రధాని కార్యాలయానికి అనుసంధానం చేశారు. ఫ్యూడల్ వ్యవస్థ, పెత్తందారీ ఆధిపత్యం బలంగా ఉన్న రోజులవి. అప్పటికి అణగారిన వర్గాల వారంతా మెడకు ముంత, నడుమును చీపురు కట్టుకుని నడవాల్సిన పరిస్థితి ఉండేది. ఆ అమానవీయ పద్ధతుల్ని రూపుమాపడానికి నెహ్రూ 'అస్పృశ్యత : నేరం' అనే చట్టం 1955లో తీసుకొచ్చారు. అస్పృశ్యత పాటించే వారిని ఎప్పుడైనా, ఎక్కడైనా వారెంట్ లేకుండానే అరెస్టు చేసే అధికారం పోలీసులకు ఇచ్చారు. ఇది బాగా పనిచేసింది. చాలా తక్కువ సమయంలో ముంతచీపురు వ్యవహారం సమసి పోయింది. దీనితోపాటు మొదటి సార్వత్రిక ఎన్నికలు జరగగానే 1952లో నెహ్రూ ప్రభుత్వం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఒక సీరియస్ సర్క్యులర్ పంపించింది. దళితుడు ఎవరైనా మంచి బట్టలు వేసుకుంటేనో, మీసాలు పెంచుకుంటేనో, ఘనంగా ఊరేగితేనో అతని మీద ఎవరైనా దాడిచేసి హింసిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలన్నది దాని సారాంశం! డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసులు స్వయంగా వెంటనే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందనీ, లేకపోతే వారిపై శాఖాపరమైన చర్యలుంటాయని ఆ సర్క్యులర్ హెచ్చరించింది. ఇందులోని చాలా విషయాలు ప్రస్తుత ఆరెస్సెస్ - బీజేపీ ప్రభుత్వ (201426) విధానాలతో పోల్చిచూస్తే తేడా తెలుస్తుంది. నెహ్రూ ఆనాడు తీసుకున్న అన్ని నిర్ణయాలకు ఇప్పటి ప్రభుత్వం వ్యతిరేకంగా పని చేస్తోంది. కావాలని ద్వేష పూరితమైన ప్రసంగాలు చేసి, జనాన్ని విడగొట్టాలని చూస్తోంది. మైనార్టీలను, దళితులను హింసించడం అలా ఉంచి, హిందువులను కూడా బతకనివ్వడం లేదుకదా?

'హిందువులంతా నా బంధువులు' అనే మాటను అపహాస్యం చేస్తున్నారు. 'హిందువులు ప్రమాదంలో ఉన్నారు' అని ప్రచారం చేస్తూ వారినే ప్రభుత్వం ప్రమాదంలో పడేస్తోంది. తరతరాలుగా ఇక్కడ పుట్టి పెరిగిన జనాన్నే 'మీరు ఈ దేశ పౌరులేనా?' అని ప్రశ్నిస్తూ, చూపించే పత్రాలేవీ పనికి రావని చెబుతూ భయ భ్రాంతులను చేస్తోంది. ఆరెస్సెస్, బీజేపీ, విశ్వహిందూ పరిషత్ వంటి వారి అనుబంధ సంస్థల్లో ఉన్న వారినే - ఈ దేశ పౌరులుగా గుర్తించేట్టుగా కనిపిస్తోంది. దేశచరిత్రలో ఇప్పుడు ఒక చీకటికాలం నడుస్తోంది. నెహ్రూ వైజ్ఞానిక స్పృహకు ప్రాధాన్యమిచ్చినవాడు. అలాగని దైవ విశ్వాసకుల్ని బాధపెట్టలేదు. వారి వారి ప్రార్థనా స్థలాల్ని కూల్చేయించలేదు. బీజేపీ వారు బాబ్రీ మసీదును కూలగొట్టారు. అది రాముడి జన్మస్థలమని అబద్ధాలు ప్రచారం చేసి, న్యాయమూర్తిని ప్రభావితం చేసి, తమకు అనుగుణంగా తీర్పు తెప్పించుకున్నారు. మసీదు అడుగున బౌద్ధ శిల్పాలు దొరికాయని ఆర్కియాలజీ విభాగం ఆధారాలు చూపింది. కనీసం తమ అసమర్థతను ప్రకటించుకుంటూ వారు దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి కదా? వీరికి కుట్రలు, కుతంత్రాలు, అబద్ధాలు, విద్వేషాలు తప్ప, 'నైతికత' అనేది ఒకటి ఉంటుందని తెలియదు. నెహ్రూ నైతిక పాలన అందించాడు. దేవాలయ ఆదాయాల్ని దోచుకోలేదు. రాజకీయాలకు మతం రంగు పులమలేదు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం శిధిలమైన ఆలయాల్ని పునర్నిర్మించింది. కానీ, ప్రచారం చేసుకోలేదు. ఎప్పుడూ ఏ విషయం లోనూ కొండంత రాగం తీయలేదు. అనాటి ప్రభుత్వం 38 వేల దేవాలయాల ఆస్తులను కాపాడింది. వాటిని ఆడిట్ చేయించింది. 1961లో మధ్యప్రదేశ్‌లోని ఖజురాహో దేవాలయం నుంచి విగ్రహాల దొంగతనం జరిగితే, వెంటనే నెహ్రూ సిబిఐ దర్యాప్తు చేయించారు. అంతర్జాతీయ స్మగ్లర్ల నెట్‌వర్క్‌ను ధ్వంసం చేసి, దోషుల్ని జైలుకు పంపించారు. మరి ఇప్పటి ప్రభుత్వపు పనితీరు ఎలాఉందో దేశవాసులందరికీ తెలుసు. మరో విషయం చూడండి. 2014 22 మధ్య 'నమామి గంగే' అనే పేరుతో గంగానదిని ప్రక్షాళనం చేస్తామన్నారు. రూ.20 వేల కోట్లు దోచేశారు. కానీ, గంగానది మాత్రం శుభ్రం కాలేదు. నెహ్రూ తర్వాత లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరా గాంధీ ఇండియాన్ ఆర్కియలాజికల్ సర్వే (ASI)ను ప్రోత్సహించి, నిధులిచ్చి ఎన్నో ప్రాచీన దేవాలయాల్ని వెలుగులోకి తెచ్చారు. నెహ్రూ గానీ, ఆయన తర్వాత వచ్చిన ప్రధానులు గానీ ఎప్పుడూ ఎక్కడా ప్రచారాలు చేసుకోలేదు. దేవాలయాలను దోచుకోలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఆరెస్సెస్ బీజేపీ ప్రభుత్వం షెడ్యూల్ కులాల సబ్‌ప్లాన్‌కు సంబంధించిన నిధుల్లో 45 శాతం తమ ప్రచార కార్యక్రమాలకు మళ్లించుకున్నది. ఫలితంగా దళితుల విద్యారంగానికి అందాల్సిన నిధులు అందడం లేదు. మారుమూల గ్రామాల్లో పాఠశాలలు, హాస్టళ్లు మూతపడుతున్నాయి. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేకిన్ ఇండియా - అంటూ ప్రచారాల హోరు తప్ప, వాస్తవంగా అక్కడ జరుగుతున్నది ఏమీలేదు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కీము, ఎంటర్‌ప్యూనర్‌షిప్ స్కీములన్నీ మూతపడ్డాయి. అధిక ధరలతో సామాన్యుడు తిండి కూడా సరిగా తినలేకపోతున్నాడు. బడ్జెట్‌లో 65 శాతానికి పైగా ప్రధానీ, అతని సహచరులూ విదేశాలలో తిరగడానికి ఖర్చు పెడుతున్నారు. వృద్ధుల, మహిళల సంక్షేమానికి, సంరక్షణకు ఖర్చుపెట్టాల్సిన నిధులూవారికి ఇవ్వాల్సిన పెన్షన్లూ నానాటికీ తగ్గిపోతున్నాయి. అంతేకాదు 2014 నుంచి ఈ దేశంలో మరొక ప్రమాదకరమైన దృశ్యం కనిపిస్తోంది. స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్న ఆనాటి దేశ నాయకులపై బీజేపీ సోషల్ మీడియా వికృతమైన ప్రచారాలు చేస్తోంది. యధార్థాలు తెలుసుకోని నేటి యువతరాన్ని విపరీతంగా ప్రభావం చేస్తోంది. తమ తండ్రులు, తాతలు నెహ్రూ పాలసీల వల్ల గౌరవంగా బతకగలిగారన్నది తెలుసుకోలేకపోతున్నారు. నెహ్రూను నాటి స్వాతంత్ర్య పోరాట నాయకుల్నీ అవహేళన చేయడం, ప్రస్తుతం అధికారంలో ఉన్నవారు ఒక ఫ్యాషన్‌గా మార్చేశారు. అయితే వారికి కాలం తప్పక గుణపాఠం నేర్పుతుంది. నైతికత, వైజ్ఞానిక స్పృహ, కనీసం ఇంగిత జ్ఞానం లేని నేటి పాలకుల నిజస్వరూపం బయట పడుతూనే ఉంది. దేశ ప్రజలు నిజాలు గ్రహిస్తూనే ఉన్నారు. ఉద్యమాలకు ఉద్యుక్తులవుతూనే ఉన్నారు. ఒక చీకటి యుగాన్ని స్వర్ణయుగమని చేసుకుంటున్న ప్రచారం ప్రపంచం నిశితంగా పరిశీలిస్తోంది!



# జాతీయం-అంతర్జాతీయం



# ఆర్టీఐ నిర్వీర్యం

- 40 వేలకుపైగా కేసులు పెండింగ్
- పూర్తి స్థాయి కమిషనర్లు ఉన్నా అదే దుస్థితి
- ఆగస్టులో నిలిచిపోయిన అప్పీళ్లు
- సమాచార హక్కును కట్టడి చేస్తోన్న కేంద్రం
- ఈ ఏడాది 20 వేలకుపైగా అప్పీళ్లు
- పరిష్కారమైనవి 11,903 మాత్రమే!
- సామాజిక కార్యకర్తల ఆందోళన

**న్యూఢిల్లీ, ఆగస్టు 15 (ఎ.ఎం.ఎస్):** సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)ను ప్రజాస్వామ్యంలో పారదర్శక పాలనకు కీలక ఆయుధంగా భావిస్తారు. అయితే కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ)లో 40 వేలకు పైగా కేసులు పేరుకుపోవడం, పూర్తి స్థాయి కమిషనర్లు ఉన్నప్పటికీ కేసుల పరిష్కారంలో ఆశించిన వేగం కనిపించక పోవడం ఆర్టీఐ వ్యవస్థ పనితీరుపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఆగస్టు నెలలో దాదాపు అన్ని కమిషనర్ల వద్ద కేసుల పరిష్కారంలో శూన్య పురోగతి నమోదవడం పరిస్థితి తీవ్రతను ప్రతిబింబిస్తోంది. ఈ విషయంలో సమాచార హక్కు కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'తెలుసుకునే హక్కు'ను నిర్వీర్యం చేస్తున్నారంటూ ఆరోపణలు చేస్తున్నారు.న్యూఢిల్లీ : కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ)లో సమాచార హక్కు (ఆర్టీఐ) కేసుల పెండింగ్ ఆందోళనకర స్థాయికి చేరింది. కమిషన్ పూర్తి స్థాయి సిబ్బంది, 10 మంది సమాచార కమిషనర్లు, ఒక ప్రధాన సమాచార కమిషనర్‌తో పనిచేస్తున్నప్పటికీ... ఆగస్టు 12 నాటికి మొత్తం 40,083 కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు సీఐసీ అధికారిక పోర్టల్ వెల్లడించింది. ఈ పెండింగ్ కేసుల్లో 3,733 ఫిర్యాదులు, 36,350 అప్పీల్స్ ఉన్నాయి. ప్రధాన సమాచార కమిషనర్ రాజ్‌కుమార్ గోయల్ ఒక్కరి వద్దే 5,317 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో 522 ఫిర్యాదులు, 4,795 అప్పీల్స్ ఉన్నాయి.సీఐసీ నివేదిక ప్రకారం... ఆగస్టులో ఇప్పటివరకు ఇద్దరు సమాచార కమిషనర్లు మాత్రమే మూడు అప్పీల్స్‌ను పరిష్కరించారు. వినోద్ కుమార్ తివారీ ఒక కేసు, స్వాగత్ దాస్ రెండు కేసులను మాత్రమే పరిష్కరించారు. మిగిలిన ఎనిమిది మంది సమాచార కమిషనర్లు ఒక్క అప్పీల్‌ను కూడా పరిష్కరించకపోవడం గమనార్హం.సామాజిక కార్యకర్త, రిటైర్డ్ కమోడోర్ లోకేశ్ బాత్రా ఈ పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 2015లో కూడా ప్రధాన సమాచార కమిషనర్ లేక, ముగ్గురు కమిషనర్ల కొరత కారణంగా 40 వేలకుపైగా కేసులు పెండింగ్‌లో ఉండేవని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు పూర్తి స్థాయి కమిషనర్లు ఉన్నప్పటికీ అదే స్థాయిలో పెండింగ్ కొనసాగడం మరింత ఆందోళనకరమని అన్నారు. ''సమాచారం తెలుసుకునే ప్రజల హక్కును నిరుత్సాహపరిచేందుకు కమిషనర్లు ఉద్దేశపూర్వకంగా నెమ్మదిగా పనిచేస్తున్నారా? ఈ పరిస్థితి ఆర్టీఐ చట్టాన్నే నిర్వీర్యం చేసే ప్రమాదం ఉంది'' అని ఆయన ప్రశ్నించారు. పెండింగ్ కేసులను తగ్గించాలంటే కేంద్ర సమాచార కమిషన్‌లో సమూల సంస్కరణలు అవసరమనీ, అవసరమైతే ప్రధాన సమాచార కమిషనర్‌తో పాటు కమిషనర్లు శనివారాల్లో కూడా పనిచేసేలా చ్యలు తీసుకోవాలని బాత్రా సూచించారు.ఈ ఏడాదిలో ఇప్పటివరకు సీఐసీకి 20,163 అప్పీల్స్ అందగా... వాటిలో 11,903 కేసులు మాత్రమే పరిష్కారమయ్యాయి. ప్రధాన సమాచార కమిషనర్ రాజ్‌కుమార్ గోయల్ జనవరి నుంచి జులై మధ్య తన వద్దకు వచ్చిన 2,541 అప్పీల్స్‌లో 1,180 కేసులను మాత్రమే పరిష్కరించారు. అంటే ఆయన పరిష్కార శాతం సుమారు 46 మాత్రమే కావడం గమనార్హం. ఆగస్టులో ఆయన వద్ద కొత్తగా వచ్చిన, పరిష్కరించిన అప్పీల్స్ ఏవీ నమోదు కాలేదని నివేదిక వెల్లడించింది. అలాగే సమాచార కమిషనర్ల వద్ద కూడా ఆగస్టు తొలి 12 రోజుల్లో కేసుల పరిష్కారంలో ఎలాంటి పురోగతీ కనిపించలేదు.





# అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తోన్న భారత్

- రష్యా అధ్యక్షుడు పుతిన్ శుభాకాంక్షలు

**మాస్కో, ఆగస్టు 15 :** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్ అన్ని రంగాల్లో అద్భుతమైన పురోగతి సాధిస్తోందని, అంతర్జాతీయ వేదికపై కీలక పాత్ర పోషిస్తోందని ఆయన ప్రశంసించారు. భారత్ ఆర్థిక, సామాజిక, సైన్స్, సాంకేతిక రంగాల్లో అద్భుతమైన పురోగతిని సాధిస్తోందని అన్నారు. రష్యా, భారత్ సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్య స్ఫూర్తితో విజయవంతంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఐక్యరాజ్యసమితి, షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ), బ్రిక్స్ వంటి అంతర్జాతీయ వేదికల్లో ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇరు దేశాల మధ్య సహకారం మరింత బలోపేతం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. తమ ఉమ్మడి కృషి ద్వారా, తమ స్నేహపూర్వక ప్రజల ప్రయోజనం కోసం, అంతర్జాతీయ భద్రత, స్థిరత్వాన్ని పెంపొందించే లక్ష్యంతో, నిర్మాణాత్మక రష్యా,భారత భాగస్వామ్యాన్ని తాము బలోపేతం చేస్తూనే ఉంటామని తనకు పూర్తి విశ్వాసం ఉందని అన్నారు.భారత్, రష్యా మధ్య వాణిజ్య, రవాణా అనుసంధానాన్ని మరింత పెంచేందుకు చర్చలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఆర్కిటిక్ ప్రాంతంలోని ఉత్తర సముద్ర మార్గం (ఎన్ఎస్ఆర్) ద్వారా ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంచే అంశంపై చర్చలు జరుగుతున్నట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ఉత్తర సముద్ర మార్గం ఇప్పటికే ఉన్న అంతర్జాతీయ ఉత్తర-దక్షిణ రవాణా కారిడార్, చెన్నై-వ్లాడివోస్టాక్ సముద్ర మార్గాలకు అదనపు అనుసంధాన మార్గంగా ఉపయోగపడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఆర్కిటిక్ ప్రాంతంలో నావిగేషన్ కోసం భారతీయ నావికులకు శిక్షణ ఇవ్వడం సహా సముద్ర, ఆర్కిటిక్ రంగాల్లో రష్యాతో దీర్ఘకాలిక సహకారాన్ని భారత్ కొనసాగించనుంది.



# దేవేంద్రనాథ్ మహ అరెస్టు

- రాంచీలో ఉద్రిక్తత
- పోలీసుల తీరుపై మహ ఆగ్రహం

**రాంచీ, ఆగస్టు 15 (ఎ.ఎం.ఎస్) :** స్వాతంత్ర్య దినోత్సవం వేళ జార్ఖండ్ రాజధాని రాంచీలో ఉద్రిక్తత నెలకొంది. తిరంగా యాత్రలో పాల్గొనేందుకు ప్రయత్నించిన జార్ఖండ్ లోక్ క్రాంతికారీ మోర్చా నాయకుడు దేవేంద్ర నాథ్ మహను పోలీసులు నిర్బంధించారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షలలో జరిగిన అవకతవకలకు వ్యతిరేకంగా వేలాది విద్యార్థులు నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. పలువురు విద్యార్థులు 20 రోజులకు పైగా నిరహార దీక్ష చేస్తున్నారు.

తాజాగా పేపర్ లీక్ లను వ్యతిరేకిస్తూ శనివారం రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో విద్యార్థులంతా జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. నిరాహార దీక్ష లో ఉన్న విద్యార్థి నాయకులు వీల్ చైర్ లో కూర్చొని ర్యాలీలో పాల్గొన్నారు. అయితే ఆస్పత్రిలో ఉన్న దేవేంద్ర నాథ్ మహ తిరంగా ర్యాలీలో పాల్గొనేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆయనను బలవంతంగా గదిలో నిర్బంధించారు.

"నిరసన జరుగుతున్న జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ,'తిరంగా మార్చ్'లో పాల్గొనాలనే నా కోరికను తెలియజేసిన తర్వాత, సదర్ ఆసుపత్రిలోని నా గది బయట భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. అసలు ఇది ఎలాంటి స్వేచ్ఛ? మన సొంత దేశంలోనే త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడానికి, 'తిరంగా మార్చ్'లో పాల్గొనడానికి కూడా మనకు స్వేచ్ఛ లేదా? క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ, నేను శాంతియుత పద్ధతిలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకుంటున్నాను," అని మహ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.





# సరికొత్త ఉత్సాహంతో ముందుకు సాగుదాం

- వేగంగా అభివృద్ధి చెందుతోన్న దేశం
- మా లక్ష్యం.. వికసిత్ భారత్...
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 15 (ఎ.ఎం.ఎస్):** దేశవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఢిల్లీలోని చారిత్రక ఎర్రకోటపై ప్రధాని నరేంద్ర మోడీ శనివారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. దేశ చరిత్రలో తొలిసారిగా వందేమాతరం గేయాన్ని పూర్తిగా ఈ వేడుకల్లో ఆలపించారు. జెండా ఎగురవేయడానికి ముందు ప్రధాని మోడీ ..రాజ్‌ఘాట్ వద్ద మహాత్ముడికి నివాళులు అర్పించారు. అనంతరం ఎర్రకోట వద్ద గౌరవవందనం స్వీకరించి త్రివర్ణ[illegible]కాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకలు ప్రారంభమైన సమయంలో వాయుసేన పూలవర్షం కురిపించింది. అనంతరం ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ''ఈ రోజు మనమంతా 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. ప్రతి హృదయంలో 'వందేమాతరం' ధ్వనిస్తోంది. ప్రతి ఇంట్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. కొత్త తీర్మానాలతో సరికొత్త ఉత్సాహంతో దేశం ముందుకు సాగుతోంది. గతంలో ఐదు బలహీన దేశాల జాబితాలో ఉన్న భారత్.. 12 ఏండ్ల తర్వాత ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థిక వ్యవస్థగా మారింది. ఆత్మనిర్భరత, సాంకేతిక అభివృద్ధి, తయారీ రంగం, యువత-మహిళల భాగస్వామ్యం, ఇంధన భద్రత వంటి అంశాల ఆధారంగా 2047 నాటికి వికసిత్ భారత్‌ను నిర్మించడమే ప్రధాన లక్ష్యం అని అన్నారు.

సెమీకండక్టర్లు: సెమీకండక్టర్ రంగాన్ని దేశ అభివృద్ధికి కీలకంగా పేర్కొంటూ, భారత్ ఈ రంగంలో వేగంగా ముందుకెళ్తోందన్నారు.

ఇంధన భద్రత: అంతర్జాతీయ సంక్షోభాల మధ్య దేశ ఇంధన అవసరాలకు భద్రత కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

పేదరిక నిర్మూలన: గత 12 ఏళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చామని పేర్కొన్నారు.

రైతుల సంక్షేమం: యూరియా, డీఏపీ వంటి ఎరువుల విషయంలో రైతులపై భారం పడకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

వాణిజ్యం: 2014 నుంచి 40 దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు.

యువత, మహిళలు: దేశ అభివృద్ధిలో యువత, మహిళల పాత్ర అత్యంత కీలకమని అన్నారు.

తయారీ రంగం: చిన్న ఉత్పత్తుల నుంచి భారీ వస్తువుల వరకు దేశంలోనే తయారు చేయాలని, నాణ్యత, ప్యాకేజింగ్, ఉత్పత్తి సామర్థ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు.

డిజిటల్ భారత్: భారత్ డిజిటల్ ఇన్నోవేషన్ హబ్‌గా ఎదుగుతోందని పేర్కొన్నారు.



# స్కూల్ టీక్ కరో...

- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపు
- సొంత గ్రామం నుంచే కార్యక్రమం ప్రారంభం



**ముంబయి, ఆగస్టు 15 (ఎ.ఎం.ఎస్) :** స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే 'స్కూల్ టీక్ కరో' (పాఠశాలలను బాగు చేయండి) ప్రచారాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. మహారాష్ట్రలోని హింగోలిలోని తన స్వగ్రామమైన సంతుక్ పింప్రిలో ఈప్రచారాన్ని ప్రారంభించనున్నామని ప్రకటించారు. తన గ్రామానికి బయలుదేరే ముందు, శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఏపార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల మౌలిక సదుపాయాలను, ప్రమాణాలను మెరుగుపరచడంలో రాజకీయ పా[illegible]గినంత కృషి చేయలేదని విమర్శించారు. ప్రస్తుతం విద్య గురించి మాట్లాడాల్సిన అవసరం ఉందని ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. అధికారంలో ఉన్న ఏపార్టీ కూడా పాఠశాలల అభివృద్ధి కోసం ఎటువంటి చర్యలు చేపట్టలేదని అన్నారు. ఇప్పుడు ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన సమయం వచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలో ఛత్రపతి సంభాజీనగర్ నగరంలో శుక్రవారం నిర్వహించిన 'తిరంగా ర్యాలీ' సందర్భంగా అక్కడ వెలిసిన భారీ బ్యానర్లకు నిధులు ఎక్కడి నుంచి వచ్చాయని దీప్కే ప్రశ్నించారు. తిరంగా ర్యాలీ నిర్వహించడం మంచిదేనని, కానీ ప్రతి 4050 అడుగులకు ఒక భారీ బ్యానర్‌ను ఏర్పాటు చేశారని, వాటన్నింటికీ నిధులు ఎక్కడి నుండి వచ్చాయని ప్రభుత్వాన్ని నిలదీశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. సోమవారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరిచేందుకు దేశవ్యాప్తంగా ప్రచారాన్ని చేపట్టనున్నట్లు సోమవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. పాఠశాలల్లో ప్రాథమిక సౌకర్యాలు ఉన్నాయా లేదా అని తల్లిదండ్రులకు సూచించారు. విద్యాసంస్థలను మెరుగుపరిచే బాధ్యతను సర్పంచులు చేపట్టాలని పిలుపునిచ్చారు.



# లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులు


**బీరుట్, ఆగస్టు 15 :** లెబనాన్ పై ఇజ్రాయిల్ వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 9మంది మృతి చెందారు. 12మంది తీవ్రంగా గాయపడ్డారు. లెబనాన్ వ్యాప్తంగా పలు ముఖ్యపట్టణాలతో పాటు గ్రామాల్లో కూడా ఇజ్రాయిల్ వైమానిక దళాలు దాడులకు తెగబడ్డాయని లెబనాన్ అధికారులు తెలియజేశారు. శనివారం తెల్లవారుజామున నబాతియే జిల్లాలోని అన్సార్ శివార్లలో ఒక ఇంటిపై జరిగిన దాడిలో ఆ ఇల్లు ధ్వంసమవగా, ఏడుగురు మరణించారని, ముగ్గురు గాయపడ్డారని లెబనాన్ నేషనల్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది.

# పదవి నుంచి వైదొలగనున్న వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ

- రెండోసారి తల్లి కావటమే కారణం

**వాషింగ్టన్, ఆగస్టు 15 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అత్యంత విశ్వసనీయ సహాయకుల్లో ఒకరైన వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ తన పదవి నుంచి వైదొలగనున్నారు. ఆగస్టు నెలాఖరులో ఆమె బాధ్యతల నుంచి తప్పుకోనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. 28 ఏళ్ల కరోలిన్ లీవిట్ అమెరికా చరిత్రలో వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన అత్యంత పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందారు.

రెండోసారి తల్లి అయిన అనంతరం ఇటీవలే ప్రసూతి సెలవు నుంచి వైట్ హౌస్‌కు తిరిగి వచ్చిన ఆమె.. తన పిల్లలతో ఎక్కువ సమయం గడపాలనే ఉద్దేశంతో పదవి నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పదవీ కాలం పూర్తి చేయకుండానే ఆమె వైదొలుగుతున్నారు. ఈ ఖాళీకి ఎవరిని నియమిస్తారనేది వెల్లడించలేదు.కరోలిన్ లీవిట్ ట్రంప్ తొలి అధ్యక్ష పదవీకాలంలో వైట్ హౌస్ అసిస్టెంట్ ప్రెస్ సెక్రటరీగా పనిచేశారు. అనంతరం న్యూయార్క్‌కు చెందిన రిపబ్లికన్ కాంగ్రెస్ సభ్యురాలు ఎలిస్ స్టెఫానిక్‌కు కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2022లో న్యూ హాంప్‌షైర్‌లోని కాంగ్రెస్ నియోజకవర్గం నుంచి రిపబ్లికన్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆమె.. ప్రైమరీలో గెలిచినా సాధారణ ఎన్నికల్లో డెమోక్రటిక్ అభ్యర్థి క్రిస్ పప్పాస్ చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత ట్రంప్‌కు మద్దతు ఇచ్చే మాగా ఇంక్.కు ప్రతినిధిగా పనిచేశారు. 2024 అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్ ప్రచారానికి జాతీయ ప్రెస్ సెక్రటరీగా వ్యవహరించారు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, జనవరి 2025లో వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీగా నియమితులయ్యారు.



# సాధారణంగానే నౌకల ప్రయాణం

- హర్మూజ్‌పై ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్

**టెహ్రాన్, ఆగస్టు 15 :** హర్మూజ్ జలసంధిలో నౌకలు సాధారణంగా ప్రయాణిస్తున్నాయని, అది తమ నియంత్రణలోనే ఉందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అసత్యాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. ఇరాన్‌పై యుద్ధం, ప్రత్యేకించి హర్మూజ్ విషయంలో అమెరికా తప్పుడు అంచనాలు వేసుకుందని ఆయన గురువారం స్పష్టం చేశారు.

జలసంధిలో నౌకలు సాధారణంగానే పయనిస్తున్నాయని అమెరికా చెబుతున్న వ్యాఖ్యలు తప్పుడు, బూటకపు వ్యాఖ్యలు అని ఇరాన్ సెంట్రల్ మిలటరీ కమాండ్ ప్రతినిధి ఇబ్రహీం జుల్ఫఘరి పేర్కొన్నారు. ఇరాన్ నాయకత్వం తరపు నుండి మూడు దశల్లో హర్మూజ్‌పై ప్రకటనలు విడుదలయ్యాయి. తదుపరి దశ యుద్ధంలో ఇరాన్ మరింత దూకుడుగా వ్యవహరిస్తుందని బ్రిగేడియర్ జనరల్ రసూల్ సనాయిరాద్ తెలిపారు. 'ఇటీవలి యుద్ధంలో మేము చాలా దృఢంగా నిలబడ్డాం. దైవ సంకల్పం ఉంటే భవిష్యత్తులో జరిగే యుద్ధంలో మరింత దృఢంగా, దూకుడుగా నిలబడతాం' అని సుప్రీం నేత ముజ్తాబా కార్యాలయంలో రాజకీయ సలహాదారుగా పనిచేస్తున్న సనాయి రాద్ పేర్కొన్నారు. ఆర్థిక ఒత్తిళ్ల ద్వారా అంతర్గత విభేదాలు సృష్టించాలని శత్రువు భావించిందని, ఆ ఎత్తుగడ ఫలించలేదని అమెరికా పేరును ప్రస్తావించకుండా ఆయన వ్యాఖ్యానించారు. హర్మూజ్ జలసంధి ఇప్పటికీ ఇరాన్ నియంత్రణ, నిర్వహణలోనే వుందని ఐఆర్‌జిసి అనుబంధ పారా మిలిటరీ బసిజ్ సంస్థ కమాండర్ హుస్సేన్ తయాబ్ కూడా స్పష్టం చేశారు.




# ఇండోనేషియాలో భారీ భూకంపం

- రికార్టు స్కేలుపై 7.7 తీవ్రత
- భయాందోళనలో ప్రజలు

**నుసొంతారా, ఆగస్టు 15 :** ఆగ్నేయాసియా దేశం ఇండోనేషియాను భారీ భూకంపం వణికించింది. శనివారం తెల్లవారుజామున దేశ తీరప్రాంతంలో సముద్ర గర్భంలో 7.7 తీవ్రతతో శక్తివంతమైన భూకంపం సంభవించింది. దీని ప్రభావంతో అధికారులు వెంటనే సునామీ హెచ్చరికలు జారీ చేయడంతో తీరప్రాంత ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. అమెరికా జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్) ప్రకారం, భూకంపం రిక్టర్ స్కేలుపై 7.7గా నమోదైంది. సముద్ర ఉపరితలం నుంచి కేవలం 10 నుంచి 30 కిలోమీటర్ల లోతులోనే భూకంప కేంద్రం ఉన్నట్లు ఇండోనేషియా ఏజెన్సీ (బీఎంకేజీ) కూడా ధ్రువీకరించింది. భూ ప్రకంపనల ధాటికి సమీపంలోని ద్వీపాలు, నగరాలు తీవ్రంగా కంపించడంతో.. నిద్రలో ఉన్న ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

భూకంప తీవ్రత ఎక్కువగా ఉండటం, సముద్రంలో చాలా తక్కువ లోతులో సంభవించడంతో సునామీ ముప్పు పొంచి ఉందని అధికారులు తెలిపారు. భూకంప కేంద్రానికి 300 కిలోమీటర్ల పరిధిలోని తీరప్రాంత ప్రజలు వెంటనే సురక్షితమైన, ఎత్తైన ప్రదేశాలకు వెళ్లాలని ఆదేశించారు. 1 నుంచి 3 మీటర్ల ఎత్తు వరకు రాకాసి అలలు తీరాన్ని తాకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం (పీటీడబ్ల్యూసీ) కూడా ఫిలిప్పీన్స్, మలేషియా, ఆస్ట్రేలియా వంటి దేశాలను అప్రమత్తం చేసింది. సమాచారం అందిన వెంటనే ఇండోనేషియా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (బీఎన్‌పీబీ) రంగంలోకి దిగింది. రెస్క్యూ బృందాలను ప్రభావిత ప్రాంతాలకు పంపించింది. ఈ భూకంపం వల్ల పలు భవనాలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ప్రధాన భూకంపం తర్వాత కూడా ప్రకంపనలు (ఆఫ్టర్‌షాక్స్) వచ్చే అవకాశం ఉన్నందున, శిథిలావస్థలో ఉన్న భవనాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటం వల్ల ఇండోనేషియాలో భూకంపాలు, అగ్నిపర్వతాలు సర్వసాధారణం. 2004లో ఇదే ప్రాంతంలో సంభవించిన పెను భూకంపం, సునామీ సృష్టించిన విలయం మరువకముందే మరోసారి భారీ భూకంపం రావడం ఆందోళన కలిగిస్తోంది.



**భూకంప తీవ్రత ఎక్కువగా ఉండటం, సముద్రంలో చాలా తక్కువ లోతులో సంభవించడంతో సునామీ ముప్పు పొంచి ఉందని అధికారులు తెలిపారు. భూకంప కేంద్రానికి 300 కిలోమీటర్ల పరిధిలోని తీరప్రాంత ప్రజలు వెంటనే సురక్షితమైన, ఎత్తైన ప్రదేశాలకు వెళ్లాలని ఆదేశించారు.**

# జమ్మూ కాశ్మీర్ సీఎం సంచలన వ్యాఖ్యలు

- పీవోకేలో విలీనానికి ప్రజలు ముందుకొచ్చేవారంటూ కామెంట్

**శ్రీనగర్, ఆగస్టు 15 (ఎ.ఎం.ఎస్) :** శ్రీనగర్ లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జమ్ముకశ్మీర్ సీఎం ఓమర్ అబ్దులా కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదాను కేంద్రం తొలగించి ఉండకపోతే, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ ప్రజలు జమ్మూకశ్మీర్‌లో విలీనం కావడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చేవారని ఒమర్ అబ్దుల్లా శనివారం అన్నారు. గత కొద్ది రోజులుగా పీఓకేలో జరుగుతున్న పరిణామాలు ఆందోళనకు గురి చేస్తున్నాయని, ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాటం చేస్తున్న అనేక మందిని చంపేశారని, వందల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారని, లక్షల మందిని చరసాలల్లో బంధించారు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "రాష్ట్ర హోదా, రాజ్యాంగపరమైన హామీలను పునరుద్ధరించడానికి, అలాగే జమ్మూ కాశ్మీర్‌ను అభివృద్ధి పథంలో నడిపించడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ లక్ష్యాలను సాకారం చేసే దిశగా మేము కృషి చేస్తాము," అని అబ్దుల్లా తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో పేర్కొన్నారు.ఈ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా ఖండించింది. సీఎం హోదాలో ఉండి ఓమర్ అబ్దుల్లా బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడింది. పీఓకే ప్రజలను భారత్ లో విలీనం కావాలని పిలుపునివ్వడం సరైన పద్ధతి కాదని విమర్శలు గుప్పించింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఈ వ్యాఖ్యలు తగదని, ఈ విషయాన్ని రాజకీయం చేయడం సమంజసం కాదని హితువు పలికింది.




# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- **ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**ఖమ్మం ఆగస్టు 15 (ఉదయం ప్రతినిధి):**
2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం అన్ని రంగాల్లో వేగంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్, ప్రణాళిక శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.
స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వేడుకల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉదయం పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీస్ కవాతు నుంచి గౌరవ వందనం స్వీకరించి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులకు హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు పెంచే మహత్తరలక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.





**రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత:**
రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతు భరోసా పథకం ద్వారా జిల్లాలో 3,41,913 మంది రైతులకు రూ.427.97 కోట్లు, పంట రుణమాఫీ క్రింద 1,31,760 మంది రైతులకు రూ.912.10 కోట్లు, రైతు బీమా ద్వారా 803 మంది రైతు కుటుంబాలకు రూ.40.15 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని తెలిపారు.
అదేవిధంగా 44,568 మంది రైతుల నుంచి రూ.681.49 కోట్ల విలువైన 2,83,956.397 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేశామని చెప్పారు. యాసంగి 2025-26లో 20,085 మంది రైతుల నుంచి 14,62,411.60 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.346.82 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా చెల్లించామని తెలిపారు.
జిల్లాలోని 129 రైతు వేదికలు, 62 వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ల ద్వారా ప్రత్యామ్నాయ పంటలు, ప్రకృతి వ్యవసాయం, వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన సాగు పద్ధతులపై రైతులకు నిరంతర శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.
ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3,098 ఎకరాల్లో కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేపట్టేందుకు రూ.29.37 కోట్ల రాయితీ అందించామని, సూక్ష్మ నీటి సేద్య పథకం క్రింద 3,082 ఎకరాల్లో డ్రిప్, స్ప్రింక్లర్ వ్యవస్థలు ఏర్పాటు చేసి రూ.7.37 కోట్ల రాయితీ అందించామని తెలిపారు.

**విద్యారంగంలో ఖమ్మం జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానం:**
సెంట్రలైజ్డ్ మెకనైజ్డ్ కిచెన్ వ్యవస్థను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గురుకుల, రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఖమ్మం జిల్లాలో బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో 66 వేల 882 మంది విద్యార్థుల నమోదు జరిగిందని తెలిపారు. ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీలో ఖమ్మం జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉండగా, పర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో 5వ స్థానంలో ఉందన్నారు.
అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించేందుకు ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి రూ.200 కోట్ల వ్యయంతో మొత్తం 5 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామని చెప్పారు. వైరా నియోజక వర్గంలోని ఏన్కూర్, సత్తుపల్లి నియోజక వర్గంలోని తల్లాడ, పాలేరు నియోజక వర్గంలోని తిరుమలాయపాలెం, మధిర నియోజక వర్గంలోని సిరిపురంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని చెప్పారు.మధిరలో నూతనంగా మంజూరైన ఇంజనీరింగ్ కళాశాలకు యూనివర్సిటీ అనుమతులు లభించాయని, ప్రస్తుత సంవత్సరం పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

**వైద్య రంగంలో ఆధునిక సదుపాయాల కల్పన:**
ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రూ.23.75 కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ భవనాన్ని పూర్తి చేశామని చెప్పారు. CT స్కాన్, 2D ECHO, అల్ట్రాసౌండ్, 20 వెంటిలేటర్లు, క్యాథ్ ల్యాబ్,తదితర ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వైరాలో రూ.37.50 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రి, కూసుమంచిలో రూ.45.50 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రి, తిరుమలాయపాలెం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రూ.26 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.

**సాగునీటి ప్రాజెక్టులతో కొత్త ఆయకట్టు:**
సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా పాలేరు లింక్ కాలువతో 1,38,790 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించనున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.
మున్నేరు-పాలేరు లింక్ కాలువను రూ.107.65 కోట్లతో నిర్మిస్తున్నామని, జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని రూ.630.30 కోట్లతో చేపట్టామని చెప్పారు. మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టుకు అదనపు నీరు అందించే పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు.

18L 8.69 కిలోమీటర్ల కాలువ ద్వారా 7,115 ఎకరాల కొత్త ఆయకట్టు, 1,18,933 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఖమ్మం నగరంలో మున్నేరు వరదల నియంత్రణకు రూ.525.36 కోట్లతో రక్షణ గోడ నిర్మిస్తున్నామని తెలిపారు.

**పునరుత్పాదక ఇంధనానికి ప్రోత్సాహం:**
బోనకల్ మండలంలోని 22 గ్రామాలతో పాటు సిరిపురం, లక్ష్మీపురం, చెరువు మాదారం, రఘునాధపాలెం, శ్రీరామగిరి, లచ్చగూడెం గ్రామాల్లో మోడల్ సోలార్ గ్రామాల అభివృద్ధికి రూ.16.04 కోట్లతో పనులు చేపట్టామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.
జిల్లాలో నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం 128 విద్యుత్ సబ్ స్టేషన్లు పనిచేస్తుండగా, అదనంగా 38 నూతన సబ్ స్టేషన్లు మంజూరు చేయగా, 9 సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. ఖమ్మం నగరంలో మొట్టమొదటి ఇన్‌డోర్ సబ్‌స్టేషన్‌ను రూ.6.50 కోట్లతో మంజూరు చేశామని తెలిపారు.

రాజులపాలెంలో 1 మెగావాట్ సోలార్ ప్లాంట్ ప్రారంభించగా, మరో ప్లాంట్ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. 27 మోడల్ సోలార్ గ్రామాల్లో రూఫ్‌టాప్ సోలార్, సౌర పంపుసెట్ల ఏర్పాటు జరుగుతోందన్నారు. పిఎం కుసుమ్ క్రింద 1,795 మెగావాట్ల సామర్థ్యానికి ఒప్పందాలు పూర్తయ్యాయని, 379 ప్రభుత్వ పాఠశాలల్లో 1,768 కిలోవాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

**మహిళా సాధికారతకు భారీగా ఆర్థిక సహాయం:**
ఇందిరా మహిళా డెయిరీ పైలట్ ప్రాజెక్టు క్రింద మధిర నియోజకవర్గంలోని 5 మండలాల్లో తొలి దశలో రూ.2 కోట్ల వ్యయంతో 125 యూనిట్లకు రెండు పాడి గేదెల చొప్పున మంజూరు చేశామని తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం 3,239 మహిళా సంఘాలకు రూ.330.69 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు, 409 సంఘాలకు రూ.12.05 కోట్ల స్త్రీనిధి రుణాలు, 52,059 మహిళా సంఘాలకు రూ.57.15 కోట్ల వడ్డీలేని రుణాలు, 3,609 మంది మహిళా పారిశ్రామికవేత్తలకు రూ.66.67 కోట్ల రుణాలు అందించామని తెలిపారు.

## నిరుపేద కుటుంబాలకు చేయూతగా ఎన్ఎఫ్‌బీఎస్ పథకం



- **1,318 కుటుంబాలకు రూ.2.39 కోట్ల ఆర్థిక సహాయం.**
- **765 మహిళా సంఘాలకు రూ.72.50 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు.**
- **లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన రాష్ట్ర మంత్రి దనసరి**
- **అనసూయ సీతక్క**

**ములుగు, ఆగస్టు 15 (ఉదయం ప్రతినిధి) :**
నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ ద్వారా కుటుంబానికి ప్రధాన ఆర్థిక ఆధారంగా ఉన్న వ్యక్తిని కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తుందని, మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారత లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు.శనివారం తంగేడు మైదానంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ కింద కుటుంబానికి ప్రధాన ఆర్థిక ఆధారంగా ఉన్న వ్యక్తిని కోల్పోయిన ములుగు జిల్లాలోని 1,318 నిరుపేద కుటుంబాలకు మొత్తం రూ.2 కోట్ల 39 లక్షల ఆర్థిక సహాయం, 765 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.72 కోట్ల 50 లక్షల బ్యాంక్ లింకేజీ రుణాలకు సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ, కుటుంబానికి ఆర్థిక ఆధారంగా ఉన్న వ్యక్తిని కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచేందుకు నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.
మహిళల ఆర్థిక స్వావలంబన, స్వయం సహాయక సంఘాల బలోపేతమే లక్ష్యంగా బ్యాంక్ లింకేజీ రుణాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సహాయం ద్వారా మహిళా సంఘాలు తమ జీవనోపాధి కార్యకలాపాలను విస్తరించుకొని, కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు ఆర్థికంగా మరింత స్వయం సమృద్ధి సాధించాలని లబ్ధిదారులకు సూచించారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- **జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసన సభ్యులు డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్**

**మహబూబాబాద్, ఆగస్టు 15 (ఉదయం ప్రతినిధి) :**
భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్.టి.ఆర్ గ్రౌండ్స్‌లో శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.
ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తోందన్నారు.జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన పౌర సేవలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.
అనంతరం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా విప్ డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులు స్వాతంత్ర్య సమరయోధులను,వారి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. దేశ స్వాతంత్ర్యం కోసం వారు చేసిన త్యాగాలు, సేవలు చిరస్మరణీయమని కొనియాడారు



వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్, అభివృద్ధి కార్యక్రమాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వ్యవసాయ, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య, మత్స్య, గృహ నిర్మాణ, విద్య, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖలు తమ శాఖల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలను, ప్రదర్శనల ద్వారా వివరించాయి.అదేవిధంగా కె.జి.బి.వి కేసముద్రం, టి.జి.ఎస్.ఆర్.ఎస్, కె.జి.బి.వి చిన్నగూడూరు, ఆనంతారం మోడల్ స్కూల్, జె.డ్పి.హెచ్.ఎస్ గర్ల్స్, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చి, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.
అనంతరం సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, ఉద్యోగులకు విప్ రాంచంద్రునాయక్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, ప్రదానం చేశారు.అంతకుముందు జిల్లా పరిషత్ (ZP) కార్యాలయంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రత్యేక అధికారి మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్ స్నేహ శబరిష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ, వివిధ శాఖల అధికారులు, జెడ్పీ సిబ్బంది పాల్గొని జాతీయ గీతాన్ని ఆలపించారు. భారత స్వాతంత్ర పోరాట త్యాగాలను స్మరించుకుంటూ ప్రజలకు మరియు ఉద్యోగులకు ఈ సందర్భంగా స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

**జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ**
80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె అనిల్ కుమార్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ పురుషోత్తం, డి.ఆర్ ఓ, నాగవాణి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, పట్టణ ప్రముఖులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గాంధీ విగ్రహం వద్ద ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**సూర్యాపేట, ఆగస్టు 15: ఉదయం ప్రతినిధి**
80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.జాతీయ మహాత్మా గాంధీ సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు & సూర్యాపేట కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు.
"త్యాగాల ఫలితమే స్వాతంత్ర్యం"
ఈ సందర్భంగా కక్కిరేణి శ్రీనివాస్ మాట్లాడుతూ, "సమరయోధుల పోరాటం, అమరవీరుల త్యాగం వల్లనే భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది" అని అన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన వీరులను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, వారి ఆశయాలైన సమానత్వం, లౌకికవాదం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి మనందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకోవడమే అమరవీరులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.పాల్గొన్న కాంగ్రెస్ నాయకులుఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మల్లారెడ్డి, ఇస్రార్, మన్సూర్, శ్రీధర్, రాజిరెడ్డి, మధుకర్ రెడ్డి, ప్రసాద్, విద్యాసాగర్, సోమ విద్యాసాగర్, శ్రీశైలం, శంకర్ రెడ్డి, అంతయ్య, కృష్ణ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.జాతీయ గీతాలాపనతో, "భారత్ మాతాకీ జై" నినాదాలతో కార్యక్రమం ముగిసింది. అనంతరం హాజరైన వారందరికీ స్వీట్లు పంపిణీ చేశారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- **విప్ బీర్ల ఐలయ్య అంగరంగ వైభవంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు**

**జనగామ, ఆగస్టు 15 (ఉదయం ప్రతినిధి) :**
ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టరేట్ ఆవరణలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా హాజరై, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ప్రజాప్రతినిధులు మరియు అధికారులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసు కవాతు గౌరవ వందనం స్వీకరించారు. మహాలక్ష్మి 3.77 కోట్ల మంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం.గృహ జ్యోతి 97,449 కుటుంబాలకు ఉచిత విద్యుత్ సరఫరా.ఇందిరమ్మ ఇళ్లు 5,756 ఇళ్లు మంజూరు కాగా, 94% గ్రౌండింగ్‌తో రాష్ట్రంలోనే 2వ స్థానం. రైతు సంక్షేమం రైతు భరోసా కింద రూ.233.10 కోట్లు జమ; ధాన్యం కొనుగోళ్ల ద్వారా రూ.591.59 కోట్లు చెల్లింపు.
విద్య, స్వచ్ఛత SSC ఫలితాల్లో 97.66% ఉత్తీర్ణత, 'స్వచ్ఛత హి సేవ'లో జిల్లాకు రాష్ట్రస్థాయి ప్రథమ స్థానం.పాఠశాల విద్యార్థుల దేశభక్తి సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన 56 మంది సాధకులు, 33 మంది జిల్లా అధికారులు, 280 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.అనంతరం వివిధ శాఖల ప్రదర్శన స్టాళ్లను సందర్శించి, మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు, 25 మంది దివ్యాంగులకు రెట్రోఫిటెడ్ మోటార్ వాహనాలను పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## జాతీయ జెండాను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి



- **ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం!**

**హనుమకొండ, ఆగస్టు 15 (ఉదయం జిల్లా ప్రతినిధి) :**
హన్మకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజా సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. హన్మకొండ జిల్లా ప్రగతిని వివరించిన ఆయన, ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబ సభ్యులను మంత్రి మరియు ఇతర ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు.ప్రభుత్వ శకటాలు, వ్యవసాయ, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ, తదితర శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధి సంక్షేమ పథకాలపై ఏర్పాటు చేసిన శకటాలు, ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.సాంస్కృతిక వేడుకలు, విద్యార్థుల దేశభక్తి పూరిత సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.
ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, అధికారులకు మంత్రి చేతుల మీదుగా అవార్డులు అందజేశారు.
ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, పోలీస్ కమిషనర్ శ్వేత, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, కూడా ఇనగాల వెంకట్రామిరెడ్డి, ఇతర అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**వరంగల్ క్రైం, ఆగస్టు 15 (ఉదయం ప్రతినిధి) :**
వరంగల్ డీఐజీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో వరంగల్ పోలీస్ కమిషనర్, జోన్ ఫోర్ డీఐజీ ఎన్.శ్వేత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ అధికారులు సిబ్బందికి స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ మీఠాయిలను అందజేసారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ లు బాలస్వామి, సురేష్ కుమార్, హన్మకొండ, క్రైమ్, ట్రాఫిక్ ఏసీపీలు నర్సింగరావు, సదయ్య,
సత్యనారాయణ,ఆర్. ఐ సతీష్ తో పాటు కార్యాలయం సూపరింటెండెంట్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## దేశ ప్రగతిలో 'ఎల్ఐసీ'ది కీలక పాత్ర

- **భారతీయ జీవిత బీమా సంస్థ 1ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు**
- **బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి**

**నల్గొండ జిల్లా ఆగస్టు 15 (ఉదయం ప్రతినిధి) :**
నల్గొండ జిల్లా భారతీయ జీవిత బీమా సంస్థ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా భారతదేశం స్వాతంత్రం సాధించి ప్రగతి పథంలో దూసుకెళుతున్నదని, వారి ఆశయాలను నెరవేర్చే క్రమంలో ప్రతి పౌరుడు క్రమశిక్షణతో తమ విధులను నిర్వర్తించి దేశ ప్రగతికి తోడ్పడాలని సూచించారు. ప్రభుత్వం దేశాభివృద్ధి కోసం చేస్తున్నటువంటి కార్యక్రమాలకు భారతీయ జీవిత బీమా సంస్థ ఆర్థిక చేయూతనిస్తూ దేశ ప్రగతిలో తన వంతు పాత్రను పోషిస్తున్నదని, పౌరుల యొక్క కుటుంబ పెద్దలను పోగొట్టుకున్న సందర్భంగా వారు చేసిన భీమా ద్వారా వారి కుటుంబాలకు ఆర్థికంగా వెన్నంటి ఉంటున్నట్లు తెలిపారు. జీవిత బీమా సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు, ఏజెంట్ మిత్రులు చేస్తున్న సేవ అన్నిర్వచనీయమని, తెలిపారు. జీవిత బీమా సంస్థలో వస్తున్నటువంటి డిజిటల్ మార్పులకు అనుగుణంగా పాలసీదారులను చైతన్యవంతం చేయాల్సిందిగా ఈ సందర్భంగా ఏజెంట్ మిత్రులను వారు కోరడం జరిగినది.
ఈ కార్యక్రమంలో సంస్థలోని ఉద్యోగులు మరియు ఏజెంట్లు ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవిత బీమా సంస్థ ప్రపంచ స్థాయిలో ఒక అగ్రగణ్యమైన ఆర్థిక సంస్థగా ఉంటూ, ప్రజలకు ఎల్లప్పుడూ ఆర్థిక భరోసా ఇస్తున్నదని కావున ప్రతి ఒక్క పౌరుడు జీవిత బీమా సంస్థలో కనీస ఒక్క పాలసీనైనా తీసుకునే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత తమపై ఉన్నదని చెప్పారు.
ప్రతి ఒక్క కుటుంబము ఆర్థికంగా బలంగా ఉన్నప్పుడే దేశము బలంగా ఉంటుందని దీనికై ప్రతి ఒక్కరి బాధ్యతగా జీవిత బీమా సంస్థను పటిష్టం చేయాల్సిందిగా కోరారు ఈ కార్యక్రమంలో
అసిస్టెంట్ బ్యాంక్ మేనేజర్ మునిధర్ రావు బ్రాంచ్ సిబ్బంది వెంకన్న యాదగిరి లింగయ్య శ్రీనివాసులు
ఎల్ఐసి ఏజెంట్లు వెంకన్న రామ్మూర్తి రామలింగం శివశంకర్ యాదయ్య మహేశ్వరి కవిత వెంకన్న వేణుమాధవ్ వెంకన్న దేవేందర్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు



## ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- **సింగరేణి కొత్తగూడెం ఏరియాలో పలుచోట్ల జాతీయ జెండా ఆవిష్కరించిన ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండి. రజాక్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 15 (ఉదయం ప్రతినిధి)**
80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని పీవీకే5 షాఫ్ట్ మైన్స్, వీకే కోల్ మైన్స్, ఏజెంట్ కార్యాలయం, ఏరియా వర్క్‌షాప్, వివిధ విభాగాలతో పాటు రుద్రంపూర్, న్యూ ఏరియా, గౌతమ్‌పూర్ కాలనీలు, 4 ఇంక్లైన్ తదితర ప్రాంతాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో ఐఎన్టీయూసీ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. జయశంకర్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఉత్తమ ఉద్యోగుల సన్మాన కార్యక్రమం, పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**యాదాద్రి భువనగిరి. ఆగస్టు 15, ఉదయం ప్రతినిధి:**
80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం ఐడిఓసి ఆవరణ వద్ద జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ముందుగా కలెక్టర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి గాంధీజీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు సాత్విక్ , కృతిక, టి.JAC చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి ,కలెక్టరేట్ ఏవో, వివిధ శాఖల జిల్లా అధికారులు, అన్ని శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఆర్టీఏ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు



**ఆదిలాబాద్, ఆగస్టు 15 (ఉదయం ప్రతినిధి):**
జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ రవాణా శాఖ (ఆర్టీఏ) కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ శ్రీ రవీందర్ గౌడ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ జెండాకు వందనం చేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆయన వేడుకల్లో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. యువత దేశభక్తి, క్రమశిక్షణతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.వేడుకల్లో ఆర్టీఏ మెంబర్ దూత రాజేశ్వర్, డీటీఓ కిషోర్ బాబు, ఏఓ వరలక్ష్మి, ఎంవీఐ హరేంద్రనాథ్, టూర్స్ అండ్ ట్రావెల్స్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, ఏఎంవీఐ రంజిత్ కుమార్, సునీల్ అగర్వాల్, శుభం తదితరులు పాల్గొన్నారు. రవాణా శాఖ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలి

- **జిల్లా కలెక్టర్ కె.హరిత.**

**ఆసిఫాబాద్ ( ఉదయం ప్రతినిధి )**
ఈ నెల 17వ తేదీ నుండి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ప్రారంభం కానున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సంబంధిత శాఖలకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఫిర్యాదు సంబంధిత రసీదును అర్జీదారుకు అందించడం జరుగుతుందని, ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



బెజ్జూరు మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మండల అభివృద్ధి నోడల్ అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల ప్రజలు తమ సమస్యలను రాతపూర్వకంగా ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు విన్నవించుకోవాల్సిందిగా కోరారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

- **ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు**
- **5,982 ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు రూ.135 కోట్ల ఆర్థిక సహాయం – మరో 5,250 ఇండ్లు మంజూరు**
- **పెద్దపల్లి ఆర్టీసీ బస్ డిపో నిర్మాణానికి రూ.8.40 కోట్లు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి**
- **కోకాకోలా సంస్థ రూ.700 కోట్లకు పైగా పెట్టుబడితో పెద్దపల్లి జిల్లాకు రాక**
- **స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్**

**పెద్దపల్లి, ఆగస్టు – 15 (ఉదయం ప్రతినిధి)**



స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల స్ఫూర్తితో ప్రజల సంక్షేమం, జిల్లాల సమగ్ర అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పెద్దపల్లి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వేడుకల్లో ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమం జాతీయ గీతం *వందేమాతరం ఆలాపనతో ప్రారంభమైంది. అనంతరం ప్రభుత్వ విప్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులకు హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం సుమారు 200 బిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి 1 ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.50 లక్షల మంది అర్హులకు కొత్తగా సామాజిక భద్రతా పింఛన్లు అందించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. మరో 4 లక్షల మంది అదనపు లబ్ధిదారులకు గృహజ్యోతి కింద నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మరో 5 లక్షల కుటుంబాలకు మహాలక్ష్మి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించేలా పథకాలను విస్తరిస్తున్నామని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో కొత్తగా 30,909 రేషన్ కార్డులు మంజూరు చేసి 88,357 మందికి ప్రయోజనం కల్పించామని ప్రభుత్వ విప్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తెల్ల రేషన్ కార్డుదారులకు నేటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభమవుతుందని చెప్పారు. చేయూత పింఛన్ల కింద జిల్లాలో 90,540 మందికి రూ.40.70 కోట్ల పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. మహాలక్ష్మి పథకం కింద రూ.14.03 కోట్ల సబ్సిడీతో 4.74 లక్షల సిలిండర్లను 1.19 లక్షల మంది లబ్ధిదారులకు రూ.500కే అందించామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించడం ద్వారా రూ.245.27 కోట్లను ఆదా చేసుకున్నారని చెప్పారు. గృహజ్యోతి పథకం ద్వారా 1,40,116 కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తూ ఇప్పటి వరకు రూ.141.64 కోట్ల సబ్సిడీ అందించామని వివరించారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిర్మాణాల పురోగతి ఆధారంగా జిల్లాలో ఇప్పటివరకు 5,982 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.135 కోట్ల ఆర్థిక సహాయం జమ చేశామని ప్రభుత్వ విప్ తెలిపారు. రెండో విడతలో పెద్దపల్లి జిల్లాకు మరో 5,250 ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. జిల్లాలో గుడిసెల్లో నివసిస్తున్న 186 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని చెప్పారు.

ఆరోగ్యశ్రీ ద్వారా 48,188 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించి రూ.120.56 కోట్ల మేర లబ్ధి చేకూర్చామని ప్రభుత్వ విప్ తెలిపారు. రూ.101.45 కోట్ల అంచనా వ్యయంతో పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిని 50 నుంచి 100 పడకలకు విస్తరించడం, మంథనిలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణం, గుంజపడుగులో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రామగుండంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.
గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ హ్యామ్ మొదటి దశలో సుమారు 141 కిలోమీటర్ల మేర 44 రహదారి పనులు చేపడుతోందని తెలిపారు.

అమృత్ 2.0 కింద రూ.311 కోట్లు, యూఐడీఎఫ్ కింద రూ.201 కోట్లు, డీఎంఎఫ్‌టీ నిధుల ద్వారా రూ.88 కోట్లతో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, భూగర్భ మురుగునీటి వ్యవస్థ, వీధి దీపాలు తదితర అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు.ప్రధానమంత్రి స్వనిధి పథకం ద్వారా 35,065 మంది వీధి వ్యాపారులకు రూ.69.54 కోట్ల రుణాలు అందించామని చెప్పారు. మహిళా సంఘాలకు రూ.4.08 కోట్ల వడ్డీ మాఫీ చేశామని తెలిపారు.

పెద్దపల్లి ప్రజల దశాబ్దాల కల అయిన ఆర్టీసీ బస్ డిపోను ప్రజా ప్రభుత్వం సాకారం చేస్తోందని ప్రభుత్వ విప్ అన్నారు. బస్ డిపో నిర్మాణానికి ఆర్టీసీ రూ.8.40 కోట్లు మంజూరు చేసిందని, పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలోనే నిర్మాణాన్ని పూర్తి చేసి పెద్దపల్లి ప్రజలకు బస్ డిపోను అందుబాటులోకి తీసుకురానున్...

## కన్నుల పండుగగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- **ఎన్టీఆర్ మినీ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ వేముల వీరేశం.**

**నిర్మల్ జిల్లా, ఆగస్టు 15 (ఉదయం ప్రతినిధి):**
శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రభుత్వ విప్ వేముల వీరేశం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. వేడుకలకు హాజరైన ప్రభుత్వ విప్ కు అధికారులు పూల మొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఎగరవేశారు. జాతీయ గీతాలాపన, గేయాలాపన, తెలంగాణ రాష్ట్ర గీతాలాపన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ విప్ ఈ సందర్భంగా, తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి వివరాలను ఆయన కూలంకషంగా వివరించారు. అధికారుల పనితీరుతో జిల్లా అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలుస్తుందని చెప్పారు. జిల్లా అధికారులు సిబ్బంది మరింత ఉత్సాహంతో పని చేస్తూ, జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేయాలని అన్నారు. వేడుకల్లో భాగంగా పాఠశాలల విద్యార్థులచే దేశభక్తి ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ విప్, కలెక్టర్, ఎమ్మెల్యేలు కలిసి విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లాలోని పలు శాఖల ఉద్యోగులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందించారు. అవార్డులు ఉత్తమ పనితీరుకు నిదర్శనమని, అవార్డులు లభించిన అధికారులు మరింత ఉత్సాహంతో పనిచేయాలని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించి, వారిని అభినందించారు.



వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శనను తిలకించి, స్టాళ్లను వీక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోలీస్ పరేడ్ అందరిని ఆకట్టుకుంది. జిల్లా మహిళా సంఘాలకు మంజూరైనటువంటి 50 కోట్ల రూపాయల విలువైన చెక్కులను వారికి అందజేశారు.
స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఏఎస్పి సాయి కిరణ్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో ఘనంగా స్వాతం త్ర్య దినోత్సవ వేడుకలు

- **అన్ని కార్యాలయాల్లో ఎగిరిన మువ్వెన్నల జెండా**

**ధర్మపురి ఆగస్టు 15 (ఉదయం ప్రతినిధి):**
ధర్మపురి మండల వ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని ప్రభు త్వ ప్రైవేటు కార్యాలయాలు పాఠశాలల్లో మువ్వెన్నేల జెండా ఎగిరింది.స్థానిక నంది చౌరస్తా వద్ద అన్ని పాఠశాలల విద్యార్థు లు చేసిన నృత్యాలు సాంస్కృతిక కార్య క్రమాలు చూపరుల ను ఆకట్టుకున్నా యి.శనివారం ధర్మపురి మండల కేం ద్రంతో పాటు పలు గ్రామాల్లో స్వాతం త్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా గ్రంధా లయం చైర్మన్ సంఘనబట్ల. దినేష్ జెండా ఎగురవేశా రు.ఈ సందర్భంగా దినేష్ మాట్లాడు తూ తెలంగాణ రాష్ట్ర ప్రజలలం దరికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహా ను భావుల త్యాగాల ఫలితమే మన స్వాతంత్ర్య దినోత్సవం అని వారిని స్మరిం చు కున్నారు. మున్సిపాలిటీ కార్యాల యంలో చైర్మన్ వేముల. నాగలక్ష్మి, రక్షకభట నిలయం లో సీఐ రాం నరసింహా రెడ్డి,తహసిల్దార్ కార్యా లయంలో తహశీల్దార్ శ్రీనివాస్,ఎంపి డిఓ కార్యాల యంలో రవీందర్,ఎంఇ ఓ కార్యాలయంలోఎంఇఓ సీతా లక్ష్మీ,ధర్మపురి ఇంచార్జి జడ్జి నికిషా,ఆబ్కారి స్టేషన్లో ఇం ఛార్జి సిఐ ఎం.ఏ.జమిల్, వ్యవ సాయ శాఖ కార్యాల యంలో ఎంఏఓ రాజ్ కుమార్,అటవీ శాఖ కార్యాలయంలో రేంజ్ ఆఫీసర్ శ్రీనాథ్,ఐకెపి కార్యాల యంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉయ్యా ల. రజిత, పిఏసిఎస్ కార్యాలయంలో అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,తిమ్మా పూర్ పిఏసీఎస్ కార్యాలయం లో చైర్మన్ సత్తెన్న,మార్కెట్ కమిటీ కార్యాల యంలో చైర్మన్ చిలుముల.లావణ్య, అంబేత్కర్ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు సతీష్,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో సూపరిండెంట్ డా.రవి, విద్యుత్ శాఖ కార్యాల యంలో ఏఈ కే.సాయినాథ్, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి కొప్పుల.ఈశ్వర్, కాంగ్రెస్ ఆధ్వర్యంలో చిపిరిశెట్టి. రాజేష్, బీజేపీ ఆధ్వర్యంలో పట్టణఅధ్యక్షుడు గాజు. భాస్కర్,టిడిపిఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు ఉప్పల. రామకృష్ణయ్య, ధర్మ పురి ఐజెయు ప్రెస్ క్లబ్ ఆధ్వ ర్యంలో కోశాధికారి కర్నె.సంతో ష్, పట్టణ వర్తక సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడుఅక్కెనపెల్లి. రాజేందర్,ఆయా గ్రామాల్లో గ్రామ శాఖ కార్యదర్శి లు,పలు ప్రభు త్వ ప్రైవేటు పాఠశా లల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో ప్రధాన ఉపాధ్యాయులు జాతీయ జెండాను ఎగురవేశారు. స్థానిక నంది చౌరస్థా వద్ద ప్రభుత్వ ప్రైవేటు పాఠశా లలకు చెంది న విద్యార్థులు పలు రకాల వేషధారణ లో ఆకట్టుకొగా పలు సాంస్కృతిక,సినీ గీతాలకు నృ త్యాలు చేస్తూ అలరించారు.ఈ కార్య క్రమంలో అన్ని కార్యాలయాల అధికారులు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యా యులు,ఆయా కార్యా లయాల్లో ప్రజాప్ర తినిధులు, నాయకు లు పాల్గొన్నారు.



## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి

- **జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్**
- **నేటి స్వేచ్ఛ వెనుక ఎన్నో త్యాగాలు పోరాటాలు ఉన్నాయి...**
- **దేశాభివృద్ధిలో ప్రతి పౌరుడు బాధ్యతతో భాగస్వామి కావాలి...**
- **మూడు ప్రాంతాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**

జగిత్యాల ఆగస్టు 15 (ఉదయం ప్రతినిధి) స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ తెలిపారు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ జగిత్యాల జిల్లాలోని మూడు ప్రాంతాల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు తొలుత కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అనంతరం జెడ్పీ కార్యాలయంలో జిల్లా ప్రత్యేక అధికారి హోదాలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు అనంతరం కలెక్టరేట్ లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం



సాధించడం వెనుక ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల అపారమైన త్యాగాలు పోరాటాలు ఉన్నాయన్నారు ఎన్నో కష్టాలను అవరోధాలను ఎదుర్కొని దేశం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుల పోరాట ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ అని పేర్కొన్నారు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ స్మరించుకోవాలని వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు స్వాతంత్ర్యం కేవలం హక్కులను అనుభవించడమే కాకుండా బాధ్యతలను నిర్వర్తించాల్సిన బాధ్యతను కూడా మనపై ఉంచిందని తెలిపారు ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు మరింత బాధ్యతాయుతంగా నిబద్ధతతో సేవలందించాలని ప్రజా సంక్షేమం అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పని చేయాలని సూచించారు ప్రతి పౌరుడు తన విధులను నిజాయితీగా నిర్వర్తిస్తూ దేశ ప్రగతిలో భాగస్వామి కావాలని కోరారు దేశ ఐక్యత సమగ్రత ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ముందుకు సాగాలని స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు ఈ కార్యక్రమాల్లో జిల్లా అధికారులు ఉద్యోగులు ప్రజాప్రతినిధులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్

**కామారెడ్డి, ఆగస్టు 15 (ఉదయం ప్రతినిధి):-**
కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్పర్సన్ కాసర్ల గోదావరి స్వామి, కమిషనర్ పర్వతాలు, డీఈ హన్మంతరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్స్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**కరీంనగర్ ఆగస్టు 15 (ఉదయం ప్రతినిది):**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్ గార్డ్ వద్ద పోలీస్ కమిషనర్ శ్రీ గౌష్ ఆలం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అలాగే, కమిషనరేట్ పరిపాలనా కార్యాలయం (సిపిఓ) వద్ద అడిషనల్ డి.సి.పి. (పరిపాలన) పి.వెంకటరమణ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.జాతీయ పతాకాలను ఎగురవేసిన అనంతరం పోలీస్ కమిషనర్ మరియు అడిషనల్ డి.సి.పి. లు గౌరవ వందనాలు స్వీకరించారు. అనంతరం వేడుకల్లో పాల్గొన్న పోలీసు సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనరేట్‌లోని పోలీసు ఉన్నతాధికారులు, మినిస్టీరియల్ విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- **జాతీయ జెండాను ఆవిష్కరించిన అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య**

**వేములవాడ, ఆగస్టు 15 (ఉదయం ప్రతినిధి) :**
తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) హెచ్143 రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొలిపాక నర్సయ్య ఆధ్వర్యంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వేములవాడ ప్రెస్ క్లబ్ లో ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు,అనంతరం జర్నలిస్టులంతా కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు,దేశభక్తిని చాటుతూ 'జై జవాన్.. జై కిసాన్.. వందే మాతరం.. భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేశారు,అనంతరం మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, భగత్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు,ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన మహాత్మా గాంధీ, భగత్‌సింగ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తదితర మహనీయుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు,దేశం కోసం పోరాడి అమరులైన లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం ప్రతి భారతీయ పౌరుడి బాధ్యత అని అన్నారు. మహనీయులు కలలుగన్న సమసమాజ స్థాపన, సామాజిక న్యాయం, సమానత్వం, సోదరభావం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు,ప్రజాస్వామ్యంలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వాలు, ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణకు పాత్రికేయులు తమ వంతు బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ, ముఖ్య సలహాదారులు కొత్వాల్ శ్రీనివాస్, జితేందర్‌రావు, నేరెళ్ల కమలాకర్, ఉపాధ్యక్షులు సీహెచ్ దేవరాజు,వొరగంటి విష్ణు, కోశాధికారి పంపరి నాగరాజు, సీనియర్ పాత్రికేయులు జిల్లా రమేష్, కంటాల విజయ్, సెక్రటరీ ఫహద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జింక శ్రీధర్, దెబ్బేటి ప్రవీణ్, శ్రీరామోజు వేణు, సంటి రాజేందర్, కొడెం గంగాధర్, షబ్బీర్, పండుగ స్వామి, ఆసిమ్, లక్ష్మణ్, వేణు, బండి హరీష్, ఇమ్రాన్, సోహెల్ అజరొద్దీన్, శివ, బుస్స కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## స్వాతంత్ర సాధనలో అమరుల త్యాగాలు మరువలేనివి

**మంచిర్యాల జిల్లా ఆగస్టు 15 (ఉదయం ప్రతినిది):**
రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్, ప్రజా సంబంధాలు) హర్కర వేణుగోపాల్ రావుభారతదేశ స్వాతంత్ర సాధనలో అమరుల త్యాగాలు మరువలేనివని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్ జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య,

తెలంగాణ గీతాలాపనలో పాల్గొని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి సందేశాన్ని పి.ఎం.ఎఫ్.ఎం.ఈ. పథకంలో 18 మంది లబ్ధిదారులకు 46 లక్షల 72 వేల 346 రూపాయల చెక్కును అందజేశారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. వేడుకలకు హాజరైన అధికారులు, ప్రముఖులు, మీడియా, ప్రజల కొరకు గ్యాలరీ, త్రాగునీరు, పారిశుద్ధ్యం ఇతర కార్యక్రమాల ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించారు.

## పండుగ వాతావరణంలో అట్టహాసంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- **డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులతో మరింత పారదర్శకత, జవాబుదారీతనం**
- **ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడి**
- **పాల్గొన్న ఎమ్మెల్యేలు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు**

**నిజామాబాద్, ఆగస్టు 15 :**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిజామాబాద్ లో శనివారం పండుగ వాతావరణంలో అట్టహాసంగా జరిగింది. నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు పి .సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ తారిఖ్ అన్సారీ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తదితరులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి, జయ జయహే తెలంగాణ గేయాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఆర్థిక స్థోమత కలిగిన వారి తరహాలోనే నిరుపేద కుటుంబాలు కూడా మూడు పూటల అన్నం తినాలనే ఉదాత్తమైన ఆశయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు కలిగిన ప్రతి పేద కుటుంబానికి సన్న బియ్యం పంపిణీ చేస్తోందని అన్నారు. ఇదివరకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా గత ప్రభుత్వం అందించిన దొడ్డు బియ్యం తినడానికి ఉపయోగపడక 70 శాతం అమ్ముకునే వారని, సబ్సిడీ బియ్యం బ్లాక్ మార్కెట్ కు తరలిపోయేదని గుర్తు చేశారు. పేదల కోసం ఉద్దేశించిన రేషన్ సన్న బియ్యం ఒక్క గింజ కూడా పక్కదారి పట్టకుండా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతుల సంక్షేమానికి రైతు భరోసా, మహిళలకు అండగా కళ్యాణ లక్ష్మి, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పేదలకు సన్నబియ్యం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో కొత్త రేషన్ కార్డుల జారీపై తగిన దృష్టి పెట్టలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను చేపట్టిందని గుర్తు చేశారు. డిజిటల్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టడం ద్వారా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాపాలనలో మరో కీలక ముందడుగు వేసిందన్నారు. సాంకేతికత ఆధారిత పాలన ద్వారా ప్రభుత్వ సేవలను మరింత సరళంగా, పారదర్శకంగా ప్రజలకు అందాలన్నదే ప్రభుత్వ సంకల్పమని, 2047 నాటికి రైజింగ్ తెలంగాణగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే భూపతి రెడ్డి అన్నారు.
నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డిలు మాట్లాడుతూ, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన కుటుంబాలకు పూర్తి స్థాయిలో ప్రయోజనం దక్కేలా చూడాలన్నారు. సన్న బియ్యం పంపిణీలో ఎక్కడ కూడా అక్రమాలకు తావులేకుండా జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. గత సీజన్ లో ధాన్యం విక్రయాలకు రైతులు ఒకింత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కేశ వేణు, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, ట్రైనీ ఆర్డీఓ సందీప్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, మున్సిపల్ చైర్ పర్సన్లు, కార్పొరేటర్లు కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచ్ లు, రేషన్ డీలర్లు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- ఎగిరింది మువ్వన్నెల జెండా.. ఆకాశం నిండా!
- ఎందరో వీరుల త్యాగఫలమే నేటి స్వాతంత్ర్యం

**సంగారెడ్డి వుదయం**

సంగారెడ్డి పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం (ఆగస్టు 15) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ దేశభక్తి నినాదాలు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో సందడిగా మారింది.7వ తరగతి విద్యార్థిని లౌక్య, 6వ తరగతి విద్యార్థిని సాన్విక స్వాగత నృత్యగీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ సొలొమోన్ రెడ్డి, డైరెక్టర్ ఈ. విజయ్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఈ. అరుణారెడ్డి, అడ్మినిస్ట్రేషన్ హెడ్ ఈ. జయబాలరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్ లక్కిశెట్టి తదితరులు గాంధీజీ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు వేశారు.అనంతరం డాక్టర్ సొలొమోన్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు సామూహికంగా జాతీయ గీతాన్ని ఆలపించారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ ఈ. విజయ్ రెడ్డి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ భాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వంటి ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమే మన స్వాతంత్ర్యమని అన్నారు. 2047 నాటికి భారత్‌ను వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తి, దైవభక్తిని అలవర్చుకోవాలని సూచించారు.అనంతరం ఎన్‌సీసీ అధికారి గొడుగు వెంకటేశం ఆధ్వర్యంలో ఎన్‌సీసీ, పాఠశాల విద్యార్థులతో కవాతు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, స్కిట్లు, డంబుల్స్, లేజియమ్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన, ఉపన్యాసం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసింది.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.




## వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

**నాగర్ కర్నూల్ రూరల్, ఆగస్టు 15 (వుదయం ప్రతినిధి)**

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూచకుళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ళ రాజేష్‌రెడ్డి వికలాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. వికలాంగుల అవసరాలను గుర్తించి వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ట్రై సైకిళ్లను అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జక్కా రాజ్ కుమార్ రెడ్డి , వంకేశ్వరం నిరంజన్, మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజాసేవలో తిరుగులేని ముద్ర: ఉత్తమ సర్పంచ్‌గా డి. నాగేష్ నాయుడు!

**గద్వాల ఆగస్టు 15 (వుదయం కరస్పాండెంట్)**

గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా, ప్రజాసేవే ఊపిరిగా పనిచేస్తున్న జోగులాంబ గద్వాల జిల్లా, గద్వాల మండలం జిల్లెడబండ గ్రామపంచాయతీకి అత్యంత అరుదైన పురస్కారం లభించింది. ఏళ్ల తరబడి పీడిస్తున్న సమస్యలపై విరుచుకుపడి, గ్రామ రూపురేఖలను మార్చేస్తూ పారదర్శక పాలనకు చిరునామాగా నిలిచిన జిల్లెడబండ సర్పంచ్ డి. నాగేష్ నాయుడును జిల్లా స్థాయి ఉత్తమ సర్పంచ్ అవార్డు వరించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన అధికారిక వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ (ఐఏఎస్), జిల్లా ఎస్పీ శ్రీనివాస్ ల చేతుల మీదుగా నాగేష్‌నాయుడు ఈ ప్రశంసా పత్రాన్ని, పురస్కారాన్ని అత్యంత వైభవంగా అందుకున్నారు. మాటలకంటే చేతలే మిన్న! రాజకీయ లబ్ధికి దూరంగా, ఊరి ప్రగతియే ధ్యేయంగా పనిచేయడం నాగేష్ నాయుడి నైజం. గ్రామంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల సమస్యలను పట్టుదలతో పరిష్కరించడం, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నిబద్ధతతో పనిచేయడాన్ని గుర్తించిన జిల్లా యంత్రాంగం ఈ పురస్కారానికి ఆయనను ఎంపిక చేసింది. అధికారుల మెప్పుతో పాటు గ్రామస్థుల మనసులను గెలుచుకుంటూ జిల్లెడబండను అభివృద్ధి పథంలో పరుగులు తీయిస్తున్న ఆయన అంకితభావానికి ఈ అవార్డు సముచిత గౌరవంగా నిలిచింది.

విమర్శకుల నోళ్లు మూయించేలా అభివృద్ధి: నాగేష్ నాయుడు గ్రామ ప్రజలు నాపై ఉంచిన అపారమైన నమ్మకమే ఈ విజయానికి అసలైన బలం. ఈ పురస్కారం నాపై మరింత బాధ్యతను పెంచింది. రాజకీయాలకు అతీతంగా, ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించడమే నా లక్ష్యం. విమర్శలను పట్టించుకోకుండా జిల్లెడబండను జిల్లాలోనే తిరుగులేని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే వరకు విశ్రమించను. — డి. నాగేష్ నాయుడు, సర్పంచ్ నాయకుడికి లభించిన ఈ ఘనమైన గుర్తింపుతో జిల్లెడబండ గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామ పురప్రముఖులు, యువత, ప్రజలు సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందనల వర్షం కురిపించారు.



## జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా స్వతంత్ర వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్

**నారాయణపేట ఆగస్టు15 (వుదయం ప్రతినిధి)**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరిం చుకొని నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌లో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రియాంక జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనా న్ని స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని దేశాభి వృద్ధి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు.



ప్రభుత్వ అధికారులు, సిబ్బందిబాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధిస్తూ, భవిష్యత్తులో దేశానికి మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.అనంతరం విద్యార్థులకు కలెక్టర్ నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను, డీఆర్‌ఓ రాజేశ్వరి, డిప్యూటీ కలెక్టర్ ఫణి కుమార్, ఏవో అనిల్ కుమార్, జిల్లా పౌర సంబంధాల అధికారి రషీద్, కలెక్టరేట్ కాంప్లెక్స్ పరిధిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**క్యాంపు కార్యాలయం, జెడ్పీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ...**

అంతకుముందు జిల్లా కలెక్టర్ ప్రియాంక తన క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలోనూ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## ఇకపై అవినీతి లేకుండా..పారదర్శకంగా రేషన్ పంపిణీ

**మహబూబ్ నగర్ ఆగస్టు 15 (వుదయం ప్రతినిధి)**

ఇక పై అవినీతి లేకుండా

**పారదర్శకంగా రేషన్ పంపిణీ**

స్మార్ట్ కార్డులతో లబ్ధిదారులకు తప్పనున్న ఇబ్బందులుమార్పులు చేర్పులు మరింత సులభం ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమం ఆపలేదు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని కాంచనంగా ప్రారంభించిన రాష్ట్ర ఎక్సైజ్,పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, కలెక్టర్ ఖుష్బూ గుప్తారాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, మహబూబ్ నగర్ కలెక్టర్ కుష్బూ గుప్తా తో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన అందజేశారు.**స్మార్ట్ కార్డుతో వివరాల పరిశీలన సులభం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కోటికి పైగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరుగుతోందన్నారు. దీనివల్ల లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుందని, రేషన్ డీలర్లకు కూడా వివరాలను స్పష్టంగా తెలియజేయడం సులభమవుతుందని తెలిపారు.లబ్ధిదారులు స్మార్ట్ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, మేయర్ జి. మమత, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ మూడావత్ బాలకోటి, డి. ఎస్.సి.ఓ గంప శ్రీనివాస్, జిల్లా అధికారులు, స్మార్ట్ రేషన్ కార్డు లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు



## మహనీయుల త్యాగాల స్ఫూర్తితో

- అంకిత భావంతో అధికారులు విధులు నిర్వర్తించాలి..
- జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా;

**వికారాబాద్ , ఆగస్ట్ (15):**

ఎందరో మహనీయుల త్యాగాల ఫలితం వల్ల దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని.. అట్టి మహనీయుల త్యాగాల స్ఫూర్తితో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సూచించారు.శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం (DPO)లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, జాతీయ జెండాను ఎగురవేసి, పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి హృదయపూర్వక స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం అపారమైన త్యాగాలు చేసి, తమ ప్రాణాలను సైతం అర్పించిన స్వాతంత్ర్య సమరయోధులకు ఆమె ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, “ఈ రోజు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితమని ,వారి త్యాగాల స్ఫూర్తితో ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని ఎస్పీ తెలిపారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాల కట్టడి, రోడ్డు భద్రత మెరుగుదలతో పాటు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.ప్రజలకు పోలీస్ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎస్పీ ఆదేశించారు.ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది క్రమశిక్షణ, నిజాయితీ, జవాబుదారీతనం మరియు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు.

**-:సేవా పతకాల ప్రదానం:-**

అనంతరం జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, విధుల నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర పోలీస్ సేవా పతకాలను ప్రదానం చేసి, వారి విజయాన్ని అభినందించారు. సేవా పతకాలు అందుకున్న వారిలో M. Chander - ARSI 2340, R. Venkatayya - ARHC 6693, N. Ramulu - ARHC 3489, M.D. Hafeez - ARPC 2627 ఉన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, AR DSP వీరేష్, DSB ఇన్‌స్పెక్టర్ నాగార్జున, RI నాగరాజు, ఎస్ఐలు, మినిస్టీరియల్ సిబ్బంది, పోలీస్ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## వనపర్తిలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**వనపర్తి ఆగస్టు 15 (వుదయం ప్రతినిధి)**

- ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం
- ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులు మెరుగైన ఆదాయాన్ని సాధించాలి

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రసంగించిన ముఖ్య అతిథి డా. పట్నం మహేందర్ రెడ్డి

80వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వనపర్తి జిల్లాలోని ఐ.డి.ఓ.సి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేడుకలకు తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్, శాసన మండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ముఖ్య అతిథిగా హాజరైన చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి స్వాగతం పలికారు. ముఖ్యఅతిథి పోలీస్ శాఖ ద్వారా ఇచ్చిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన లక్ష్యాల పై ప్రగతి నివేదికను చదివి వినిపించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, పాత్రికేయులు, ప్రజలకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మెప్మా 45 స్వయం సహాయక సంఘాలకు రూ. 3.75 కోట్ల విలువైన బ్యాంకు లింకేజీ రుణాల చెక్కును అందజేశారు.

**ముఖ్య అతిథి ప్రసంగం:**

అహింసను ఆయుధంగా చేసుకుని మహాత్మా గాంధీ సారథ్యంలో సాగిన భారత స్వాతంత్ర్య పోరాటం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో పేదరికం, అసమానతలు, అంటరానితనం వంటి సామాజిక సమస్యలపై పోరాటానికి పునాది పడిందన్నారు. ప్రజాస్వామ్య పాలనకు బలమైన పునాదులు వేసుకుని దేశం నేడు ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా అభివృద్ధి చెందుతోందన్నారు.



మన రాజ్యాంగంలో పొందుపర్చినట్లు మన తెలంగాణ ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం మరియు సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో 6 గ్యారెంటీలను ప్రకటించడం జరిగిందన్నారు.

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం సృష్టిస్తున్న సంపదను సమానత్వం, సామాజిక న్యాయం ప్రాతిపదికన ప్రజలందరికీ అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో ఆరు గ్యారంటీలతో పాటు వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.

**మహిళా శక్తి పథకంతో మహిళలకు ప్రయోజనం**

మహిళలను ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా వనపర్తి జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 3 కోట్ల 76 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేసి, రూ.156 కోట్ల 76 లక్షల మేర లబ్ధి పొందారని వివరించారు.ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళా సంఘాల ద్వారా 14 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా మహిళా సమాఖ్యలకు నెలకు రూ. 19,486 చొప్పున మొత్తం రూ. 2.72 లక్షల ఆదాయం సమకూరుతోందన్నారు.

202627 విద్యా సంవత్సరానికి 35,660 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 2 జతల యూనిఫామ్ లను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 19,865 యూనిఫామ్ లను కుట్టించి 12,931 మంది విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

**రాజీవ్ ఆరోగ్యశ్రీ:**

పేదలకు మెరుగైన వైద్యసేవ, వైద్య సదుపాయాల కల్పన అందించే ఉద్దేశంతో "రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని” రూ.10 లక్షల వరకు ఉచితవైద్యం పొందేలా పేదలకు అందుబాటులోకి తేవడం జరిగిందని, జనవరి 1, 2026 నుండి ఈ పథకం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 5,847 మందికి 18 కోట్ల 97 లక్షల రూపాయలు ఖర్చు చేసి ఉచిత వైద్య చికిత్సలు అందించడం జరిగిందన్నారు.

**రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం**

రైతుల సంక్షేమంలో భాగంగా రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేయడం ద్వారా వనపర్తి జిల్లాలో 60,545 మంది రైతులకు రూ.480.91 కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. రైతు భీమా పథకం ద్వారా 202526 సంవత్సరంలో జిల్లాలో 641 మంది రైతులకు రూ.32.05 కోట్లను వారి కుటుంబాలకు అందించామన్నారు. రైతు భరోసా పథకం కింద 2026 వానాకాలం సీజన్‌లో 1,82,768 మంది రైతులకు ఎకరానికి రూ.6 వేల చొప్పున రూ.212.32 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

**ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం**

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. మినుములు, కంది, జొన్న, ఆముదం, కూరగాయలు తదితర ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులకు సమావేశాల ద్వారా, కరపత్రాల ద్వారా, పత్రికా ప్రకటనల ద్వారా, కృత్రిమ మేధస్సు (AI) ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

"చేయూత" పథకం ద్వారా వికలాంగులు, వృద్ధులు, వితంతువులు మరియు ఇతర అర్హులైన పేదలకు ప్రతి నెలా పెన్షన్ ఇవ్వడం జరుగుతుంది. వనపర్తి జిల్లాలో 70,863 మందికి నెలకు రూ.17 కోట్ల 43 లక్షలు పెన్షన్ కోసం ఇవ్వడం జరుగుతుందన్నారు.

**విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం**

వనపర్తి జిల్లాలో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరై పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వసతి గృహాలు, పాఠశాల బ్లాకుల నిర్మాణానికి రూ.13.50 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు.

బాల్య సంరక్షణ మరియు అభ్యాసానికి బలమైన పునాది కల్పించే ఉద్దేశంతో తొలిసారిగా 71 ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

రహదారులు మరియు భవనాలు:

జూరాల వద్ద క్రిష్ణ నదిపై వంతెన నిర్మాణం కొరకు సుమారు రూ.121 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో పరిపాలనా అనుమతి పొంది పనులు పురోగతిలో ఉన్నాయన్నారు.

**భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి**

రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు భూ భారతి చట్టాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 12,501 దరఖాస్తులు స్వీకరించి, వాటిలో 11,303 దరఖాస్తులను పరిష్కరించినట్లు వెల్లడించారు.



**ప్రజావాణి :**

పారదర్శకత, జవాబుదారితనంతో ప్రజలకు సేవలు అందించడంలో భాగంగా ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా స్థాయి నుండి రెవిన్యూ డివిజన్ స్థాయికి మరియు మండల స్థాయికి విస్తరించడం జరిగిందన్నారు. దీని ద్వారా ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రాసెస్ చేసి ఫిర్యాదులను ప్రజావాణి పోర్టల్ ద్వారా పరిష్కరించడం జరుగుతుందన్నారు.

**ప్రజాపాలన, శాంతిభద్రతలకు ప్రాధాన్యం**

ప్రజల ఫిర్యాదులను మండల స్థాయిలో ప్రతి సోమవారం స్వీకరించి పరిష్కరించేలా ప్రజాపాలన కార్యక్రమాన్ని విస్తరించినట్లు తెలిపారు.శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, జిల్లాలో 1,785 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.బాల్య వివాహాల, రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. లోక్ అదాలత్ ద్వారా జిల్లాలో 3,566కు పైగా కేసులు పరిష్కరించి ప్రజలకు త్వరిత న్యాయం అందించినట్లు తెలిపారు. వనపర్తి జిల్లా నాగవరం గ్రామం వద్ద జిల్లా కోర్టు సముదాయం నిర్మాణానికి రూ.81 కోట్లు మంజూరై పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు భీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని

- స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డులు, కొత్త పించన్లు - మంత్రి పొన్నం ప్రభాకర్
- సిద్దిపేట వైశ్య కన్వెన్షన్ భవనంలో ఘనంగా పంపిణీ కార్యక్రమం
- ప్రజా పాలనలో సంక్షేమ విప్లవం: జిల్లా కలెక్టర్ కే. హైమావతి

**సిద్దిపేట, ఆగస్టు 15 (వుదయం బ్యూరో)**




రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట పట్టణంలోని శనివారం వైశ్య కన్వెన్షన్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంత్రి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించగా, జిల్లా స్థాయిలో ఇక్కడ పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామాలు, మండలాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను పండగ వాతావరణంలో పూర్తి చేయాలని సర్పంచులు, అధికారులను ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ గత పదేళ్లుగా కార్డులు లేక ఇబ్బంది పడ్డ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రజా పాలన ప్రభుత్వం రాగానే 16 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసిందని, ఇది 365 రోజులు కొనసాగే నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1.06 కోట్ల రేషన్ కార్డులు, 3.60 కోట్ల యూనిట్లు ఉన్నాయని, రేషన్ కార్డులతో పాటు ప్రతి ఒక్కరికీ 6 కిలోల చొప్పున నాణ్యమైన సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. ఇబ్బందులు ఉన్నప్పటికీ పాత పథకాలు కొనసాగిస్తూనే కొత్తవి అమలు చేస్తున్నామన్నారు. ఈ రోజు నుంచే రాష్ట్రంలో వికలాంగులు, వితంతువులకు 2.5 లక్షల కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమైందని వెల్లడించారు. ప్రభుత్వం ఇప్పటివరకు 70 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేసిందని, తాజాగా ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చామని, మరిన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు రాబోతున్నాయని ప్రకటించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నందున రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని కొండగట్టు గిరిప్రదక్షిణ, కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో నక్షత్రమాల, బోనాల ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. అనంతరం

జిల్లా కలెక్టర్ కే. హైమావతి మాట్లాడుతూ.. గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఫ్రీ బస్, సబ్సిడీ గ్యాస్ వంటి 6 గ్యారంటీ పథకాలతో పాటు రేషన్ కార్డులు, ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. 99 రోజుల కార్యాచరణ ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేశామని, పారదర్శకత కోసం స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్, జిల్లా లైబ్రరీ చైర్మన్ ధరిపల్లి చంద్రం, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య, ఆర్‌డీఓలు, ఆర్‌టీఏ మెంబర్ సూర్య వర్మ, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఆత్మ కమిటీ చైర్మన్లు, వివిధ గ్రామాల సర్పంచులు, రేషన్ డీలర్లు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగన్వాడీ సెంటర్ కు కుర్చీలు, ఆట వస్తువుల అందజేత

**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండల కేంద్రంలోని 4వ అంగన్వాడీ కేంద్రానికి ఆగస్టు 15 సందర్భంగా వ్యాపారి వెల్దుర్తి నగేష్ గౌడ్ చిన్నారుల సౌకర్యార్థం 20 కుర్చీలు, ఆటవస్తులను బహూకరించారు.అలాగే జడ్ చెరువు తాండ సర్పంచ్ బాబు నాయక్, అంగన్వాడి చిన్నారులకు కుర్చీలను అందజేశారు. కుర్చీలను చిన్నారుల అవసరాలను గుర్తించి కుర్చీలు, ఆటవస్తులు అందించిన బాబు నాయక్, నగేష్ గౌడ్, లను అంగన్వాడీ కేంద్రం సభ్యులు శాలువాతో సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ దుర్గేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



## తాండూర్ సబ్ డివిజన్‌లో
# వెలిగిన 'ఉత్తమ' ప్రతిభ

- **కరణ్‌కోట్ పీఎస్ క్రైమ్ రైటర్ ఖాజా అలీమోద్దీన్ కు విశిష్ట పురస్కారం!**



**తాండూర్ ఆగస్టు 15**
**వుదయం ప్రతినిధి**

తాండూర్ సబ్ డివిజన్ పరిధిలోని కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్ క్రైమ్ రైటర్‌గా విధినిర్వహణలో తనదైన ముద్ర వేసిన ఖాజా అలీమోద్దీన్ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. పోలీస్ శాఖలో తన నిబద్ధత, నిష్పాక్షికత, అంకితభావంతో పనిచేస్తున్న ఆయన, వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా చేతుల మీదుగా "ఉత్తమ క్రైమ్ రైటర్" అవార్డును అందుకున్నారు.

**నిజాయితీకి, కష్టపడే తత్వానికి దక్కిన గుర్తింపు!**

కేసుల నమోదులో ఖచ్చితత్వం, రికార్డుల నిర్వహణలో పారదర్శకత, ఉన్నతాధికారులు అప్పగించిన బాధ్యతలను సకాలంలో సమర్థవంతంగా పూర్తి చేయడంలో ఖాజా అలీమోద్దీన్ ఎల్లప్పుడూ ముందుంటారు. ఆయన చూపుతున్న అపూర్వమైన నిజాయితీ, వృత్తి పట్ల ఉన్న నిబద్ధతే శుక్రవారం జిల్లా స్థాయిలో ఆయనను ఉత్తమ విజేతగా నిలిపింది.

"బాధ్యతాయుతమైన విధి నిర్వహణే పోలీసు వ్యవస్థకు కొండంత బలం. ఖాజా అలీమోద్దీన్ వంటి నిజాయితీ గల సిబ్బంది శాఖకే గర్వకారణం."

ప్రజల మెప్పు... అధికారుల ప్రశంసలు! కరణ్‌కోట్ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు తగిన న్యాయం జరిగేలా రికార్డులను పక్కాగా రూపొందించడంలోనూ, నేరాల పరిశోధనలో అధికారులకు సకాలంలో సరైన సమాచారం అందించడంలోనూ అలీమోద్దీన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ విశిష్ట అవార్డు దక్కడం పట్ల తాండూర్ సబ్ డివిజన్ పరిధిలోని తోటి పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు స్థానిక ప్రజలు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ పురస్కారం ఆయన బాధ్యతను మరింత పెంచడమే కాకుండా, తోటి సిబ్బందికి కూడా ఎంతో స్ఫూర్తినిస్తుదనడంలో సందేహం లేదు!

అభినందనలు ఖాజా అలీమోద్దీన్ ! మీ సేవలు ఇలాగే సమాజానికి మరింత ఉపయోగపడాలని ఆశిస్తున్నాం.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**ఊర్కొండ న్యూస్ 15**
**వుదయం ప్రతినిధి**

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఊర్కొండ వ్యవసాయ శాఖ కార్యాలయం రైతు వేదిక. తాసిల్దార్ కార్యాలయం. ఎంపీడీవో కార్యాలయం. ఇతర ప్రభుత్వ కార్యాలయాలు లో జాతీయ జెండా ను ఎగురేసి మరియు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల సంబంధించిన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా మండల వివిధ పార్టీలకు సంబంధించిన నాయకులు. సర్పంచ్.ఉప సర్పంచ్.వార్డ్ మెంబర్స్. ప్రజలు. యువకులు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# జగ్గారెడ్డి ప్రజల్లో ఉండే నాయకుడు



- **ఆయనకు మొదటి మార్కులు: సీఎం రేవంత్ రెడ్డి**
- **రాహుల్ గాంధీ రాముడైతే.. జగ్గారెడ్డి హనుమంతుడు**
- **జగ్గన్న ఎక్కడ పోటీ చేయాలో రాహుల్ గాంధీనే నిర్ణయిస్తారు**
- **రూ.100 కోట్లు ఇచ్చినా ఇలాంటి ప్రజా నాయకుడు దొరకడు**
- **'నేను పోటీ చేయను' అని మరోసారి అనొద్దు జగ్గన్న**



**సంగారెడ్డి కరెస్పాండెంట్ వుదయం:**

: సంగారెడ్డి రాజకీయాల్లో కీలక నేతగా ఉన్న మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికరమైన, కీలక వ్యాఖ్యలు చేశారు. జగ్గారెడ్డిని ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకుడిగా అభివర్ణిస్తూ ఆయనపై ప్రశంసల వర్షం కురిపించారు. తనకంటే ఎక్కువగా ప్రజలకు అందుబాటులో ఉండేది జగ్గారెడ్డేనని సీఎం పేర్కొన్నారు.

రాహుల్ గాంధీని రాముడితో పోల్చిన సీఎం రేవంత్ రెడ్డి.. జగ్గారెడ్డిని ఆయన భక్తుడైన హనుమంతుడితో పోల్చారు. "రాహుల్ గాంధీ రాముడు అయితే.. రాముడు ఏం ఆదేశిస్తే.. హనుమంతుడు దాన్ని పాటించాలి" అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.

**ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు**

జగ్గారెడ్డి లాంటి ప్రజా నాయకులు రాజకీయాల్లో అవసరమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడంలో, ప్రజలకు అందుబాటులో ఉండటంలో జగ్గారెడ్డి ముందుంటారని ప్రశంసించారు. "నా కంటే ఎక్కువ ప్రజలను అందుబాటులో ఉండేది జగ్గారెడ్డే.. ఆయనకే మొదటి మార్కులు" అని సీఎం పేర్కొన్నారు.

**"జగ్గారెడ్డిని ఓడించుకున్న దురదృష్టవంతులు మీరే"**


జగ్గారెడ్డిని రాజకీయంగా ఓడించిన వారిపై కూడా సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "జగ్గారెడ్డిని ఓడించుకున్న దురదృష్టవంతులు మీరే.. జగ్గారెడ్డి లాంటి నాయకుడు ఉన్నందుకు అదృష్టవంతులు కూడా మీరే" అంటూ సంగారెడ్డి ప్రజలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

**"అక్కకు ఇచ్చేది అక్కకు.. జగ్గన్నకు ఇచ్చేది జగ్గన్నకే"**

జగ్గారెడ్డితో తనకున్న అనుబంధాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. "అక్కకు ఇచ్చేది అక్కకు ఇస్తా.. జగ్గన్నకు ఇచ్చేది జగ్గన్నకే ఇస్తా" అంటూ తనదైన శైలిలో వ్యాఖ్యానించారు. మొత్తంగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. జగ్గారెడ్డి రాజకీయ భవిష్యత్‌పై రాహుల్ గాంధీ నిర్ణయం కీలకమని సీఎం చెప్పడంతో.. వచ్చే ఎన్నికల్లో జగ్గారెడ్డి పోటీ చేసే స్థానం విషయంలో ఆసక్తి మరింత పెరిగింది.

## కరవు రావాలని
# అఘోర పూజలు చేస్తున్నారు

- **సీఎం రేవంత్ రెడ్డి**



**సంగారెడ్డి, ఆగస్టు 15:వు దయం:**

తెలంగాణలో కరవు రావాలని బీఆర్ఎస్ నాయకులు అఘోర పూజలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. తమపై చేతబడి చేసినా ఎలాంటి ప్రభావం ఉండదని, అయితే ప్రజలకు కీడు జరగాలని కోరుకుంటూ అఘోర పూజలు చేయడం సరికాదని అన్నారు. అధికారం కోసం క్షుద్ర పూజలకు పాల్పడటం తగదని సీఎం పేర్కొన్నారు. శివమొగ్గ గుడిలో నిర్వహించిన పూజల వివరాలను ఎందుకు బహిర్గతం చేయలేదని ప్రశ్నించారు. ఎన్నినో ప్రభావంతో పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ, దైవ సంకల్పంతో ప్రజలకు అవసరమైన సేవలను ప్రభుత్వం అందిస్తోందని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని స్పష్టం చేశారు.

# సోనీ పిక్చర్స్ కొత్త ఛానల్ ఆవిష్కరణ



**వుదయం, హైదరాబాద్**

తమిళ సంస్కృతిని సెలబ్రేట్ చేస్తూ ప్రపంచ స్థాయి ప్రేక్షకుల కోసం రూపొందించిన ప్రీమియం తమిళ ఎంటర్‌టైన్‌మెంట్ బ్రాండ్ 'సోనీ విళా'ను ఆవిష్కరించిన సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియాతమిళ సంస్కృతికి ప్రతీకగా నిలిచే 'తమిళ్ తాయ్ వాళ్తు'ను ప్రదర్శిస్తూ 'సోనీ విళా' ఆవిష్కరణ. ప్రీమియం స్థాయిలో రూపొందిన భావోద్వేగభరితమైన తమిళ కథలను వివిధ స్క్రీన్స్, కుటుంబాలు, భౌగోళిక ప్రాంతాలకు చేరువ చేసేలా రూపొందిన కొత్త బ్రాండ్. సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా (SPNI) తాజాగా తన కొత్త తమిళ జనరల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఛానల్‌కు 'సోనీ విళా' అనే పేరు, బ్రాండ్ ఐడెంటిటీని ఆవిష్కరించింది. అక్టోబర్ 2026లో ఈ ఛానల్ లాంచ్ కానుంది. తమిళ ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలోకి అడుగుపెడుతున్న SPNI.. తమిళ సంస్కృతి, భావోద్వేగాలు, భాష, స్థానిక జీవన విధానాలకు బలమైన అనుబంధంతో కూడిన ప్రీమియం కంటెంట్‌ను అందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. టెలివిజన్, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌పై ఒరిజినల్ ఫిక్షన్, గ్లోబల్ రియాలిటీ ఫార్మేట్స్, సినిమాలు, భారీ స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్ ప్రోగ్రామ్స్‌ను 'సోనీ విళా' అందించనుంది. తమిళ కుటుంబాలకు తమదైన అనుభూతిని కలిగించేలా, అదే సమయంలో విస్తృతమైన ప్రేక్షకులను ఆకట్టుకునే స్థాయిలో ఈ ఛానల్ కంటెంట్ రూపొందనుంది.

ఆగస్ట్ 15..ఇండిపెండెన్స్ డే సందర్భంగా చిన్నారులు ఆలపించిన 'తమిళ్ తాయ్ వాళ్తు'ను ప్రత్యేకంగా ప్రదర్శిస్తూ 'సోనీ విళా' పేరు, లోగోను ఆవిష్కరించారు. తమిళనాడులో 'తమిళ్ తాయ్ వాళ్తు'కు ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా జరిగే ముఖ్యమైన కార్యక్రమాల ప్రారంభంలో ఈ గీతాన్ని ఆలపించడం ఆనవాయితీగా వస్తోంది. తమిళులు గర్వంగా అన్ని దిశల్లో పరిమళంలా వ్యాపించాలనే ఈ గీతం భావన 'సోనీ విళా' బ్రాండ్ ఆలోచనకు స్ఫూర్తిగా నిలిచింది. తమిళనాడు నేల నుంచి పుట్టే కథలు, అక్కడి ప్రజల ఆప్యాయత, జ్ఞాపకాలు, ఆశలు, సాంస్కృతిక ఆత్మ విశ్వాసాన్ని ప్రతిబింబిస్తూ.. అత్యున్నత నిర్మాణ విలువలు, లోతైన భావోద్వేగాలతో రూపొందించి ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు చేరువ చేయాలనే లక్ష్యంతో 'సోనీ విళా'ను రూపొందించారు.

'విళా' అంటే తమిళంలో వేడుక లేదా పండుగ అని అర్థం. ఈ పేరు ఛానల్ స్పిరిట్‌ను ప్రతిబింబిస్తుంది. తమిళ కథలు, ప్రతిభ, సంగీతం, కుటుంబం, ఆశయాలు, పాపులర్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను సెలబ్రేట్ చేస్తూ.. ప్రేక్షకులతో భావోద్వేగపరంగా కనెక్ట్ అయ్యేలా 'సోనీ విళా'ను రూపొందించారు. 'సోనీ విళా' లోగోలో ఎల్లో, ఎలక్ట్రిక్ బ్లూ రంగులను ఉపయోగించారు. తమిళనాడులో వేడుకలకు అనుబంధంగా ఉండే పసుపు, బంతిపూల వంటి రంగుల నుంచి ఎల్లో రంగును తీసుకున్నారు. ఎలక్ట్రిక్ బ్లూ బ్రాండ్ ఐడెంటిటీకి సరికొత్త, కాంటెంపరరీ, ప్రీమియం లుక్‌ను తీసుకొచ్చింది. తమిళ సంస్కృతితో బలమైన అనుబంధాన్ని కలిగి ఉండటంతో పాటు.. భావోద్వేగాలకు దగ్గరగా, ప్రపంచ స్థాయి ప్రేక్షకులను ఆకట్టుకునేలా 'సోనీ విళా' బ్రాండ్‌ను తీర్చిదిద్దినట్లు ఇది తెలియజేస్తుంది. ఈ సందర్భంగా..

సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా సౌత్ రీజినల్ చీఫ్ కంటెంట్ ఆఫీసర్ రాజారామన్ సుందరం మాట్లాడుతూ.. "సోనీ విళా ద్వారా తమిళ ఎంటర్‌టైన్‌మెంట్‌లోకి ఎంతో ఆప్యాయతతో అడుగుపెడుతున్నాం. తమిళ మార్కెట్‌కు ఎంతో గొప్ప క్రియేటివ్ లెగసీ ఉంది. భావోద్వేగాలు, నిజాయతీ, సాంస్కృతిక గర్వంతో కూడిన కథలను తమిళ ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తూనే ఉన్నారు. అందుకే ఎంతో వినయంతో, గౌరవంతో, ఈ రంగానికి ఏదో ఒక అర్థవంతమైన కొత్తదనాన్ని జోడించాలనే నిజాయతీతో ఈ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నాం.

# మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖాతాలో అరుదైన రికార్డు

- **నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం.. నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలు**
- **20 సార్లు జాతీయ పతాకావిష్కరణ.. ఆగస్టు 15న 21వసారి అవకాశం**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆగస్టు 15**
**(వుదయం ప్రతినిధి)**

తెలుగు రాష్ట్రాల రాజకీయ చరిత్రలో అరుదైన ఘట్టానికి తెలంగాణ వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వేదిక కానున్నారు. సుమారు నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో కొనసాగుతున్న తుమ్మల.. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు, కేసీఆర్, రేవంత్‌రెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేశారు. ఈ సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఇప్పటివరకు 20 సార్లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఆయన.. ఈ ఏడాది ఆగస్టు 15న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21వసారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వం తరపున జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే అవకాశం ప్రతి ప్రజాప్రతినిధికి దక్కదు. అలాంటి గౌరవం తుమ్మల నాగేశ్వరరావుకు పలుమార్లు దక్కడం ఆయన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానానికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తోంది. ప్రభుత్వాలు, రాజకీయ పరిస్థితులు మారినా.. ప్రజాప్రతినిధిగా ఆయనకు లభించిన ఈ గౌరవం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**నాలుగు ప్రభుత్వాల్లో మంత్రిగా..**

1985లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తుమ్మల నాగేశ్వరరావు.. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలోనూ మంత్రిగా కొనసాగారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వంలోనూ మంత్రిగా పనిచేసిన ఆయన.. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ, సహకార, జౌళి శాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మైనర్ ఇరిగేషన్, రోడ్లుభవనాలు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, మేజర్ ఇరిగేషన్ తదితర కీలక శాఖలను నిర్వహించిన అనుభవం తుమ్మల నాగేశ్వరరావుకు ఉంది. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా ఎన్నికై సుదీర్ఘకాలం ప్రజా జీవితంలో కొనసాగుతున్నారు.

**20 సార్లు జాతీయ పతాకావిష్కరణ**

అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం.. తుమ్మల నాగేశ్వరరావు 1985 నుంచి 1989 వరకు ఐదుసార్లు, 1995 నుంచి 2003 వరకు తొమ్మిదిసార్లు, 2015 నుంచి 2018 వరకు నాలుగుసార్లు, 2024, 2025 సంవత్సరాల్లో ఒక్కోసారి చొప్పున మొత్తం 20 సార్లు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఈ ఏడాది 2026 ఆగస్టు 15న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగే 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తుమ్మల నాగేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. దీంతో ఆయన ఖాతాలో 21వసారి జాతీయ పతాకావిష్కరణ చేసిన ఘనత చేరనుంది.

**రాజకీయ ప్రస్థానంలో ప్రత్యేక ముద్ర**

తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ జీవితాన్ని పరిశీలిస్తే.. వివిధ రాజకీయ పరిస్థితుల్లోనూ ప్రజాప్రతినిధిగా కొనసాగుతూ, పలు ప్రభుత్వాల్లో మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. నాలుగు వేర్వేరు ప్రభుత్వాల కాలంలో మంత్రిగా పనిచేసిన ఆయనకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ ప్రతినిధిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే అవకాశం పలుమార్లు లభించడం ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రత్యేక ఘట్టంగా చెప్పవచ్చు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ నెల 15న 21వసారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో.. తుమ్మల నాగేశ్వరరావు సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం మరోసారి చర్చకు వస్తోంది.

**ఇప్పటివరకు జాతీయ పతాకావిష్కరణ చేసిన సంవత్సరాలు**

1985, 1986, 1987, 1988, 1989, 1995, 1996, 1997, 1998, 1999, 2000, 2001, 2002, 2003, 2015, 2016, 2017, 2018, 2024, 2025.

2026 ఆగస్టు 15న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21వసారి జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారు.

# ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- **సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయమే ప్రభుత్వ పాలన లక్ష్యం**
- **మంత్రి దామోదర రాజనర్సింహ**
- **స్వయం సహాయక సంఘాలకు రూ.225 కోట్ల రుణాల పంపిణీ**



**సంగారెడ్డి, ఆగస్టు 15:- వుదయం**

నెహ్రూ, ఇందిరమ్మ అందించిన సంక్షేమ స్ఫూర్తితో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

అనంతరం మంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందని, వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లాలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని వివరించారు.

మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.225 కోట్ల విలువైన రుణాల చెక్కును మంత్రి పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవడంతో పాటు, చిన్న తరహా వ్యాపారాలు, ఉపాధి కార్యక్రమాలను చేపట్టి అభివృద్ధి చెందాలని మంత్రి ఆకాంక్షించారు.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అద్భుతంగా ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను మంత్రి దామోదర రాజనర్సింహ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో
# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**సిద్దిపేట, ఆగస్టు 15 (వుదయం బ్యూరో)**



సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ సిబ్బందికి, జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీ రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ, సాధారణ పౌరులతో పోలిస్తే యూనిఫాం ధరించే పోలీసులపై సమాజం పట్ల మరింత ఎక్కువ బాధ్యత ఉంటుందని గుర్తుచేశారు. "మనం యూనిఫారంలో బయటకు వచ్చినప్పుడు ప్రజలకు ప్రభుత్వ ప్రత్యక్ష, స్పష్టమైన ప్రతినిధులుగా కనిపిస్తాం. అందుకే మన ప్రతి చర్య సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నిబంధనలను పాటించడంలో పోలీసు అధికారులే సమాజానికి ఆదర్శంగా నిలవాలి. పోలీసులు చేసే చిన్న ట్రాఫిక్ ఉల్లంఘన అయినా మొత్తం పోలీస్ వ్యవస్థ ప్రతిష్టపై ప్రతికూల ప్రభావం చూపుతుంది" అని హెచ్చరించారు. ప్రతి ఒక్క అధికారి, సిబ్బంది వృత్తిపరమైన ప్రమాణాలను పాటిస్తూ, వ్యక్తిగత జీవితంలోనూ అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. యూనిఫారంతో వచ్చే గౌరవాన్ని, బాధ్యతను గుర్తించి విధుల్లో నిబద్ధత, గౌరవం, సానుభూతితో ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుండాలని సూచించారు. ఈ వేడుకల్లో అదనపు డీసీపీ (ఏఆర్) సుభాష్ చంద్రబోస్‌తో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతు సేవల్లో గద్వాల సత్తా.. రాష్ట్రస్థాయి అవార్డు

**గద్వాల ఆగస్టు 15**
**(వుదయం బ్యూరో)**



వ్యవసాయ రంగంలో ఉత్తమ పనితీరుతో జోగులాంబ గద్వాల జిల్లా రాష్ట్రస్థాయిలో సత్తా చాటింది. రైతులకు వ్యవసాయ శాఖ సేవలను సమర్థవంతంగా అందించడం, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయడంలో కనబరిచిన ప్రతిభకు రాష్ట్రస్థాయి ఉత్తమ పనితీరు పురస్కారం లభించింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించు కుని రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లోని వ్యవసాయ కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప.. రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు డాక్టర్ గోపి, ఐఏఎస్ చేతుల మీదుగా పురస్కారాన్ని స్వీకరించారు. క్షేత్రస్థాయి సేవలకు గుర్తింపు

జిల్లాలో రైతులకు వ్యవసాయ శాఖ అందిస్తున్న సేవలను మరింత చేరువ చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను అర్హులైన రైతులకు అందేలా అధికారులు, సిబ్బంది చేపట్టిన చర్యలకు ఈ పురస్కారం దక్కింది. వ్యవసాయ పథకాల అమలు, రైతులకు సాంకేతిక సూచనలు అందిం చడం, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ తదితర అంశాల్లో అధికారులు చూపిన చొరవకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇచ్చింది.

సమష్టి కృషి ఫలితం జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ అందించిన సహకారం, మార్గనిర్దేశంతో పాటు మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సిబ్బంది సమష్టిగా చేసిన కృషి ఫలితంగానే ఈ అవార్డు సాధ్యమైంద న్నారు. పురస్కారం అందుకున్న సంద ర్భంగా అధికారులను, సిబ్బందిని అభినందించారు. రాష్ట్రస్థాయి గుర్తింపు మరింత బాధ్యతను పెంచిందని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో రెట్టించిన ఉత్సాహంతో పనిచేసి రైతులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖకు దక్కిన ఈ పురస్కారం అధికారుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.

## విద్యార్థుల ప్రోత్సాహానికి
# సర్పంచ్ ముందడుగు




**వట్‌పల్లి, ఆగస్టు 15**
**(వుదయం ప్రతినిధి):**

విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సర్పంచ్ ముద్దపురం రాజు ముందడుగు వేశారు. జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు సౌండ్‌బాక్స్‌ను అందజేసి, ఎస్ఎస్‌సీ విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. ఫస్ట్ ప్రైజ్ బోయిన్ కీర్తన, సెకండ్ ప్రైజ్ బోయిన్ మహేష్, పెద్దలోడి సౌజన్య అందుకున్నారు. ఎంపీపీఎస్ పాఠశాలకు 42 అంగుళాల టీవీని అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సర్పంచ్ సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బక్క దత్తు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోసిగి శేఖర్, మాజీ విద్యా కమిటీ చైర్మన్ మాదే వీరన్న, వార్డు సభ్యుడు కోర్మని రాజు, చిత్రాల యాదగిరి, ధర్మగారి ప్రభాకర్ గౌడ్, హెచ్‌ఎంలు సుకన్య, నాగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- **త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన తెలంగాణ రాష్ట్రశాసనసభ పతి గడ్డం ప్రసాద్ కుమార్ ***
- **ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు ....**



**వికారాబాద్ ఆగస్టు 15**
**(వుదయం బ్యూరో)**

వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న పరేడ్ గ్రౌండ్లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర శాసన సభా పతి గడ్డం ప్రసాద్ కుమార్, విచ్చేసి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఎస్ పి స్నేహ మెహర గార్లతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. పుర ప్రముఖులను, అధికార అనధికారులను కలిసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ప్రగతిని నివేదిస్తూ, ప్రజనుద్దేశించి ప్రసంగించారు. వివిధ శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, సాధించిన ప్రగతిని తెలిపేలా ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, ,పశు సంవర్ధక,ఉద్యానవన శాఖ,అటవీ, విద్యా, వైద్యారోగ్య, ఇందిరమ్మ ఇండ్లు,మహిళా శిశు సంక్షేమం, మిషన్ భగీరథ,రోడ్డు రవాణా సంస్థ,ట్రాన్స్ పోర్ట్ తదితర శాఖల స్టాల్స్ ను సందర్శించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు బహూకరించారు. పోలీసులకు ప్రశాంషా పత్రాలు బహూకరించారు.

ఈ సందర్భంగా మహిళా సంఘాలకు రూ . 179,18,32,000 వడ్డీ లేని రుణాలు చెక్ అందజేశారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుక సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు, చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరింపజేశాయి. దేశ భక్తి ఉట్టి పడేలా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ఆహుతుల మన్ననలు అందుకున్నారు. కే జి బి వి వికారాబాద్, ,సంగం లక్ష్మి బాయి , జవహర్ లాల్ బాల కేంద్రం , జాడ్ పి ఎచ్ ఎస్ గర్ల్స్, టి ఎస్ డబ్ల్యు ఆర్ ఎస్, బాయ్స్, అనంతగిరి పల్లి, ట్రైబల్ వెల్ఫేర్, మహాత్మా జ్యోతి బా పులే బాలికల పాఠశాల, విద్యార్థినులు, చిన్నారులు సాంస్కృతిక గేయాలపై చక్కటి అభినయం ప్రదర్శించారు.

ఈ సందర్భంగా చిన్నారులను ముఖ్య అతిథి ప్రసాద్ కుమార్ , ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించి జ్ఞాపికలను అందజేశారు.

ఈ వేడుకల్లోఅదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి ఎమ్మెల్యే రామ్ మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గడ్డం అనన్య, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్ , అటవీ శాఖా అధికారి ,ఎస్ ఎఫ్ సి రంగ రాజు, ఆర్డీఓ వాసు చంద్ర, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, , ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

# చక్కని ఆరోగ్యం

## సీ ఫుడ్‌ను తరచూ తినడం మంచిదే..



సముద్ర ఆహారాలు (సీ ఫుడ్) ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చాలా మంది భావిస్తారు. చేపలు, రొయ్యలు, పీతలు, ఆయిస్టర్లు వంటి సముద్ర ఆహారాల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, డీహెచ్ఏ, అధిక నాణ్యత కలిగిన ప్రోటీన్ వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఇవి గుండె, మెదడు ఆరోగ్యానికి మేలు చేయడంలో సహాయపడతాయి. అయితే వీటిని తీసుకునే విషయంలో కొన్ని జాగ్రత్తలు కూడా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. సముద్ర ఆహారాలు పోషకవిలువలతో నిండి ఉన్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో హానికరమైన లోహాలు, కాలుష్య కారకాలు కూడా వీటిలో చేరే అవకాశం ఉంటుంది. సముద్రాలు, నదులు పారిశ్రామిక వ్యర్థాలు, రసాయన కాలుష్యానికి గురికావడం వల్ల చేపలు, ఇతర సముద్ర జీవుల్లో కొన్ని విషపదార్థాలు పేరుకుపోతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ పర్‌స్పెక్టివ్స్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. కొన్ని రకాల సముద్ర ఆహారాల్లో మిథైల్ మెర్క్యురీతోపాటు పర్సిస్టెంట్ ఆర్గానిక్ పొల్యూటెంట్స్ వంటి కాలుష్య కారకాలు ఉండే అవకాశం ఉంటుంది. ఇవి అధిక మోతాదులో శరీరంలో చేరితే ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంటుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. మిథైల్ మెర్క్యురీతోపాటు సీసం (లెడ్), మాంగనీస్, క్రోమియం, క్యాడ్మియం, ఆర్సెనిక్ వంటి లోహాల ఆనవాళ్లు కూడా కొన్ని సముద్ర ఆహారాల్లో కనిపిస్తాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇవి ఎక్కువ కాలం శరీరంలో పేరుకుపోతే ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయని హెచ్చరిస్తున్నారు. కొన్ని పరిశోధనల ప్రకారం అధిక స్థాయిలో మెర్క్యురీకి గురికావడం వల్ల రోగనిరోధక వ్యవస్థ పనితీరుపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా మహిళల్లో ఆటో ఇమ్యూన్ వ్యాధుల ప్రమాదం పెరుగుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఆటో ఇమ్యూన్ వ్యాధుల్లో శరీర రోగనిరోధక వ్యవస్థ ఆరోగ్యకరమైన కణాలపైనే దాడి చేయడం ప్రారంభిస్తుంది. దీని వల్ల ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్, లూపస్, షోగ్రెన్ సిండ్రోమ్, రుమటాయిడ్ ఆర్థ్రైటిస్, మల్టిపుల్ స్క్లెరోసిస్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.

అలాంటి ఆహారం తీసుకుంటే ప్రమాదమే..

పారిశ్రామిక కార్యకలాపాల వల్ల వాతావరణంలోకి విడుదలయ్యే మెర్క్యురీ నీటిలో కలిసిపోవడంతో చేపలు, షెల్‌ఫిష్‌లో అది పేరుకుపోయే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. చేపలు మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తాయని అనేక అధ్యయనాలు సూచించినప్పటికీ, అధిక స్థాయిలో కాలుష్య కారకాలు ఉన్న చేపలను తరచూ తీసుకుంటే ఆ ప్రయోజనాలు తగ్గిపోయే అవకాశం కూడా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, పిల్లలు సముద్ర ఆహారం తీసుకునే విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. అధిక మెర్క్యురీ ఉన్న చేపలను తరచూ తీసుకోవడం వల్ల గర్భంలోని శిశువు నాడీ వ్యవస్థ అభివృద్ధిపై ప్రభావం పడే ప్రమాదం ఉంటుందని పరిశోధనలు పేర్కొంటున్నాయి. ఇది భవిష్యత్తులో జ్ఞాపకశక్తి, భాషా నైపుణ్యాలు, దృష్టి-కదలికల సమన్వయం వంటి అంశాలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని వెల్లడించాయి. అయితే దీనర్థం సముద్ర ఆహారాలను పూర్తిగా మానేయాలని కాదు. నమ్మకమైన ప్రాంతాల నుంచి లభించే, నాణ్యమైన సముద్ర ఆహారాన్ని పరిమిత మోతాదులో తీసుకోవడం మంచిది. ముఖ్యంగా గర్భిణులు, పాలిచ్చే తల్లులు తమ ఆహారంలో చేపలను చేర్చే ముందు వైద్యులు లేదా పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## కోడిగుడ్లలో అసలు ఏయే పోషకాలు ఉంటాయి..



గుడ్లు అత్యంత పోషకవిలువలు కలిగిన ఆహారాల్లో ఒకటిగా గుర్తింపు పొందాయి. ఉదయం అల్పాహారం నుంచి మధ్యాహ్నం, రాత్రి భోజనం వరకు అనేక రకాల వంటకాల్లో వీటిని ఉపయోగిస్తారు. అధిక నాణ్యత కలిగిన ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు సమృద్ధిగా ఉండే గుడ్లు శరీరానికి అవసరమైన అనేక పోషకాలను అందిస్తాయి. రోజువారీ ఆహారంలో పరిమిత మోతాదులో గుడ్లను చేర్చడం వల్ల కండరాల ఆరోగ్యం నుంచి మెదడు పనితీరు వరకు అనేక ప్రయోజనాలు పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. గుడ్లు అధిక నాణ్యత కలిగిన ప్రోటీన్‌కు అద్భుతమైన మూలం. ప్రోటీన్లు కండరాల నిర్మాణం, మరమ్మత్తు, రోగనిరోధక శక్తి పెంపు, రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ, బరువు తగ్గడంలో కీలక పాత్ర పోషిస్తాయి. గుడ్డులోని తెల్లసొనతోపాటు పచ్చసొనలో కూడా కండరాల అభివృద్ధికి తోడ్పడే పోషకాలు ఉంటాయి. ఎముకల ఆరోగ్యానికి అవసరమైన విటమిన్ డి గుడ్లలో సమృద్ధిగా లభిస్తుంది. అలాగే ఫాస్ఫరస్ కూడా ఉండటం వల్ల ఎముకలు, దంతాలు దృఢంగా ఉండేందుకు అవసరమైన పోషణ లభిస్తుంది. గుడ్లలో బి విటమిన్లు, కోలిన్, ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇవి మెదడు, నాడీ వ్యవస్థ పనితీరుకు మేలు చేస్తాయి. కోలిన్ జ్ఞాపకశక్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ప్రోటీన్ రోజంతా మానసిక చురుకుదనాన్ని కొనసాగించేందుకు దోహదం చేస్తుంది. గుడ్లలో ల్యూటిన్, జియాక్సాంతిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు ఉండటం వల్ల కంటి ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. వయసు పెరుగుతున్న కొద్దీ వచ్చే కంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలోనూ ఇవి సహాయపడతాయి. అలాగే ట్రిప్టోఫాన్, టైరోసిన్ వంటి అమినో ఆమ్లాలు గుండె ఆరోగ్యానికి కూడా తోడ్పడుతాయి. బరువు తగ్గాలనుకునే వారికి కూడా గుడ్లు మంచి ఎంపికగా ఉంటాయి. ప్రోటీన్ అధికంగా ఉండటం వల్ల అవి నెమ్మదిగా జీర్ణమవుతాయి. దీంతో ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉండి, అధికంగా తినే అలవాటు తగ్గే అవకాశం ఉంటుంది. కూరగాయలతో చేసిన ఆమ్లెట్, ఉడికించిన గుడ్లు లేదా ఇతర ఆరోగ్యకరమైన గుడ్ల వంటకాలు బరువు నియంత్రణకు ఉపయోగపడతాయి. గుడ్లలోని ప్రోటీన్లు జీర్ణక్రియ సమయంలో శరీరంలో జీవక్రియలను ప్రభావితం చేసే పెప్టైడ్లుగా మారతాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇవి జీవక్రియను చురుకుగా ఉంచడంలో, అలాగే కొలెస్ట్రాల్ శోషణను తగ్గించడంలో కొంతవరకు సహాయపడే అవకాశం ఉందని పరిశోధనలు పేర్కొంటున్నాయి. గుడ్లు తక్కువ కేలరీలు కలిగిన ఆహారం కూడా. ఒక పెద్ద గుడ్డులో సుమారు 78 కేలరీలు మాత్రమే ఉంటాయి. బరువు తగ్గే ప్రయత్నంలో ఉన్నవారు పచ్చసొనను పరిమితం చేసి, అవసరాన్ని బట్టి తెల్లసొనను తీసుకోవచ్చు. గుడ్లలో కొలెస్ట్రాల్ ఉన్నప్పటికీ, అవి మంచి నాణ్యత కలిగిన ప్రోటీన్‌ను అందించే ఆహారం. తాజా పరిశోధనల ప్రకారం చాలా మంది ఆరోగ్యవంతులలో పరిమిత మోతాదులో గుడ్లు తీసుకోవడం వల్ల మంచి కొలెస్ట్రాల్ (HDL) స్థాయిలు పెరగడానికి దోహదపడుతుంది. అయితే ఇప్పటికే అధిక కొలెస్ట్రాల్, గుండె సంబంధిత సమస్యలు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు గుడ్ల వినియోగంపై వైద్యులు లేదా పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

## ఈ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు బొప్పాయి తినకపోవడం మంచిది!




బొప్పాయి ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పండు. ఇందులో విటమిన్ ఏ, విటమిన్ సి, ఫోలేట్, ఫైబర్, పొటాషియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. అలాగే జీర్ణక్రియకు సహాయపడే పాపైన్ అనే ఎంజైమ్ కూడా ఉంటుంది. బొప్పాయి జీర్ణక్రియను మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంలో ఉపయోగపడుతుంది. అయితే, కొన్నిఆరోగ్య సమస్యలు ఉన్నవారు దీనిని తినే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. గర్భధారణ సమయంలో బొప్పాయి తినకపోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే లేటెక్స్, పాపైన్ వల్ల గర్భాశయ సంకోచాలు వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. బొప్పాయిలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. దీనిని అధికంగా తీసుకుంటే శరీరంలో ఆక్సలేట్ పెరిగి, కొందరిలో కిడ్నీ రాళ్లు మళ్లీ ఏర్పడే అవకాశం ఉంటుంది. కాబట్టి మితంగా తీసుకోవాలి. హైపోథైరాయిడిజం ఉన్నవారు బొప్పాయిని ఎక్కువగా తీసుకునే ముందు వైద్యుడి సలహా తీసుకోవాలి. కొన్ని అధ్యయనాల ప్రకారం ఇందులోని కొన్ని పదార్థాలు అయోడిన్ వినియోగంపై స్వల్ప ప్రభావం చూపే అవకాశం ఉందని చెబుతున్నారు. గుండె కొట్టుకునే వేగంలో సమస్యలు (అరిథ్మియా) ఉన్నవారు లేదా గుండె నెమ్మదిగా కొట్టుకునే సమస్య ఉన్నవారు బొప్పాయిని ఎక్కువగా తినే ముందు వైద్యులని సంప్రదించడం మంచిది. బొప్పాయి రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో కొంత సహాయపడుతుంది. ఇప్పటికే మధుమేహం కోసం మందులు లేదా ఇన్సులిన్ తీసుకునేవారు బొప్పాయిని ఎక్కువగా తింటే రక్తంలో చక్కెర స్థాయిలు మరీ తగ్గే అవకాశం ఉంటుంది.

## కిడ్నీ సమస్యలు.. గుండెకు ప్రమాదకరమా?

మన శరీరంలో మూత్రపిండాలు (కిడ్నీలు) చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఇవి రక్తంలోని వ్యర్థ పదార్థాలను తొలగించడం, అదనపు నీటిని బయటకు పంపించడం, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. అయితే కిడ్నీల పనితీరు దెబ్బతింటే దాని ప్రభావం గుండెపై కూడా పడుతుంది.

కిడ్నీలు సరిగా పనిచేయకపోతే శరీరంలో ఉప్పు, నీరు, వ్యర్థ పదార్థాలు పేరుకుపోతాయి. దీనివల్ల రక్తపోటు పెరుగుతుంది. అధిక రక్తపోటు కారణంగా గుండె సాధారణం కంటే ఎక్కువ శ్రమించాల్సి వస్తుంది. గుండె బలహీనపడటం (హార్ట్ ఫెయిల్యూర్) పక్షవాతం వంటి సమస్యలు వచ్చే అవకాశం పెరుగుతుంది.



ఎవరికి ఎక్కువ ప్రమాదం ఉంటుంది? కింది సమస్యలు ఉన్నవారు కిడ్నీ, గుండె ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

మధుమేహం ఉన్నవారు

అధిక రక్తపోటు ఉన్నవారు

కిడ్నీ సమస్యలు ఉన్నవారు

రక్తహీనత సమస్య ఉన్నవారు, కిడ్నీ వ్యాధి కారణంగా శరీరంలో ఖనిజాల అసమతుల్యత, వాపు వంటి సమస్యలు కూడా రావచ్చు. ఇవి గుండెపై అదనపు భారాన్ని పెంచుతాయి. కిడ్నీల పనితీరు తగ్గినప్పుడు ఈ లక్షణాలు కనిపించవచ్చు:

కాళ్లు, ముఖం వాపు రావడం

తరచుగా మూత్రం రావడం లేదా మూత్రం తగ్గడం

మూత్రంలో నురుగు లేదా రక్తం కనిపించడం

ఆకలి తగ్గడం, చర్మంపై దురద, అధిక రక్తపోటు, కిడ్నీ వ్యాధి ప్రారంభ దశలో పెద్దగా లక్షణాలు కనిపించకపోవచ్చు. అందుకే దీనిని చాలాసార్లు 'నిశ్శబ్ద వ్యాధి' అని కూడా అంటారు.

కిడ్నీ ఆరోగ్యానికి హాని చేసే అలవాట్లు

కొన్ని రోజువారీ అలవాట్లు కిడ్నీలపై ప్రభావం చూపుతాయి.

ధూమపానం చేయడం, వైద్యుల సలహా లేకుండా ఎక్కువగా నొప్పి నివారణ మందులు వాడటం

తగినంత నీరు తాగకపోవడం, ఇలాంటి అలవాట్లను తగ్గించుకోవాలి. కిడ్నీ, గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చిట్కాలు సమతుల్యమైన ఆహారం తీసుకోవాలి. రోజుకు తగినంత నీరు తాగాలి. పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి.

## ఉప్పుతో లాభాలెన్నో

గోరువెచ్చని నీటిలో కొద్దిగా కల్లుప్పు వేసి కాసేపు పాదాల్ని ఉంచితే, రోజంతా పడ్డ అలసట మాయమై పాదాల నొప్పులు, వాపులు త్వరగా తగ్గుతాయి. ఉప్పును మెత్తగా నూరి కొబ్బరి, ఆలివ్ నూనెతో కలిపి చర్మంపై రుద్దితే... సహజమైన బాడీ స్క్రబ్‌గా పనిచేస్తుంది. మృతకణాలను తొలగించి, రంధ్రాలను శుభ్రపరిచి చర్మాన్ని కోమలంగా మారుస్తుంది. గోరువెచ్చని ఉప్పు నీటితో నోరు పుక్కిలించడం వల్ల చిగుళ్ల సమస్యలు, నోటి దుర్వాసన తగ్గుతాయి. ఉప్పు శక్తిమంతమైన క్లీనర్‌గా పనిచేస్తుంది. వంటగదిలోని జిడ్డు మరకలను తొలగించడంలో ఇది ఎంతో సహాయపడుతుంది. మాడిపోయిన గిన్నెలు లేదా బాణలిపై కొద్దిగా ఉప్పు చల్లి, నిమ్మకాయ చెక్కతో బాగా రుద్దితే ఆ నల్లటి



మరకలు సులువుగా వదిలిపోతాయి. సింక్ డ్రెయిన్ నుంచి వచ్చే చెడు వాసనను అరికట్టడానికి, పైపుల్లో పేరుకుపోయిన మురికిని వదిలించడానికి బాగా కాచిన వేడి నీటిలో చిక్కటి ఉప్పు ద్రావణాన్ని కలిపి పోస్తే సరి. ఇత్తడి, రాగి పాత్రలపై ఉన్న మచ్చలను వదిలించడానికి ఉప్పు, వెనిగర్ కలిపిన మిశ్రమాన్ని ఉపయోగిస్తే మళ్లీ కొత్తవాటిలా మెరిసిపోతాయి. దుస్తులపై నూనె, టీ లేదా కాఫీ మరకలు పడినప్పుడు వెంటనే ఆ భాగాన్ని ఉప్పు నీళ్లలో నానబెట్టి ఉతికితే మరకలు తేలికగా వదిలిపోతాయి. అంతేకాకుండా కొత్త డ్రెస్‌లు ఉతికేటప్పుడు కొద్దిగా ఉప్పు చేర్చడం వల్ల దుస్తుల రంగులు వెలిసిపోకుండా ఉంటాయి. అద్దాలు, గాజు గ్లాసులపై ఏర్పడే నీటి చారలను కూడా ఉప్పు నీటితో తుడిచి శుభ్రం చేయవచ్చు. వర్షాకాలంలో ఇంట్లో తేమ శాతం పెరిగి ఒక విధమైన దుర్వాసన వస్తున్నప్పుడు, ఒక చిన్న గిన్నెలో ఉప్పు వేసి గది మూలన ఉంచితే అది గాలిలోని తేమను పీల్చుకుని వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మారుస్తుంది.

## నెలసరిలో ఎందుకీ సమస్యలు?


సాధారణంగా నెలసరిలో కడుపునొప్పి, నడుం నొప్పి, అలసట, నీరసం.. వంటి సమస్యలు చాలామందిలో కనిపిస్తుంటాయి. ఇవే కాదు.. రుతుచక్రం జీర్ణ వ్యవస్థ పైనా ప్రతికూల ప్రభావం చూపుతుందంటున్నారు నిపుణులు. ఫలితంగా ఈ సమయంలో వివిధ జీర్ణ సంబంధిత సమస్యలూ వచ్చే అవకాశం ఎక్కువంటున్నారు. పిరియడ్స్‌లో ఇవీ సర్వసాధారణమే అంటున్నారు. మరి, ఏంటా సమస్యలు? తెలుసుకుందాం రండి..

నెలసరిలో శారీరక నొప్పులు, మానసిక ఒత్తిళ్లు, అలసట.. వంటి సమస్యలకు హార్మోన్లలో వచ్చే మార్పులే కారణమన్న సంగతి తెలిసిందే! అయితే వీటిలో హెచ్చుతగ్గులే ఈ సమయంలో జీర్ణ వ్యవస్థ పనితీరు పైనా ప్రతికూల ప్రభావం చూపుతాయంటున్నారు నిపుణులు. నెలసరి ప్రారంభానికి వారం రోజుల ముందు ప్రొజెస్టరాన్ స్థాయులు ఒక్కసారిగా పడిపోతాయట. ఫలితంగా పేగుల్లో ఆహార కదలికలు నెమ్మదిస్తాయని, దీనివల్ల గ్యాస్ ఏర్పడి కడుపుబ్బరానికి దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇక పిరియడ్స్ సమయంలో ఎదురయ్యే దుష్ప్రభావాల కారణంగా విశ్రాంతి తీసుకోవడానికే ఆసక్తి చూపుతారు చాలామంది. ఫలితంగా వ్యాయామం చేయకపోవడం, జంక్‌ఫుడ్స్ తినాలన్న కోరిక, నీళ్లు ఎక్కువగా తాగకపోవడం.. వంటి మార్పులన్నీ మలబద్ధకానికి దారితీస్తాయంటున్నారు. అయితే కొంతమందిలో బ్లీడింగ్ ప్రారంభం కాగానే.. ప్రొస్టాగ్లాండిన్లు అనే హార్మోన్లు ఎక్కువగా ఉత్పత్తవుతాయట! ఇవి పేగుల్లో ఆహార కదలికల వేగాన్ని పెంచి.. విరేచనాలకు దారితీస్తాయంటున్నారు నిపుణులు. ఇక కొంతమందిలో వికారం, వాంతులవడం.. వంటి లక్షణాలు కూడా కనిపించే అవకాశాలున్నాయంటున్నారు. అయితే పిరియడ్స్ సమయంలో ఈ జీర్ణ సంబంధిత సమస్యలన్నీ సర్వసాధారణమే అంటున్నారు నిపుణులు. నెలసరి పూర్తవగానే ఇవి తగ్గుముఖం పడతాయని చెబుతున్నారు. ఆలోపు ఈ చిన్న చిన్న చిట్కాలతో ఉపశమనం పొందచ్చంటున్నారు. ఈ సమయంలో సులభంగా జీర్ణమయ్యే ఆహార పదార్థాల్నే తీసుకోవాలంటున్నారు నిపుణులు. కెఫీన్, పాలు-పాల పదార్థాలు, నూనె పదార్థాలు, బేకరీ ఉత్పత్తులు.. వంటి వాటికి దూరంగా ఉండడమే మేలంటున్నారు. తక్కువ మోతాదులో ఎక్కువసార్లు తినడం వల్ల జీర్ణ వ్యవస్థపై ఒత్తిడి పడకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు నిపుణులు. తద్వారా తీసుకున్న ఆహారం సులభంగా జీర్ణమై.. జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తపడచ్చని చెబుతున్నారు. ఫైబర్ అధికంగా లభించే ఓట్స్, కాయగూరలు తీసుకోవడం వల్ల జీర్ణక్రియ పనితీరు మెరుగుపడుతుందంటున్నారు నిపుణులు. అలాగే నీళ్లు ఎక్కువగా తాగడం కూడా ముఖ్యమే. తద్వారా అజీర్తి, కడుపుబ్బరం, మలబద్ధకం.. వంటి సమస్యల నుంచి విముక్తి పొందచ్చు. వికారంగా అనిపిస్తే అల్లం, పెప్పర్‌మెంట్ టీ తాగడం వల్ల ఫలితం ఉంటుంది. ప్రొబయాటిక్స్ ఎక్కువగా ఉండే పెరుగు తీసుకోవడం వల్ల విరేచనాల సమస్య నుంచి ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు. అయితే ఈ చిట్కాల వల్ల ఉపశమనం కలగకపోయినా.. జీర్ణ సంబంధిత సమస్యలు తీవ్రంగా ఉన్నట్లనిపించినా.. ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించడం మంచిదంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఈ దుష్ప్రభావాలు కొన్నిసార్లు ఎండోమెట్రియోసిస్, ఇరిటబుల్ బొవెల్ సిండ్రోమ్.. వంటి సమస్యలకు సంకేతాలని చెబుతున్నారు. కాబట్టి ఈ విషయాల్ని దృష్టిలో పెట్టుకోవడం మేలు.



## నోరు, దంతాల సమస్యలు ఉన్నవారు వీటిని ఉపయోగించండి..

మన నోటి ఆరోగ్యం మన మొత్తం ఆరోగ్యానికి అద్దం పడుతుంది. దంతాలు బలహీనపడటం, పిప్పి దంతాలు, దంతాలపై మరకలు, దంతాల సున్నితత్వం (టూత్ సెన్సిటివిటీ) వంటి సమస్యలు చాలా మందిలో కనిపిస్తున్నాయి. ముఖ్యంగా చల్లని లేదా వేడి ఆహారం తిన్నప్పుడు దంతాలలో ఒక్కసారిగా నొప్పి లేదా జలదరింపు అనిపించడం దంతాల సున్నితత్వానికి సంకేతం. అయితే కొన్ని సాధారణ జాగ్రత్తలను పాటించడం ద్వారా ఈ సమస్యను తగ్గించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అమ్లం (ఆసిడిటీ) ఎక్కువగా ఉండే ఆహారాలు, పానీయాలను అధికంగా తీసుకోవడం తగ్గించాలి. ఇవి దంతాలపై ఉండే ఎనామెల్‌ను క్రమంగా దెబ్బతీసి సున్నితత్వాన్ని పెంచే అవకాశం ఉంటుంది. అలాగే ఇలాంటి ఆహారం తీసుకున్న వెంటనే కాకుండా కనీసం 20 నిమిషాల తర్వాత దంతాలను తోమడం మంచిది. గ్యాస్ట్రిక్ సమస్యలు లేదా యాసిడ్ రిఫ్లక్స్‌తో బాధపడేవారు వాటికి సరైన చికిత్స తీసుకోవాలి. కడుపులోని ఆమ్లం తరచూ నోటిలోకి రావడం వల్ల దంతాలలోని ఖనిజాలు తగ్గి, ఎనామెల్ దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. దీంతో దంతాల సున్నితత్వం మరింత పెరుగుతుంది. గ్రీన్ టీ తాగడం కూడా దంతాల ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం గ్రీన్ టీలో ఉండే కొన్ని సమ్మేళనాలు దంతాల సున్నితత్వాన్ని తగ్గించడంలో సహాయపడే అవకాశం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. ఉప్పు కలిపిన గోరువెచ్చని నీటితో నోరు పుక్కిలించడం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది నోటిలోని పీహెచ్ స్థాయిని సమతుల్యం చేయడంలో సహాయపడి, బ్యాక్టీరియా పెరుగుదలను తగ్గించడంలో తోడ్పడుతుంది. దంతాలను తెల్లగా మార్చే (టీత్ వైటెనింగ్) ఉత్పత్తులు లేదా ఆల్కహాల్ అధికంగా ఉండే మౌత్‌వాష్‌లను తరచూ ఉపయోగించడం తగ్గించాలి. ఇవి కొందరిలో దంతాల సున్నితత్వాన్ని మరింత పెంచే అవకాశం ఉంటుంది. అవసరమైతే సహజ పదార్థాలతో తయారైన ఉత్పత్తులను మాత్రమే ఉపయోగించడం మంచిది. లవంగం లేదా లవంగ నూనె కూడా దంతాల సున్నితత్వం వల్ల వచ్చే అసౌకర్యాన్ని తాత్కాలికంగా తగ్గించడంలో ఉపయోగపడుతుంది. లవంగంలో ఉండే సహజ సమ్మేళనాలు నొప్పిని తగ్గించే లక్షణాలను కలిగి ఉంటాయి. దంతాల సున్నితత్వం తరచూ వేధిస్తుంటే లేదా నొప్పి ఎక్కువగా ఉంటే ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకుండా దంత వైద్యుడిని సంప్రదించడం అవసరం. సరైన కారణాన్ని గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా సమస్య మరింత తీవ్రమవకుండా నివారించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.



## పతాక ఆవిష్కరణ - విద్యార్థులకు కుల ధృవపత్రాల పంపిణీ



**వుదయం మనూర్**
మనూర్ ఆగస్టు 15 () 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మనూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి తహసీల్దార్ విష్ణుసాగర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిటి ఆదర్శ్, ఆర్ ఐ శంకర్, జూనియర్ అసిస్టెంట్ ఖాజా, రఘురాం తో పాటు జిపిఓలు, ఇతర సిబ్బంది, ఎంఈఓ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.
స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యార్థులకు ఎస్సీ ఎస్టీ కుల ధృవపత్రాలను అధికారులు అందజేశారు.

## మహిళా సంఘాలకు లింకేజీ ద్వారా రుణాలు పంపిణీ

**మహబూబ్‌నగర్ , ఆగస్టు 15 (వుదయం**



80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డి.ఆర్.డి.ఎ) ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన రుణాలకు సంబంధించిన ఆర్థిక సహాయాన్ని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు మహిళా సంఘాలకు పంపిణీ చేశారు. జిల్లాలోని 1,219 మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.143 కోట్ల రుణాల చెక్ ను మంత్రి మహిళ సంఘాల సభ్యులకు అందజేశారు. అలాగే నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ కింద 559 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున మొత్తం రూ.1.11 కోట్ల ఆర్థిక సహాయాన్ని పంపిణీ చేశారు.అనంతరం స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించే కార్యక్రమాల్లో భాగంగా 350 మందికి టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్లు, 25 మంది విద్యార్థులకు సైకిళ్లు, 14 మంది లబ్ధిదారులకు స్కూటర్లు మంత్రి జూపల్లి కృష్ణారావు పంపిణీ చేశారు. మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,దేవరకద్ర శాసన సభ్యులు సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి, ఎస్.పి.డి.జానకి,మేయర్ మమత,ట్రైనీఅసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్,మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా మధుసూదన్ రెడ్డి,భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాల కోటి,అదనపు కలెక్టర్ లు మధుసూదన్ నాయక్ రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్ బి హరిప్రియ,తదితరులు పాల్గొన్నారు

## స్టాళ్లను సందర్శించిన మంత్రి జూపల్లి

**మహబూబ్ నగర్**
**ఆగస్టు15(వుదయం ప్రతినిధి)**
80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మహబూబ్‌నగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలు అందిస్తున్న సేవలు, అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ముందుగా గ్రామీణాభివృద్ధి శాఖ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను మంత్రి సందర్శించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను పరిశీలించారు. వి.బి.జీ. రాంజీ, పి.ఎం. కె.ఎస్.వై, స్వచ్ఛ భారత్ పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఫొటో ప్రదర్శనను వీక్షించారు. అనంతరం చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించి చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను పరిశీలించారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించి, సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అటవీ, జిల్లా వైద్యారోగ్య, విద్య, విద్యుత్, వ్యవసాయ, మత్స్య, రోడ్లు-భవనాలు, ట్రాఫిక్ పోలీస్, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కూడా మంత్రి సందర్శించారు. ఆయా శాఖలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై అధికారులతో చర్చించారు.

**స్టాళ్ల ప్రదర్శనలో మెప్మాకు ప్రథమ బహుమతి...**
స్టాళ్ల ప్రదర్శనలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌కు ఉత్తమ స్టాల్‌గా ప్రథమ బహుమతి లభించింది. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌కు ద్వితీయ బహుమతి, మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌కు తృతీయ బహుమతి లభించింది.
అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన జిల్లా అధికారులు, ఉద్యోగులకు మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశంసా పత్రాలను సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా,దేవరకద్ర శాసన సభ్యులు సభ్యులు జి.మధు సూదన్ రెడ్డి, ఎస్.పి.డి.జానకి, మేయర్ మమత,ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్,మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా మధుసూదన్ రెడ్డి,భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బాల కోటి,అదనపు కలెక్టర్ లు మధుసూదన్ నాయక్ రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్ బి హరిప్రియ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాలు




**– ఎమ్మెల్యే డా. రాజేష్ రెడ్డి చేతుల మీదుగా సత్కారం**
**నాగర్ కర్నూల్, ఆగస్టు 15, (వుదయం ప్రతినిధి):**
నాగర్ కర్నూల్ జిల్లా క్లాస్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)లో శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పదవ తరగతి పరీక్షల్లో జిల్లాలోని వివిధ మండలాల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించారు.
ఈ కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్. కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ప్రశంసించారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారిని ప్రోత్సహించడం ద్వారా సమాజంలో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు నగదు పురస్కారాలు అందించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు, కౌన్సిలర్లు మొహమ్మద్ నిజ్జమొదిన్, శంకర్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, క్లాస్‌మెంట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వాసా రాఘవేందర్, సభ్యులు చిగుళ్లపల్లి రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి మాటలన్నీ అబద్ధాల మాటలే

- **సంగారెడ్డి సభలో సీఎం వ్యాఖ్యలపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు**
  **రుణమాఫీ, రైతుబంధు పేరుతో రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్**
- **ఉద్యోగాలపై సీఎం చెప్పిన లెక్కలకు, అసెంబ్లీ సమాధానాలకు పొంతన లేదు**
- **సింగూరు నీటిపై ప్రభుత్వానిదే నిర్లక్ష్యం**
- **సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను పట్టించుకోలే**
- **24 గంటల విద్యుత్ మాటలు వాస్తవం కాదు**
- **యూరియా, డీఏపీ కోసం రైతుల అరిగోస**
- **ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థుల ఇబ్బందులు**
- **మహాలక్ష్మి పథకం హామీని అమలు చేయాలి**
- **రుణమాఫీపై సీఎం నా సవాల్‌ను స్వీకరించాలి**
- **రైతుబంధు, రుణమాఫీ, ఉద్యోగాలపై బహిరంగ చర్చకు సిద్ధమా**
- **ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తాం**

**వుదయం, సిద్దిపేట ప్రతినిధి**
స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. స్వాతంత్ర్య దినోత్సవం నాడు రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై మాట్లాడాల్సిన ముఖ్యమంత్రి చిల్లర రాజకీయాలు, పచ్చి అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో 420 హామీలు ఇచ్చారని, సంగారెడ్డి సభలో సీఎం సరిగ్గా సాయంత్రం 4.20 గంటలకు ప్రసంగం ప్రారంభించి 420 మాటలే మాట్లాడారని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో ఆగస్టు 15న అభివృద్ధి, సాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై మాట్లాడేవారని, రేవంత్‌రెడ్డి మాత్రం సంగారెడ్డి జిల్లాకు సంబంధించిన ఒక్క అభివృద్ధి కార్యక్రమం గురించి కూడా ప్రస్తావించలేదన్నారు.మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాలకు తాగునీరు అందించే సింగూరు ప్రాజెక్టును ఖాళీ చేశారని ఆరోపించారు. నారాయణఖేడ్ తదితర ప్రాంతాల్లో రెండు, మూడు రోజులకు ఒకసారి కూడా తాగునీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.



బీఆర్ఎస్ హయాంలో మంజూరైన మెడికల్, నర్సింగ్ కాలేజీలు, రోడ్లు మినహా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఒక్క కిలోమీటర్ రోడ్డు కూడా వేయలేదని హరీశ్‌రావు ఆరోపించారు. రేషన్ కార్డులు, ఉద్యోగాల విషయంలో సీఎం చెబుతున్న లెక్కలకు, అసెంబ్లీలో ప్రభుత్వం ఇచ్చిన సమాధానాలకు పొంతన లేదన్నారు. ప్రభుత్వం 16 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చామని అసెంబ్లీలో చెప్పి, బహిరంగ సభల్లో 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పడం నిరుద్యోగులను మోసం చేయడమేనని అన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు.రైతుబంధు, రుణమాఫీ విషయంలో ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన దానికంటే ఎక్కువ రైతుబంధు ఇస్తున్నామని సీఎం చెప్పడం అవాస్తవమన్నారు. రెండు ఆర్థిక సంవత్సరాల్లో రైతుబంధు నిధుల్లో రూ.15 వేల కోట్లు తగ్గించారని ఆరోపించారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు.రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరిన హరీశ్‌రావు.. తన గన్‌మెన్లను వదిలి తన సొంత గ్రామానికి రావాలని అన్నారు. అక్కడ వంద శాతం రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని, లేదంటే సీఎం రాజీనామా చేస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 24 గంటల వ్యవసాయ విద్యుత్ సరఫరా జరుగుతోందన్న సీఎం వ్యాఖ్యలను కూడా ఆయన ఖండించారు. పలు సబ్‌స్టేషన్ల లాగ్‌బుక్‌లను పరిశీలించానని, ఎక్కడా 10-11 గంటలకు మించి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కావడం లేదని ఆరోపించారు. యూరియా, డీఏపీ కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

వరి కొనుగోళ్లలో తరుగు తీస్తున్నారని, యాసంగి పంటలకు బోనస్ ఇవ్వలేదని హరీశ్‌రావు ఆరోపించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. మైనింగ్, 22ఏ, రుణమాఫీ, ఎరువులు, స్కాలర్‌షిప్‌ల అంశాలపై తాను ప్రశ్నిస్తుంటే వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై పరువునష్టం దావా వేస్తానని హెచ్చరించారు.రుణమాఫీ, రైతుబంధు, ఉద్యోగాలపై అసెంబ్లీ వేదికగా బహిరంగ చర్చకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధం కావాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ తరఫున ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

## గాయత్రి మంత్రం జపం వల్ల కలిగే ప్రయోజనాలు.....

**శ్రీ గురు పీఠం**
**చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్.....**
**వుదయం న్యూస్**
**శివ్వంపేట ఆగస్ట్ 15......**
మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని గూడూరు గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో కొలువుదీరిన శ్రీ దత్తాత్రేయ మహాస్వామి. శిరిడి సాయి బాబాకు నేడు శ్రావణమాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పెద్దగోని జిన్నారం శివకుమార్ గౌడ్ గాయత్రి మంత్రం గురించి ఆయన ఇలా వివరించారు.గాయత్రీ మంత్రాన్ని క్రమం తప్పకుండా జపించడం ద్వారా జీవితంలో ఉత్సాహం, ఆత్మ విశ్వాసం, సానుకూల ఆలోచనలు పెరుగుతాయని విశ్వసిస్తారు. జపం చేసే సమయంలో మనస్సు నిర్మలంగా, సానుకూలంగా ఉండటం చాలా ముఖ్యమని అంటారు.ఎందుకంటే జపం చేసే వ్యక్తి భక్తి, ఏకాగ్రత, సంకల్పబలం ఆధారంగానే ఫలితాలు లభిస్తాయని నమ్మకం.
గాయత్రీ మంత్రం ప్రాచీన కాలం నుంచి ఆధ్యాత్మిక సాధనలో విశిష్ట స్థానం పొందింది.

ఈ మంత్రాన్ని జపించాలనుకునేవారు గురువు వద్ద నుండి దీక్ష తీసుకుని, ఆయన సూచించిన విధానం, సమయానికి అనుగుణంగా ఆచరించడం ఉత్తమం. ముఖ్యంగా పిల్లలు ఈ మంత్రాన్ని జపించడం వల్ల విద్యలో ఏకాగ్రత పెరిగి, చదువుకు ఎదురయ్యే ఆటంకాలు తొలుగుతాయని విశ్వసిస్తారు. సరైన పద్ధతిలో నిత్యం గాయత్రి మంత్రాన్ని జపించడం ద్వారా వ్యక్తి జీవితంలో విజయాలు సాధించేందుకు మార్గం
శుభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**దేశ ప్రగతికి పునరంకితమవుదాం**
**ప్రతి పౌరుడు తన బాధ్యతను నెరవేర్చాలి**
**2047 విజన్ సాకారానికి యువత చురుకుగా భాగస్వాములు కావాలి**
**.... అడిషనల్ కలెక్టర్ సంగీత**
**సంగారెడ్డి, ఆగస్టు 15:-వు దయం.**
స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సముదాయంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సముదాయ ఆవరణలో జిల్లా అదనపు కలెక్టర్ సంగీత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడుతూ, ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్నామని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల సేవలను ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ స్మరించుకోవడం మన





బాధ్యత అని పేర్కొన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ ప్రగతికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి, దేశ అభివృద్ధిలో భాగస్వామి కావాలని సూచించారు. ముఖ్యంగా యువత నూతన ఆలోచనలు, నైపుణ్యాలతో ముందుకు సాగుతూ 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం లక్ష్యంగా నిర్దేశించిన విజన్‌కు అనుగుణంగా అడుగులు వేయాలని అన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని ఆమె సూచించారు. ప్రజాసేవే ప్రధాన లక్ష్యంగా విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు.
అనంతరం విద్యార్థులకు స్వీట్లు, నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన రెపరేలదిన జాతీయ జెండా ......




శివ్వంపేటఆగస్టు 15,
(వుదయం ప్రతినిధి):
80వ భారత స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని అన్ని గ్రామాలతో పాటు మండల కేంద్రమైన శివంపేటలో శనివారం భారత స్వాతంత్ర ధినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా తాసిల్దార్ కమలాద్రి, ఎంపీడీవో వెంకటలక్ష్మి, సొసైటీ చైర్మన్ చింతల వెంకట్ రాం రెడ్డి, ఎస్ఐ మధుకర్ రెడ్డి, ఎంఈఓ బుచ్చానాయక్, ఏవో లావణ్య, డాక్టర్, కస్తూర్బా ప్రత్యేక అధికారి మంజుల, జడ్పీ హెచ్‌ఎం బాలచంద్రం, సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్, ఏపీఎం పెంటాగౌడ్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శైలేజ, గ్రంథాలయాధికారి అర్చనలు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో ఉప తహాసిల్దార్ బషీర్ హుస్సేన్, ఆర్ఐ నిరంజన్, సొసైటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి ఎంపీఓ తిరుపతి రెడ్డి, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ మల్లేష్ తదితరులు ఉన్నారు.

## బిజినేపల్లిలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**బిజినేపల్లి, ఆగస్టు 15 , (వుదయం ప్రతినిధి):**
బిజినేపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మిద్దె ఇందిరా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జెండాకు వందనం చేశారు.
అనంతరం సర్పంచ్ మిద్దె ఇందిరా మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు దేశ సమైక్యత, అభివృద్ధి కోసం ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.
గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు దేశ భక్తి నినాదాలతో సందడి చేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గడ్డమీది మహేష్, పంచాయతీ కార్యదర్శి బాలరాజు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పాఠశాల విద్యార్థులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి, జాతీయ స్ఫూర్తి తో ఉత్సాహభరితంగా జరిగాయి.





## విద్యార్థులకు బహుమతులు అందజేత


**మిరుదొడ్డి, ఆగస్టు 15, వుదయం:**
అల్వాల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అనంతరెడ్డి మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధినేత గుర్రప్పగారి మాధవ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కావలసిన సౌకర్యాలను ట్రస్ట్ ద్వారా అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలకు దీటుగా సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రైవేటు పాఠశాలలకు కాకుండా ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతమైన విద్యను అభ్యసించాలని సూచించారు. అనంతరం పాఠశాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న గుర్రప్పగారి మాధవరెడ్డిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రవీణ్ బాబు, మాజీ సర్పంచ్ రాజి రెడ్డి, కిష్టయ్య, మాజీ ఉపసర్పంచ్ దిలీప్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు హైమద్, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

## ఏపీఎం లక్ష్మీనరసమ్మకు ఉత్తమ అవార్డు

**మిరుదొడ్డి, ఆగస్టు 15, వుదయం:**
ఐకెపిలో అంకితభావంతో పనిచేస్తూ గ్రామీణ మహిళల అభ్యున్నతికి విశేష సేవలందించిన మిరుదొడ్డి మండల ఏపీఎం లక్ష్మీనరసమ్మకు జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు లభించింది.రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ హైమావతి చేతుల మీదుగా శనివారం ఆమె అవార్డును అందుకున్నారు. మిరుదొడ్డి మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేయడంలో, ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళలకు చేరువ చేయడంలో లక్ష్మీనరసమ్మ కీలకపాత్ర పోషించారు. మహిళలకు రుణాలు అందించేందుకు కృషి చేయడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించి వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడ్డారు.ఈ సందర్భంగా లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ "ఉత్తమ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. ఇది నా బాధ్యతను మరింత పెంచింది. భవిష్యత్తులోనూ మహిళల అభివృద్ధి కోసం మరింత సమర్థవంతంగా పనిచేస్తా" అని అన్నారు.
ఏపీఎం లక్ష్మీనరసమ్మకు ఉత్తమ అవార్డు రావడం పట్ల మహిళా సంఘాల సభ్యులు, ఐకెపి సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.



# 'ఫౌజీ' : పవర్‌ఫుల్ పోస్టర్ విడుదల



వుదయం సినిమా :
బెల్ స్టార్ ప్రభాస్, క్రియేటివ్ డైరెక్టర్ ను రాఘవపుడి, ప్రతిష్టాత్మక బ్యానర్ త్రి మూవీ మేకర్స్, టిసిరీస్ ప్రజెంట్స్ స్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ఫౌజీ' త్యాగానికి నివాళిగా ఇండిపెండెన్స్ స్పెషల్ పోస్టర్ రిలీజ్రెబెల్ స్టార్ ప్రభాస్ స్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ఫౌజీ' డిసెంబర్ 3, 2026న ప్రపంచవ్యా ంగా విడుదల కానుంది. హను రాఘవ డి దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో టిసిరీస్ సమర్పిస్తున్న ఈ రీ పీరియడ్ యాక్షన్ చిత్రానికి నవీన్ ర్నేని, వై. రవిశంకర్, భూషణ్ కుమార్ ర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. టైటిల్ స్టర్ నుండి ప్రీలుక్, ఫస్ట్ లుక్ వరకు, తి ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. 'ఫౌజీ' చిత్ర నిర్మాతలు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బలమైన భావోద్వేగ, చారిత్రక నేపథ్యం ఉన్న పోస్టర్‌ను విడుదల చేశారు. భారతదేశం నేడు జరుపుకుంటున్న స్వాతంత్ర్యం వెనుక ఉన్న త్యాగానికి నివాళిగా నిలిచిన ఈ పోస్టర్ అందరినీ కట్టిపడేసింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సాధారణంగా కనిపించే సంబరాలకు భిన్నంగా.. ఈ పోస్టర్ స్వాతంత్ర్యం వెనుక ఉన్న త్యాగం, పోరాటం, ధైర్యాన్ని గుర్తుచేస్తోంది. యుద్ధంతో ధ్వంసమైన ప్రాంతం, పొగలు, మంటలు, శిథిలాలు పోస్టర్‌లో కనిపిస్తుండగా.. దూరంలో చార్మినార్ ప్రత్యేకంగా కనిపిస్తోంది.ఈరోజు మనం జరుపుకుంటున్న స్వాతంత్ర్యం వెనుక ఎన్నో ఏళ్ల పోరాటం, ధైర్యం, త్యాగం ఉన్నాయనే విషయాన్ని ఈ పోస్టర్ గుర్తుచేస్తోంది. "Saluting the spirit of every Fauzi who fought for our tomorrow" అంటూ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ప్రతి ఫౌజీకి నివాళి అర్పించారు.ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రముఖ నటులు అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భానుచందర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.సుదీప్ ఛటర్జీ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, విశాల్ చంద్రశేఖర్ సంగీతం సమకూరుస్తున్నారు. అనిల్ విలాస్ జాదవ్ ప్రొడక్షన్ డిజైన్, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్. తారాగణం: ప్రభాస్, ఇమాన్వి, మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద, భానుచందర్.



# 'కామ్రేడ్ కళ్యాణ్' అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్

వుదయం సినిమా :
'కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్' శ్రీవిష్ణు 'కామ్రేడ్ కళ్యాణ్'తో అలరించబోతున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఆసక్తికరమైన పీరియడ్ బ్యాక్‌డ్రాప్‌తో పాటు రొమాన్స్, ఎమోషన్స్‌తో రూపొందిస్తున్నారు. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ LLP బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్నారు. 1992లో ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తున్నారు.
విడుదల తేదీని ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్ సినిమా నేపథ్యాన్ని మరింత ఆసక్తికరంగా చూపిస్తోంది. శ్రీవిష్ణు డార్క్ గ్రీన్ దుస్తుల్లో, మెడలో ఎర్రటి కండువాతో కామ్రేడ్ లుక్‌లో కనిపిస్తున్నారు. భుజానికి రైఫిల్, అడవిలో నడుస్తున్న ఆయనతో పాటు సత్య, ముక్కు అవినాష్ కూడా తోటి కామ్రేడ్లుగా కనిపిస్తున్నారు. ఆయుధాలతో ఉన్న ఈ పాత్రలు కథలోని సీరియస్ నేపథ్యాన్ని సూచిస్తుండగా, వారి ముఖాల్లో కనిపించే చిరునవ్వులు సినిమాలో వినోదం, యాక్షన్, ఎమోషన్ కూడా ఉంటాయని హింట్ ఇస్తున్నాయి.రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రల్లో నటిస్తున్నారు.
ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తుండగా, సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. చోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.
దసరా సీజన్‌లో విడుదల తేదీ ఖరారు కావడంతో సినిమా ప్రమోషన్స్‌ను మేకర్స్ మరింత వేగవంతం చేయనున్నారు.
నటీనటులు: శ్రీవిష్ణు, మహిమా నంబియార్, రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే
సాంకేతిక బృందం:
దర్శకత్వం: జానకిరామ్ మారెళ్ల
సమర్పణ: కోన వెంకట్
నిర్మాతలు: వెంకట కృష్ణ కర్నాటి, సీత కర్నాటి
సంగీతం: విజయ్ బుల్గానిన్

## వుదయం సినిమా MOVIE TIME!

# 'సంబరాల ఏటిగట్టు' షూటింగ్ పూర్తి



వుదయం సినిమా :
సుప్రీం హీరో సాయి దుర్గ తేజ్, రోహిత్ కేపీ, కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి, ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ భారీ పాన్ ఇండియా చిత్రం SYG (సంబరాల ఏటిగట్టు) షూటింగ్ పూర్తి, 2027 జనవరి 12 సంక్రాంతికి రిలీజ్
మెగా సుప్రీం హీరో సాయి దుర్గ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా చిత్రం సంబరాల ఏటిగట్టు (SYG) షూటింగ్ మొత్తం విజయవంతంగా పూర్తయింది. నూతన దర్శకుడు రోహిత్ కేపీ దర్శకత్వంలో, ప్రతిష్టాత్మక ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మించిన ఈ అత్యంత ప్రతిష్టాత్మకమైన యాక్షన్ డ్రామా, ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ దశను వేగంగా పూర్తి చేసుకుంటోంది. 2027 సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ పండుగ విడుదల ప్రాజెక్ట్‌పై ఉత్సాహాన్ని మరింత పెంచుతోంది.ఈ చిత్రంలో ఒక అగ్రశ్రేణి బాలీవుడ్ నటుడు కీలక పాత్ర పోషిస్తుండటం, దీని పాన్‌ఇండియా ఎట్రాక్షన్‌ను మరింత పెంచుతోంది. ఐశ్వర్య లక్ష్మి, జగపతి బాబు, సాయి కుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ళ కూడా ఈ తారాగణంలో భాగమై, ప్రముఖ పాత్రలలో కనిపించనున్నారు.ఈ చిత్రానికి ప్రముఖ సాంకేతిక బృందం పని చేస్తోంది. ఎడిటర్ నవీన్ విజయ్ కృష్ణ, ప్రొడక్షన్ డిజైనర్ గాంధీ నడికుడికర్, ఫైట్ మాస్టర్స్ పీటర్ హెయిన్స్, రామ్ లక్ష్మణ్, చేతన్, పృథ్వీ, ఈ చిత్రం విజువల్ వండర్ గా వుండబోతోంది.
తారాగణం: సాయి దుర్గ తేజ్, ఐశ్వర్య లక్ష్మి, జగపతి బాబు, సాయి కుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల
సాంకేతిక సిబ్బంది:
రచన, దర్శకత్వం: రోహిత్ కె.పి
నిర్మాతలు: కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి
బ్యానర్: ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్.

# VISA - రెండో టీజర్ విడుదల



వుదయం సినిమా :
**అక్టోబర్ 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల**

'VISA వింటారా సరదాగా' చిత్రానికి సంబంధించిన రెండో టీజర్ తాజాగా విడుదలై సోషల్ మీడియాలో మంచి స్పందనను సొంతం చేసుకుంటోంది. ఉద్భవ్ రఘు ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆయన తెరకెక్కిస్తున్న ఈ క్విర్కీ క్యాంపస్ టు USA రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ ఎస్. మరియు సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ జంటగా నటిస్తుండగా.. రాహుల్ విజయ్, శివాత్మిక రాజశేఖర్, హర్ష చెముడు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'VISA వింటారా సరదాగా' చిత్రం అక్టోబర్ 17న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.
నటీనటులు: అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ, రాహుల్ విజయ్, శివాత్మిక రాజశేఖర్, హర్ష చెముడు, సత్య, వివా హర్ష, గుండు సుదర్శన్
దర్శకత్వం: ఉద్భవ్ రఘు
నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ ఎస్., సాయి సౌజన్య
నిర్మాణ సంస్థలు: సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్
సంగీతం: విజయ్ బుల్గానిన్
విడుదల: అక్టోబర్ 17



# 'ఇరుముడి' లో ఇప్పటివరకూ చేయని క్యారెక్టర్ చేశాను

వుదయం సినిమా :
హీరోయిన్ ప్రియా భవానీ శంకర్

మాస్ మహారాజా రవితేజ మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఇరుముడి'. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం గ్లింప్స్, ట్రైలర్, పాటలతో ఇప్పటికే భారీ అంచనాలు రేకెత్తించింది. ఆగస్టు 21న థియేటర్లలోకి రాబోతున్న ఈ సినిమా ప్రేక్షకులకు ఎమోషన్స్, యాక్షన్‌తో కూడిన డిఫరెంట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించబోతుంది. ఈ సందర్భంగా హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

ముడిలో కావేరి పాత్ర ఎలా ఉండబోతుంది?
మా మనోజ్ కు ఒక మంచి కమ్ బ్యాక్ అవుతుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి. మైత్రి మూవీ మేకర్స్ గురించి? మైత్రి మూవీ మేకర్స్ ఇండియాలోనే బిగ్గెస్ట్ ప్రొడక్షన్ హౌస్. ప్రతి సినిమాను ఎంతో గ్రాండ్‌గా, ప్యాషన్‌తో నిర్మిస్తున్నారు. ఈ షూటింగ్ అంత తేలిక కాదు. కాకపోతే మైత్రి మేకర్స్ అందరినీ ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. వారి నిర్మాణంలో పని చేయడం మంచి అనుభూతిని ఇచ్చింది.



# 'సైరాబాను' ఫస్ట్ లుక్ రిలీజ్



వుదయం సినిమా :
ఆది సాయికుమార్, రాజేష్ దండా, హాస్య మూవీస్ ప్రేమ, విశ్వాసం, విధి నేపథ్యంలో ఫన్ జర్నీని సూచిస్తున్న పోస్టర్ స్వాతంత్ర్య దినోత్సవ స్ఫూర్తిని అందంగా ప్రజెంట్ చేసిన ఫస్ట్ లుక్ఆది సాయికుమార్ మరో ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'సైరాబాను' పేరుతో తెరకెక్కుతున్న ఈ చిత్రం రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోంది. విభిన్నమైన ప్రేమకథ, ఆసక్తికరమైన పాత్రలు, వినోదంతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఫణి కృష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. కృష్ణకాంత్ పరుచూరి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ పోస్టర్, బిహైండ్ ది సీన్స్ వీడియోలకు మంచి స్పందన రాగా, తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. రామ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, శేఖర్ చంద్ర సంగీతం సమకూరుస్తున్నారు. చోటా కె. ప్రసాద్ ఎడిటింగ్, బ్రహ్మ కదలి ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నటీనటులు: ఆది సాయికుమార్, బాంధవి శ్రీధర్
సాంకేతిక బృందం:
రచన, దర్శకత్వం: ఫణి కృష్ణ సిరికి
నిర్మాత: రాజేష్ దండా
బ్యానర్: హాస్య మూవీస్

# ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ లాంచ్ ఈవెంట్‌లో శాంతి శ్రీహరి

వుదయం సినిమా :
శ్రీమతి. కొండారు శ్రీనివాసరావు సమర్పణలో శ్రీ క్లీంకార సెల్యూలాయిడ్ బ్యానర్ మీద మేఘాంశ్ శ్రీహరి హీరోగా రామ్ నందన్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆస్మాన్'. ఈ సినిమాని వెంకటేష్ కొండారు, శ్రీకాంత్ మన్నెం నిర్మిస్తున్నారు. ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, అరబిక్ భాషల్లో రూపొందుతోంది. స్వర్గీయ నటుడు శ్రీహరి జయంతి సందర్భంగా మూవీ ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను శనివారం నాడు రిలీజ్ చేశారు. మోషన్ పోస్టర్ వీడియో గమనిస్తే.. సినిమాపై ఆసక్తి కలుగుతోంది. పెద్ద అరచేయి మధ్యలో హీరో మేఘాంశ్ కాగడా పట్టుకుని నిలబడి ఉన్నాడు. ఆ అరచేయికి సంబంధించిన నుదురు, దానిపై డిఫరెంట్‌గా డిజైన్ చేసిన బొట్టును కూడా మోషన్ పోస్టర్‌లో గమనించవచ్చు. అరచేయి చుట్టూ జనాలందరూ కాగడాలను పట్టుకుని నిలుచున్నారు. అసలు అరచేయి ఎవరిది? మేఘాంశ్ పాత్ర ఎలా ఉండబోతుందనే క్యూరియాసిటీ అందరిలోనూ క్రియేట్ అవుతోంది.

# విద్యార్థులతో 'హర్ ఘర్ తిరంగ' కార్యక్రమం



వుదయం సినిమా :
**ఈ సందర్భంగా మోహన్ బాబు విశ్వవిద్యాలయం ప్రో-ఛాన్సలర్ విష్ణు మంచు మాట్లాడుతూ..**
'త్రివర్ణ పతాకం మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు, ప్రతి భారతీయుడి ఆశలు, ఆకాంక్షలకు ప్రతీక. మోహన్ బాబు విశ్వవిద్యాలయం, శ్రీ విద్యానికేతన్ అంతర్జాతీయ పాఠశాల నుండి వేలాది మంది విద్యార్థులు ఇంతటి ఉత్సాహంతో కలిసి రావడం ఎంతో స్ఫూర్తిదాయకం. విద్యాసంస్థలుగా, కేవలం విద్యాపరంగానే కాకుండా, దేశం పట్ల తమ బాధ్యత గురించి కూడా స్పృహ కలిగిన యువతరాన్ని తీర్చిదిద్దడం మన బాధ్యత' అని అన్నారు. మోహన్ బాబు విశ్వవిద్యాలయం, శ్రీ విద్యానికేతన్ అంతర్జాతీయ పాఠశాల విద్యార్థుల భాగస్వామ్యం, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల హృదయభాగంలో ఉండే ఐక్యతా స్ఫూర్తిని, సామూహిక గర్వాన్ని ప్రతిబింబించింది. ఈ త్రివర్ణ ర్యాలీ.. విశ్వవిద్యాలయ, పాఠశాల విద్యార్థుల్ని ఒకచోట చేర్చి, దేశభక్తిని, జాతీయ పతాకం పట్ల గౌరవాన్ని పంచుతూ ఒక చిరస్మరణీయ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకగా నిలిచింది.

# 'అమీర్ లోగ్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో 'లిటిల్ హార్ట్స్' డైరెక్టర్



వుదయం సినిమా :
'అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మించిన 'అమీర్ లోగ్' మూవీకి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకి మనోహర్ రెడ్డి మంచురి సహ నిర్మాతగా వ్యవహరించారు.ఈ క్రమంలో నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో..'లిటిల్ హార్ట్స్' డైరెక్టర్ సాయి మార్తాండ్ మాట్లాడుతూ .. "అమీర్ లోగ్' సాంగ్స్ బాగున్నాయి. టీజర్, ట్రైలర్ నాకు నచ్చింది. సాయి స్మరణ్ మ్యూజిక్ అంటే నాకు చాలా ఇష్టం. హరి నాకు మంచి మిత్రుడు. రమణ రెడ్డి గారు పెద్ద ఆర్కిటెక్ట్. ఆయన ఈ మూవీని ఎంతో అద్భుతంగా తీశారు. ఇది చాలా రియలిస్టిక్‌గా, రా గా అనిపించింది. 'ఫలక్‌నుమా దాస్' రేంజ్‌లో విజయం సాధిస్తుందనిపిస్తోంది. ఆగస్ట్ 21న రాబోతోన్న ఈ మూవీని అందరూ చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.